20 . 09. 2025

VELTHURU TELUGU DAILY

# వెలుతురు

శనివారం | రంగారెడ్డి , నల్లగొండ

సంపుటి :07 సంచిక : 113 , పేజీలు : 12 వెల:రూ.5/-

SRI SHANTHI PUBLICATIONS PUBLISHED FROM TELANGANA | ANDHRA PRADESH

తెలుగు దిన పత్రిక

www.velthuru.com

velthuru Newspaper



బల్కంపేట శ్రీ రేణుక ఎల్లమ్మ పోచమ్మ ఆలయంలో జరిగే దేవి నవరాత్రి ఉత్సవాలుకు రావాల్సిందిగా మంత్రి పొన్నం ప్రభాకర్ గారిని ఆహ్వానించిన ఆలయ ఈవో, దేవాదాయ శాఖ అధికారులు ,ఆలయ అర్చకులు

హైదరాబాద్ వెలుతురు సెప్టెంబర్ 19:

# సెప్టెంబర్ 30లోపు స్థానిక ఎన్నికలు అసాధ్యం

- కందువాలు కప్పినంత మాత్రాన పార్టీ మారినట్లు కాదు
- ఎమ్మెల్యేల వ్యవహారంపై స్పీకర్‌దే తుది నిర్ణయం
- కెసిఆర్ కుటుంబంలో అంతర్గత కలహాలకు కవిత బలి
- కాళేశ్వరంపై సిబిఐ విచారణలో కిషన్ రెడ్డి మోకాలడ్డు
- మీడియాతో చిట్‌చాట్‌లో సిఎం రేంవత్ రెడ్డి వ్యాఖ్యలు
- సిఎంతో భేటీ అయిన న్యూజెర్సీ గవర్నర్





**న్యూఢిల్లీ,సెప్టెంబరు19 ( వెలుతురు):** స్థానిక సంస్థల ఎన్నికలపై తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డికీలక వ్యాఖ్యలు చేశారు. శుక్రవారం ఢిల్లీలో మీడియాతో సీఎం రేవంత్‌రెడ్డి చిట్‌చాట్ చేశారు. సెప్టెంబర్ 30వ తేదీలోపు స్థానిక ఎన్నికలు జరపడం కష్టమని తెలిపారు. పార్టీ ఫిరాయింపు ఎమ్మెల్యేలపైనా స్పందించారు . కందువాలు కప్పినంత మాత్రాన పార్టీ మారినట్లు కాదని స్పష్టం చేశారు. పార్టీ మారిన ఎమ్మెల్యేల అనర్హత అంశంపై స్పీకర్ నిర్ణయం తీసుకుంటారని చెప్పుకొచ్చారు. బీఆర్ఎస్ ఫిర్యాదు చేసిన ఎమ్మెల్యేల జీతాల నుంచి రూ.5000లు ఆ పార్టీకే వెళ్తుందని అన్నారు. నిధులు సైతం బీఆర్ఎస్‌కే వెళ్తున్నాయని తెలిపారు. అసెంబ్లీ వేదికగా మాజీ మంత్రులు హరీశ్‌రావు, కేటీఆర్ తమకు 37 మంది ఎమ్మెల్యేల బలం ఉందని, సమయం కేటాయించాలని కోరారని సీఎం రేవంత్ రెడ్డి గుర్తుచేశారు. ఈ



## అస్తవ్యస్తమైన జనజీవనం

- హైదరాబాద్‌లో దంచి కొడుతున్న వాన
- వరదల బారిన అనేక ప్రాంతాలు
- మరో మూడు రోజులు ఇదే పరిస్థితి
- పలుచోట్ల భారీ వర్షాలు కురిసే అవకాశం
- నాలుగు జిల్లాలకు ఎల్లో హెచ్చరికలు జారీ

## సాయుధ పోరాట విరమణ ఆలోచనే లేదు

### మావోయిస్టు నేత జగన్ కీలక ప్రకటన!!

### బహిరంగ ప్రకటనకు ఖండన

**హైదరాబాద్,సెప్టెంబరు19( వెలుతురు):** కామ్రేడ్ సోను పద్ధతిపై అధికారిక ప్రతినిధి జగన్ తీవ్ర అభ్యంతరం వ్యక్తం



# సురేఖమ్మ... నువ్వు సల్లంగుండాలె..

డెత్ గ్రాట్యూటీ సత్వరంగా ఇప్పించినందుకు మంత్రికి బాధిత కుటుంబీకుల కృతజ్ఞతలు

20 బాధిత కుటుంబాలకు రూ. కోటి ఐదు లక్షలు అందజేసిన మంత్రి సురేఖ

**హైదరాబాద్ వెలుతురు సెప్టెంబర్ 19:** స్టేట్ ఎండోమెంటు శాఖ పరిధిలోని పలువురికి డెత్ గ్రాట్యూటీ సత్వరంగా ఇప్పించినందుకు రాష్ట్ర మంత్రి కొండా సురేఖకి బాధిత కుటుంబీకులు ఆత్మీయ కృతజ్ఞతలు తెలిపారు. సురేఖమ్మ నువ్వు సల్లంగుండాలె అంటూ భావోద్వేగ వచనాలతో ప్రత్యేకంగా ధన్యవాదాలు తెలిపారు. రాష్ట్ర దేవాదాయ శాఖ పరిధిలో విధి నిర్వహణలో మరణించిన కుటుంబాలకు డెత్ గ్రాట్యూటీని శుక్రవారం రాష్ట్ర అటవీ, పర్యావరణ, దేవాదాయ శాఖ

## కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు సంయుక్తంగా ఇళ్ల నిర్మాణం

### - ఎమ్మెల్యే పాయల్ శంకర్

**ఆదిలాబాద్ వెలుతురు సెప్టెంబర్ 19:** నిరుపేదలకు సొంతింటి కలలు సహకారం చేసేందుకు కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు సంయుక్తంగా ఇండ్ల నిర్మాణాలు చేపడుతుందని ఎమ్మెల్యే పాయల్ శంకర్ అన్నారు. ఆదిలాబాద్ జిల్లా జైనథ్, బోరజ్ మండలాల్లో



## ఎకో టూరిజం హబ్ దిశగా తెలంగాణ

### నీలాద్రి అభివృద్ధి మీద ప్రత్యేక చొరవ చూపాలి

- సెక్రటేరియట్ ఎకో టూరిజం స్క్రీనింగ్ కమిటీ భేటీ
- రాష్ట్ర అటవీ, పర్యావరణ శాఖ మంత్రి కొండా సురేఖ

**హైదరాబాద్ వెలుతురు సెప్టెంబర్ 19:** తెలంగాణను ఎకో టూరిజం హబ్ గా తీర్చిదిద్దేందుకు తాము కృషి చేస్తున్నామని.. రాష్ట్రంలోని పలు ప్రాంతాల్లో ఇప్పటికే ఎకో టూరిజం కోసం గుర్తించిన సైట్లలో సమగ్రంగా అభివృద్ధి చేపట్టాలని రాష్ట్ర అటవీ, పర్యావరణ, దేవాదాయ శాఖ మంత్రి కొండా సురేఖ పేర్కొన్నారు. తెలంగాణ రాష్ట్రాన్ని జాతీయ, అంతర్జాతీయ పర్యాటక రంగంలో ఒక ప్రత్యేక ఎకో-టూరిజం హబ్‌గా అభివృద్ధి చేయడం



## ఇందిరమ్మ ఇండ్ల మంజూరులో లంచగొండులపై కఠినచర్యలు

- ఇండ్లు ఇవ్వకుండానే చెల్లింపులు చేసిన నలుగురు అధికారులు సస్పెన్షన్
- 10 వేలు డిమాండ్ చేసిన ఇందిరమ్మ కమిటీ సభ్యుడు తొలగింపు
- 30 వేలు డిమాండ్ అంశంపై తక్షణ నివేదికకు ఆదేశం
- లంచమడిగితే టోల్ ఫ్రీ నెంబర్ 18005995991కు కాల్ చేయండి
- డబ్బుల కోసం పేదలను వేధిస్తే 24 గంటల్లో క్రిమినల్ కేసుల నమోదు
- ఇండ్ల కోసం ఇచ్చిన నిధులను పాతబాకీకి జమ చేసే బ్యాంకులపై చర్యలు
- కాల్‌సెంటర్‌కు వచ్చిన ఫిర్యాదులపై సుదీర్ఘంగా సమీక్షించిన

### రాష్ట్ర రెవెన్యూ, హౌసింగ్ , సమాచార పౌరసంబంధాల శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి

**హైదరాబాద్ వెలుతురు సెప్టెంబర్ 19:** పేదవాడి సొంతింటి కలను నెరవర్చే సంకల్పంతో గౌరవ ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి గారి నేతృత్వంలో రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా చేపట్టిన ఇందిరమ్మ ఇండ్ల మంజూరు, చెల్లింపుల విషయంలో అవినీతికి పాల్పడితే ఎంతటివారినైనా ఉపేక్షించబోమని రాష్ట్ర రెవెన్యూ, హౌసింగ్ , సమాచార పౌరసంబంధాల శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి హెచ్చరించారు. ఇందిరమ్మ ఇండ్ల లబ్దిదారుల సమస్యలు, సందేహాలకోసం గత వారం హౌసింగ్ కార్పోరేషన్‌లో ప్రారంభించిన కాల్‌సెంటర్‌కు వచ్చిన ఫిర్యాదులపై డాక్టర్ బి.ఆర్. అంబేద్కర్ రాష్ట్ర సచివాలయంలోని తన ఛాంబర్‌లో శుక్రవారం నాడు హౌసింగ్ కార్పొరేషన్ ఎండీ విపి గౌతమ్, సెంటర్ ఫర్ గుడ్ గవర్నెన్ ( సిజిజి) ఎడిజీ సంగ్రామ్ సింగ్ పాటిల్ తోకలిసి మంత్రిగారు సుదీర్ఘంగా సమీక్షించారు. ఏ ఏ అంశాలపై కాల్ సెంటర్‌కు ఫిర్యాదులు వస్తున్నాయని



## ఎమ్మెల్యేలను దొంగిలించడం నేరం కాదా?




- ఓట్ల చోరీ కంటే ఎమ్మెల్యేల చోరీ పెద్దది
- దమ్ముంటే వారితో రాజీనామాలు చేయించాలి
- రాహుల్ గాంధిది రెండు నాల్కల ధోరణి
- బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్

**హైదరాబాద్,సెప్టెంబరు19( వెలుతురు):** ఓట్ చోరి కంటే ఎమ్మెల్యేల చోరి పెద్ద నేరం అని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ స్పష్టం చేశారు. ఎమ్మెల్యేల చోరిపై మాట్లాడకపోవడం రాహుల్ రెండు నాల్కల ధోరణికి నిదర్శనమని.. పార్టీ మారిన పది మంది ఎమ్మెల్యేలతో రాజీనామా చేయిస్తేనే ఓట్ చోరిపై మాట్లాడే నైతిక అర్హత

## సమర్థ నీటి నిర్వహణతో కరువును పారద్రోలుతాం

- భూగర్భ జలాలు పెంచుకోవాల్సి ఉంది
- డిసెంబరు 25 నాటికి పోలవరం డయాఫ్రమ్ వాల్ పూర్తి
- ఉమ్మడి ఏపిలో అధికా ప్రాజెక్టులు తానే ప్రారంభించా
- నల్లగొండ ఫ్లోరైడ్ నిర్మూలనకు శ్రీశైలం నీటిని తరలించా
- నదుల అనుసంధానానికి తాము సిద్ధంగా ఉన్నాం
- నీటి పారుదల ప్రాజెక్టులపై సిఎం చంద్రబాబు ప్రకటన



**అమరావతి,సెప్టెంబరు19 (వెలుతురు):** నీటిని సమర్థంగా నిర్వహిస్తే కరవు అనే మాట రాదని ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి చంద్రబాబు పేర్కొన్నారు. ఎక్కడికక్కడ భూగర్భ జలాలను పెంచుకోవాల్సిన అవసరం ఉందని, ఈ మేరకు చర్యలు తీసుకోవాలని సూచించారు. సరైన వినియోగంతో రాష్ట్రంలో 700 టీఎంసీల మేర భూగర్భ జలాలు పెరుగుతాయని చెప్పారు. పదేళ్లలో 439 టీఎంసీలు కృష్ణా డెల్టాకు తీసుకొచ్చినట్లు- తెలిపారు. డిసెంబరు 25 నాటికి పోలవరం



వెలుతురు

## సురేఖమ్మ... నువ్వు సల్లంగుండాలె..

మంత్రి కొండా సురేఖ అందజేశారు. అయితే, డెత్ గ్రాట్యూటీ ఇచ్చినందుకు దేవాదాయ శాఖ మంత్రి సురేఖకి బాధిత కుటుంబ సభ్యులు కృతజ్ఞతలు తెలిపారు. శుక్రవారం తన పేషీలో 20 బాధిత కుటుంబాలకు రూ. కోటి ఐదు లక్షలు స్వయంగా ఇచ్చారు. విధి నిర్వహణలో చనిపోయిన ఆరుగురు ఎండోమెంటు ఉద్యోగుల కుటుంబాలకు, రీటైర్ అయిన ఉద్యోగులకు, ఉపనయనం బెనిఫిట్స్, ఎడ్యుకేషన్ లోన్ సంబంధిత సాయాలను అందజేశారు. అయితే, ఈ గ్రాట్యూటీ ప్రక్రియను వేగవంతం చేసి, తమకు గ్రాట్యూటీ ఫండ్ త్వరితగతిన వచ్చేందుకు సాయం చేసిన మంత్రి సురేఖకు బాధిత కుటుంబీకులు ధన్యవాదాలు తెలిపారు. ఈ సందర్భంగా మంత్రి సురేఖ మాట్లాడుతూ ఎండోమెంటు ఉద్యోగులకు ఎటువంటి కష్టం వచ్చినా తాను ఎల్లవేళలా అండగా ఉంటానని భరోసానిచ్చారు. విధి నిర్వహణలో ప్రాణాలు కోల్పోయిన కుటుంబాల బాగోగులను మంత్రి సురేఖ స్వయంగా అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా బాధిత మహిళలు మంత్రితో తమ సమస్యలు చెప్పుకుంటూ వాపోయారు. డ్యూటీలో తమ భర్త చనిపోవడంతో తమ కుటుంబాలు ఆర్థికంగా చితికిపోతున్నాయని మంత్రి దృష్టికి పలువురు మహిళలు తీసుకొచ్చారు. అయితే, ఆర్థిక ఇబ్బంది ఉన్న మహిళలకు అండగా నిలిచేందుకు ఏదైనా మార్గాలను అన్వేషించి, తగు న్యాయం చేయాలని ఎండోమెంటు ఉన్నతాధికారులను ఆదేశించారు. మన దేవాదాయ శాఖ కోసం సేవలు అందిస్తున్న క్రమంలో మరణించిన వారి కుటుంబాలకు కేవలం గ్రాట్యూటీ ఇచ్చి సరిపెట్టొద్దని, ఎక్కడ ఏ విధంగా సాధ్యమైనా మన బాధ్యతగా సాయం చేయాల్సిన అవసరం ఉందని మంత్రి సురేఖ గుర్తు చేశారు. మంత్రి సురేఖ స్పందనకు బాధిత మహిళలు కన్నీరు పెడుతూ భావోద్వేగానికి గురయ్యారు. వారిని మంత్రి సురేఖ ఓదార్చారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర దేవాదాయ శాఖ ప్రిన్స్ పల్ సెక్రటరీ శైలజా రామయ్యర్, అడిషనల్ కమిషనర్ కృష్ణవేణి, వెంకటేశ్, రామకృష్ణరావు, పీఎస్ సోమరాజు, ఓఎస్డీ సుమంత్ తదితరులు పాల్గొన్నారు.

**మంత్రి సురేఖ గ్రాట్యూటీ కింద అందజేసిన గ్రాంటు వివరాలు**

| | |
|---|---|
| డెత్ గ్రాట్యూటీ | రూ. 8 లక్షలు |
| డెత్ ఎక్స్ గ్రేషియా | రూ. 50 వేలు |
| అంత్యక్రియల ఖర్చు | రూ. 30 వేలు |
| ఉద్యోగ సమయంలో అంగ వైకల్యం | రూ. 2 లక్షలు |
| వైద్య ఖర్చుల చెల్లింపు | రూ. 2 లక్షలు |
| విద్యా సదుపాయం | రూ. 2 లక్షలు |
| ఉపనయన గ్రాంటు | రూ. 50 వేలు. |

## కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు సంయుక్తంగా ఇళ్ల నిర్మాణం



పలు గ్రామాల్లో ఇళ్ల నిర్మాణ భూమి పూజ కార్యక్రమంలో శుక్రవారం ఎమ్మెల్యే పాల్గొన్నారు. ఈ సందర్భంగా బోరోజ్ మండలంలోని పెండల్వాడా, లేఖర్ వాడ, బాలాపూర్, షావాపూర్ గ్రామాలలో ప్రధానమంత్రి ఆవాస్ యోజన, ఇందిరమ్మ ఇండ్ల నిర్మాణానికి లబ్దిదారులతో కలిసి ఎమ్మెల్యే భూమి పూజ చేశారు. ముందుగా ఆయా గ్రామాలకు వచ్చిన ఎమ్మెల్యే కు డప్పు చప్పులతో గ్రామస్తులు ఘనంగా స్వాగతం పలికి, శాలువాతో సత్కరించి సన్మానించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ చిట్ట చివరి వరసలో ఉన్న నిరుపేదలకు సొంతిల్లు ఉండాలని లక్ష్యంతో ప్రధానమంత్రి ఆవాస్ యోజన పథకం కింద ఇంటి నిర్మాణాలు చేపట్టడం జరుగుతుందన్నారు. లబ్ధిదారులు మధ్య దళారులను నమ్మకుండా నేరుగా లబ్ధిదారులే నిర్మాణ పనులను చేపట్టుకోవాలని సూచించారు. ఆదిలాబాద్ నియోజకవర్గానికి 5,500 ఇండ్లు మంజూరు చేయించడం జరిగిందన్నారు. ఎన్నికల సమయంలోనే రాజకీయాలు, ఎన్నికల తర్వాత అభివృద్ధి కార్యక్రమాలపైనే దృష్టి సారించడం జరుగుతుందన్నారు. ఈ కార్యక్రమంలో పలువురు బిజెపి నాయకులు.. కరుణాకర్ రెడ్డి రాందాస్ అశోక్ రెడ్డి నరేష్ సన్నీ . వెంకన్న. జైపాల్. ముకున్. ఉల్లాస్ రెడ్డి. రాకేష్. రాజు వేణు.. గ్రామస్తులు పాల్గొన్నారు

## ఇందిరమ్మ ఇండ్ల మంజూరులో లంచగొండులపై కఠినచర్యలు

అధికారులను అడిగి తెలుసుకొని తక్షణ చర్యలకు ఉపక్రమించారు.ఇందిరమ్మ ఇండ్ల మంజూరుకు లబ్దిదారుల నుంచి లంచం అడిగే ఇందిరమ్మ కమిటీ సభ్యులను తక్షణం కమిటీ నుంచి తొలగించి క్రిమినల్ కేసు నమోదు చేయాలని అధికారులను ఆదేశించారు. దీనికి సంబంధించి సూర్యాపేట జిల్లా మధిరాల మండలం పోలుమల్ల గ్రామంలో కొండ లింగయ్య అనే వ్యక్తికి ఇందిరమ్మ ఇల్లు మంజూరు కోసం పదివేల డిమాండ్ చేసిన ఇందిరమ్మ కమిటీ సభ్యుడు సత్తెయ్యను, జనగాం జిల్లా దేవరుప్పల మండలం పడమటి తండాలో శివమ్మ అనే లబ్దిదారురాలి నుంచి 30 వేల రూపాయిలు ఇవ్వాలని గ్రామ పంచాయితీ సెక్రటరీ డిమాండ్ చేశారని ఫిర్యాదురాగా విచారణలో ఇందిరమ్మ కమిటీ సభ్యుని పాత్ర ఉందని తేలింది. దీంతో ఈ అంశంపై పూర్తిస్థాయి విచారణ జరిపి 24గంటల్లో నివేదిక ఇవ్వాలని మంత్రిగారు ఆదేశించారు. కాల్‌సెంటర్ కు వచ్చిన ఫిర్యాదులపై మంత్రి పై విధంగా స్పందించారు. అదేవిధంగా ఖమ్మం, జగిత్యాల, కొత్తగూడెం, ఆదిలాబాద్ జిల్లాల్లో ఇండ్లు మంజూరుకాని నలుగురికి వారి ఖాతాలో నిధులు జమచేసిన గ్రామ పంచాయితీ సెక్రటరీలను తక్షణమే సస్పెండ్ చేసి ఈసంఘటనపై పూర్తిస్థాయి విచారణ జరిపించాలని అధికారులకు సూచించారు. ఇందిరమ్మ ఇండ్ల లబ్దిదారులకు ఇంటి నిర్మాణ దశలను బట్టి ప్రతి సోమవారం నిధులు మంజూరు చేస్తున్నామని, అయితే కొన్ని బ్యాంకులు ఈ నిధులను లబ్దిదారుల ఖాతాలో జమచేసి పాత బకాయి కింద జమ చేసుకుంటున్నాయని, ఇటువంటి చర్యలను సహించేదిలేదని, సదరు బ్యాంకులపై చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు. దీనిపై రాష్ట్ర స్థాయి బ్యాంకర్ల కమిటీకి లేఖ రాయాలని హౌసింగ్ ఎండీని ఆదేశించారు. ఆధార్ నెంబర్ ఆధారంగా చెల్లింపుల్లో ఎదురవుతున్న సమస్యలను ఈనెల 25వ తేదీలోగా పరిష్కరించి దసరా పండగలోపు చెల్లింపులు పూర్తిచేయాలని అధికారులను ఆదేశించారు. ఏఈ లు కూడా ప్రతిగ్రామంలో లబ్దిదారుని వద్దకు వెళ్లి ఆధార్, బ్యాంకు వివరాలను పరిశీలించాలని లబ్దిదారుడు కూడా బ్యాంకుకు వెళ్లి ఆధార్‌నెంబర్‌తో బ్యాంకు ఖాతాను అనుసంధానం చేసుకోవాలని సూచించారు. ఆధార్ నెంబర్ గాని, పేరుగాని తప్పు ఉంటే గ్రామ కార్యదర్శి ఎంపీడీవో దృష్టికి తీసుకువెళ్లి సరిచేసుకోవాలన్నారు. త్వరలో లబ్దిదారుడే స్వయంగా ఈ దిద్దుబాటు చేసుకొనేలా యాప్‌ను తయారుచేశామని, ఒకటి రెండు రోజుల్లో ఇది అందుబాటులోకి వస్తుందన్నారు. సాంకేతికపరంగా మరింత పకడ్బందీగా చర్యలు తీసుకోవాలన్నారు. ఇందిరమ్మ ఇండ్ల విషయంలో పేదలను ఇబ్బందిపెట్టి డబ్బుల వసూళ్లకు పాల్పడితే ఫిర్యాదు అందిన 24 గంటల్లోనే చర్యలు తీసుకుంటామని కాల్ సెంటర్‌కు వచ్చిన ఫిర్యాదును తక్షణం ఆయా జిల్లా కలెక్టర్ , ఎస్పీకి పంపడంతోపాటు సచివాలయంలోని తన కార్యాలయానికి కూడా పంపించాలని అధికారులకు సూచించారు. ఇటువంటి ఫిర్యాదులపై తమ కార్యాలయం కూడా మానిటరింగ్ చేస్తుందని తెలిపారు. లంచమడిగితే టోల్ ఫ్రీ నెంబర్ 18005995991కు కాల్ చేసి వివరాలను తెలియజేస్తే 24 గంటల్లో యాక్షన్ తీసుకుంటామని భరోసా ఇచ్చారు.

## పులి దాడిలో ముగ్గురు మృతి

**- తెలంగాణ సరిహద్దుల్లో ఘటన**

**హైదరాబాద్, సెప్టెంబరు19 ( వెలుతురు):**

తెలంగాణ సరిహద్దుల్లో పులుల దాడులు దడ పుట్టిస్తున్నాయి. మహారాష్ట్రలోని చంద్రపూర్ జిల్లాలో జరిగిన ఈ పులుల దాడుల్లో ముగ్గురు మృత్యువాత పడ్డారు. ఒకే రోజు వేర్వేరు చోట్ల ముగ్గురిపై దాడి చేశాయి. మృతుల్లో ఓ మహిళ, ఓ పురుషుడు, ఓ బాలుడు ఉన్నాడు. ఈ మూడు ఘటనలతో చంద్రపూర్ జిల్లాలో జనం ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. మహారాష్ట్రలోని చంద్రపూర్ జిల్లా బ్రహ్మపురి అటవీ ప్రాంతంలో పులి దాడిలో లాఖపూర్ గ్రామానికి చెందిన సునీల్ రౌత్ (32) అనే పశువుల కాపరి మృతి చెందాడు. గ్రామ సమీపంలో అటవీ ప్రాంతంలో పశువులు మేపడానికి వెళ్లిన సునీల్ పై పొదల్లో దాక్కుని ఉన్న పులి దాడి చేసి చంపేసింది. చిమూర్ తాలూకాలోని మౌజా లావరీ గ్రామానికి చెందిన మహిళ విద్యా కైలాస్ మస్రామ్ (40) తన పొలంలో పనికి వెళ్లినప్పుడు ఆమెపై దాడి చేయడంతో ఆమె అక్కడికక్కడే మృతి చెందింది. ఈ ఘటనతో మౌజా లావరీ గ్రామస్తులు భయాందోళనకు గురయ్యారు. సిందేవాహి తాలూకాలోని గడ్బోరి గ్రామంలో గురువారం రాత్రి ప్రశీల్ బాబన్ మంకర్ (9)అనే బాలుడిని ఇంటి ప్రాంగణం నుంచి చిరుత పులి అటవీ ప్రాంతంలోకి లాక్కెళ్లింది. అటవీ ప్రాంతంలో బాలుడి మృత దేహం గుర్తించారు. ఈ ప్రాంతంలో వన్య ప్రాణులతో ముప్పు ఉందని గ్రామస్తులు బిక్కు బిక్కుమంటూ కాలం గడుపుతున్నారు. అధికారులకు ఎన్నిసార్లు చెప్పినా చర్యలు తీసుకోవడం లేదని ఆగ్రహం వ్యక్తం చేశారు.

# సెప్టెంబర్ 30లోపు స్థానిక ఎన్నికలు అసాధ్యం

సందర్భంగా ఆయన బీఆర్ఎస్, బీజేపీ, ఇతర పార్టీలకు సంబంధించిన పలు అంశాలపై కీలక వ్యాఖ్యలు చేశారు. కేసీఆర్ కుటుంబంలో అంతర్గత కలహాలు ఉన్నాయని, కాళేశ్వరం ప్రాజెక్టుపై సీబీఐ దర్యాప్తును కేంద్రం అడ్డుకుంటోందని ఆరోపించారు. కేసీఆర్, కేటీ-ఆర్, హరీష్ రావు, సంతోష్ రావు కలిసి ఒక ఆడపిల్ల (కవిత)పై దాడి చేయాలని చూస్తున్నారని రేవంత్ రెడ్డి ఆరోపించారు. ఇది వారి కుటుంబ సమస్య అని, దీనికి తనకు ఎలాంటి సంబంధం లేదని స్పష్టం చేశారు. నేను ఎక్కడా కవితకు సపోర్ట్ చేయడం లేదు. ఇది వారి ఇంటి సమస్య. ఆస్తి తగాదాల వల్ల వారి కుటుంబ సమస్యలు బజారున పడ్డాయి. ప్రజలు కేసీఆర్ కుటుంబాన్ని తిరస్కరించారు. ఆ నలుగురిని తెలంగాణ ప్రజలు బహిష్కరించారని రేవంత్ రెడ్డి అన్నారు. కాళేశ్వరం ప్రాజెక్టుపై సీబీఐ దర్యాప్తు చేయిస్తామని గతంలో కిషన్ రెడ్డి చెప్పారని, కానీ ఇప్పుడు ఎందుకు వెనకడుగు వేస్తున్నారని సీఎం రేవంత్ ప్రశ్నించారు. సీబీఐకి అప్పగిస్తే 48 గంటల్లో దర్యాప్తు జరుపుతామని కిషన్ రెడ్డి గతంలో చెప్పారు. కానీ ఇప్పటివరకు ఎందుకు మాట్లాడటం లేదు? కేటీఆర్ ఏం చెబితే కిషన్ రెడ్డి అది చేస్తారు. సీబీఐ ఎఫ్ఐఆర్ నమోదు చేస్తే అన్ని వివరాలు ఇచ్చేందుకు రాష్ట్ర ప్రభుత్వం సిద్ధంగా ఉంది. ఈ కేసు నుంచి సీబీఐ మొదటి నుంచి దర్యాప్తు చేయాలి. రాష్ట్ర ప్రభుత్వ నివేదిక ఆధారంగా దర్యాప్తు చేస్తే అన్ని వివరాలు బయటకు వస్తాయి. కాళేశ్వరం సీబీఐ విచారణ జరపకుండా కిషన్ రెడ్డి అడ్డుకుంటున్నారని రేవంత్ రెడ్డి ఆరోపించారు. హైదరాబాద్ మెట్రో రైలుపై మాట్లాడుతూ, ఎల్ అండ్ టి తీసుకునే నిర్ణయాలపై ప్రభుత్వం ఆలోచిస్తుందని చెప్పారు. 'ఎల్ అండ్ టి ప్రభుత్వ నిబంధనలకు అనుగుణంగా పని చేయాలి. కేంద్ర ప్రభుత్వం ఎల్ అండ్ టితో ఒప్పందం కుదుర్చుకోవాలని చెబుతోంది. ఇప్పటివరకు ఎలాంటి నిర్ణయం బయటకు పోతుందని ఎక్కడ చెప్పలేదని రేవంత్ రెడ్డి అన్నారు. డ్రగ్స్ నియంత్రణకు తమ ప్రభుత్వం కఠిన చర్యలు తీసుకుంటుందని తెలిపారు. మా ప్రభుత్వం ఏర్పడినప్పటి నుంచి డ్రగ్స్‌ను కంట్రోల్ చేస్తున్నాం. మా ఈగల్ టీం గోవా వెళ్లి డ్రగ్స్‌తో సంబంధం ఉన్నవారిని పట్టుకుంది. హైదరాబాద్‌లో దొరికిన డ్రగ్స్ తయారీ కంపెనీ గత ప్రభుత్వంలోనే ఏర్పడింది. కేటీఆర్ బామ్మర్ది ఫామ్‌హౌస్‌లో డ్రగ్స్‌తో దొరికారని ఆరోపించారు. 2014-19 మధ్య టీఆర్ఎస్ ప్రభుత్వంలో ఒక్క మహిళా మంత్రి కూడా లేరని విమర్శించారు. మహిళా రిజర్వేషన్ల కోసం కాంగ్రెస్ పార్టీ పోరాడుతుందని, చట్టసభల్లో, లోకల్ బాడీ ఎన్నికల్లో మహిళలకు 33శాతం రిజర్వేషన్ కల్పించేందుకు ప్రభుత్వం ముందుకు వెళ్తుందని తెలిపారు. కండువాలు కప్పినంత మాత్రాన పార్టీ మారినట్లు- కాదు. హరీష్ రావే మాకు 37 మంది ఎమ్మెల్యేల మద్దతు ఉందని అసెంబ్లీలో చెప్పారు. పార్టీ మారిన ఎమ్మెల్యేల అనర్హతపై స్పీకర్ నిర్ణయం తీసుకుంటారని రేవంత్ రెడ్డి అన్నారు. రాష్ట్రంలో యూరియా కొరతకు కేంద్ర ప్రభుత్వమే కారణమని ఆరోపించారు. రాష్ట్రానికి 9 లక్షల మెట్రిక్ టన్నుల యూరియా అవసరం. ప్రస్తుతం 2 లక్షల మెట్రిక్ టన్నుల కొరత ఉంది. బీజేపీ, టీఆర్ఎస్ ఈ విషయంలో రాజకీయాలు చేస్తున్నాయని విమర్శించారు. నక్సలైట్లు- లొంగిపోవడానికి రాష్ట్ర, కేంద్ర ప్రభుత్వాలు పాలసీలు తీసుకొచ్చాయని చెప్పారు. -టెర్రరిస్టులతో చర్చలు జరపడానికి కేంద్రం సిద్ధంగా ఉన్నప్పుడు, నక్సలైట్లతో చర్చలు చెప్పడానికి ఇబ్బంది ఏంటని ప్రశ్నించారు. లోకేష్ నాకు తమ్ముడు లాంటివాడు అని కేటీఆర్ చెప్పారు. మరి తమ్ముడు లోకేష్ తండ్రిని జైల్లో పెట్టినప్పుడు కేటీఆర్ ఎక్కడ ఉన్నాడని రేవంత్ రెడ్డి ఎద్దేవా చేశారు. హైదరాబాద్ నగరం శరవేగంగా అభివృద్ధి చెందుతోందని రేవంత్‌రెడ్డి తెలిపారు. 2047 నాటికి తెలంగాణ ప్రాధాన్యత రంగాలను వివరించారు. రాష్ట్ర సుస్థిరాభివృద్ధికి ప్రైవేటు- రంగం మద్దతు గురించి తెలిపారు. అభివృద్ధి కోసం 'తెలంగాణ రైజింగ్ 2047' రూపొందించుకున్నట్లు- చెప్పారు. హైదరాబాద్‌లో కోటి మందికి పైగా ప్రజలు నివసిస్తున్నారు. నగరంలో ఆర్ఆర్ఆర్ కూడా నిర్మిస్తున్నాం. ప్రస్తుతం 70 కిలోమీటర్లు ఉన్న మెట్రోను 150 కిలోమీటర్లకు విస్తరిస్తున్నాం. మెట్రోలో ప్రస్తుతం రోజుకు 5 లక్షల మంది ప్రయాణిస్తున్నారు. వచ్చే ఐదేళ్లలో ఆ సంఖ్యను 15 లక్షలకు పెంచాలనేదే మా లక్ష్యం. గుజరాత్‌లోని సబర్మతీ తీరంలా మూసీ తీరాన్ని అభివృద్ధి చేస్తాం. దీనికోసం మూసీ రివర్‌ఫ్రంట్ కార్పొరేషన్ ఏర్పాటు చేశాం. కాలుష్య కారక పరిశ్రమలను హైదరాబాద్ వెలుపలకు తరలిస్తున్నాం. ఎలక్ట్రిక్ వాహనాలను ప్రోత్సహిస్తున్నాం అన్నారు. ప్రణాళికాబద్ధమైన అభివృద్ధికి ఫ్యూచర్‌సిటీని నిర్మిస్తున్నాం. విమానాశ్రయం నుంచి ఫ్యూచర్ సిటీకి కనెక్టివిటీ- ఏర్పాటు- చేస్తాం. హైదరాబాద్-బెంగళూరు మధ్య బుల్లెట్ రైలు ఇవ్వాలని కేంద్రాన్ని కోరాం. తెలంగాణ గ్రామీణ ప్రాంతాల్లో వ్యవసాయ ఉత్పత్తులను ప్రోత్సహిస్తాం. డ్రగ్స్ కట్టడిలో మా రాష్ట్ర పోలీసులు దేశంలోనే నెంబర్ వన్‌గా ఉన్నారు. 2034 కల్లా ట్రిలియన్ డాలర్ల, 2047 కల్లా మూడు ట్రిలియన్ డాలర్ల ఎకానమీగా మారాలనేది మా లక్ష్యం. దేశ జీడీపీలో 10 శాతం తెలంగాణ నుంచే రావాలనేది మా ధ్యేయం అని రేవంత్‌రెడ్డి తెలిపారు. ఇదిలావుంటే ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డితో న్యూజెర్సీ గవర్నర్ ఫిలిప్ డి.మర్ఫీ ఢిల్లీలో శుక్రవారం భేటీ- అయ్యారు. విద్యా, గ్రీన్ ఎనర్జీ, ఎంటర్‌టైన్‌మెంట్, మౌలిక వసతులు , మూసీ రివర్ ఫ్రంట్ తదితర అంశాలపై ముఖ్యమంత్రి... న్యూజెర్సీ గవర్నర్ చర్చించారు. తెలంగాణ విజన్ 2047 సాధనలో తమ ప్రభుత్వం చేస్తున్న కృషిని ముఖ్యమంత్రి వివరించారు. ఐటీ-, ఫార్మా రంగంలో తెలంగాణ రాష్ట్రం ప్రాధాన్యాన్ని సీఎం తెలియజేశారు. భేటీలో గవర్నర్ సతీమణితో పాటు- న్యూజెర్సీ ప్రతినిధులు పాల్గొన్నారు.

## అస్తవ్యస్తమైన జనజీవనం

**హైదరాబాద్, సెప్టెంబరు19 ( వెలుతురు):**

హైదరాబాద్‌లో కుండపోత వాన పడుతోంది. హయత్ నగర్ ఎల్బీ నగర్ ప్రాంతాల్లో పడుతున్న వానకు జనజీవనం అస్తవ్యస్తమైంది. ఏకదాటిగా అరగంట నుంచి జోరు వాన దంచి కొడుతోంది. హైదరాబాద్‌లో కుండపోత వర్షాలతో నగరంలోని అనేక ప్రాంతాలు వరదల బారినుండి తట్టుకోలేకపోయాయి. బల్కంపేట అండర్‌పాస్‌లో వరద నీటిలో చిక్కుకుని ఒకరు మృతి చెందగా, హబీబ్ నగర్‌లో మామా అల్లుళ్లు వరదనీటిలో కొట్టుకుపోయి మృతి చెందారు. ముషీరాబాద్‌లో మరో వ్యక్తి ప్రాణాలు కోల్పోయాడు. వర్షాల కారణంగా నగరంలో ట్రాఫిక్ జామ్‌లు ఏర్పడి జనజీవనం స్తంభించిపోయింది. మురుగు కాలువలు నిండి ప్రమాదకర స్థితిలో ఉన్నాయి. ఈ వర్షాలతో నగరవాసులు తీవ్ర ఇబ్బందులను ఎదుర్కొంటున్నారు. ప్రభుత్వం వరద నిర్వహణకు తగిన చర్యలు తీసుకోవాలని డిమాండ్‌లు వస్తున్నాయి. యాదాద్రి భువనగిరి జిల్లాలోని బీబీనగర్ మండలం గూడూరు వద్ద చిన్నేటి వాగులో వరద ఉప్పొంగి ప్రవహిస్తున్న సంఘటనలో ఒక యువకుడు కొట్టుకుపోయాడు. భారీ వర్షాల కారణంగా వాగులో వరద పెరిగి, లెవెల్ బ్రిడ్జి పైకి నీరు చేరింది. ఈ బ్రిడ్జిని దాటుతున్న సమయంలో యువకుడు వరద నీటిలో కొట్టుకుపోయాడు. ఈ ఘటన తీవ్రమైన ప్రమాదాన్ని హెచ్చరిస్తుంది. వాగుల ద్వారా ప్రయాణించే ముందు వాటి నీటిమట్టం గురించి జాగ్రత్త వహించాలని అధికారులు సూచిస్తున్నారు. యువకుడిని రక్షించేందుకు సహాయక చర్యలు చేపట్టడం జరుగుతోంది. కాగా ఉపరితల ఆవర్తనం, ద్రోణి ప్రభావంతో తెలంగాణలో మూడ్రోజులపాటు ఉరుములు మెరుపులతో కూడిన తేలికపాటి నుంచి మోస్తరు వర్షాలు కురిసే అవకాశం ఉందని హైదారాబాద్? వాతావరణ కేంద్రం తెలిపింది. ఇవాళ నిజామాబాద్, సంగారెడ్డి, కామారెడ్డి, నాగర్‌కర్నూల్ జిల్లాల్లో భారీ వర్షాలు కురిసే అవకాశం ఉన్నట్లు ప్రకటించింది. ఉమ్మడి ఆదిలాబాద్, కరీంనగర్, రంగారెడ్డి, హైదరాబాద్, మెదక్, మహబూబ్‌నగర్, ఖమ్మం, జయశంకర్ భూపాలపల్లి, ములుగు జిల్లాల్లో తేలికపాటి నుంచి మోస్తరు వర్షం కురిసే అవకాశం ఉన్నట్లు వెల్లడించింది. హైదరాబాద్? వాతావరణ కేంద్రం నిజామాబాద్, సంగారెడ్డి, కామారెడ్డి, నాగర్ కర్నూల్ ఈ నాలుగు జిల్లాలకూ ఎల్లో హెచ్చరికలు జారీ చేసింది. గంటకు 30 నుంచి 40 కిలోమీటర్ల వేగంతో గాలులు వీచే అవకాశం ఉందని పేర్కొంది. ఆయా జిల్లాల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని సూచించింది. తెలంగాణ నుంచి నైరుతి రుతుపవనాల ఉపసంహరణ అక్టోబర్ మొదటి వారంలో ఉంటుందని తెలిపింది. ఇటీవల హైదరాబాద్? మహానగరంలో ఆకస్మికంగా మేఘాలు గర్జిస్తుండటంతో కుండపోత వానలు పెరిగాయి. రహదారులు కాలువలుగా, కాలనీలు చెరువుల మాదిరి తలపిస్తున్నాయి. లోతట్టులో ఉన్న ఇళ్లలోకి నీరు చేరడంతో ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. గత ఆదివారం దురదృష్టవశాత్తు ముగ్గురు వ్యక్తులు నాలాల్లో గల్లంతయ్యారు. ఎవరైనా గల్లంతైయిన 24 గంటల అనంతరం మృతి చెందినట్లుగా అధికారికంగా ధ్రువీకరిస్తున్నారు. తక్కువ టైంలో ఎక్కువ వర్షం కురవడం ఒక సమస్య అయితే నాలాల నిర్వహణ సక్రమంగా లేకపోవడం మరో కారణమని నిపుణులు విశ్లేషిస్తున్నారు. నగరంలోని నివాసాల్లో వరద ఇంకడం లాంటి ఏర్పాట్లు ఎక్కడా లేవు. ఇళ్లపై కురిసిన వర్షపు నీరు నేరుగా రోడ్ల మీదకే వస్తోంది. మొత్తం కలిసి ఏరులై ఉధృతంగా ప్రవహిస్తోంది. మరోవైపు అవసరాలకు సరిపడా వరద కాలువల నిర్మాణాలు లేవు. ఉన్నవాటిలో పూడిక తీయకపోవడం వల్ల ఆక్రమణలు పెరిగిపోవడంతో అవి చిన్నగా మారిపోయాయి. వరద సంభవించినప్పుడు దాని తీవ్రత తగ్గించడానికి ఏర్పాటు చేసిన భూగర్భ ట్యాంకులు సైతం నామమాత్రంగా మారాయి.

## సాయుధ పోరాట విరమణ ఆలోచనే లేదు

చేశారు, ఇది పార్టీ ముఖ్య ఉద్దేశాన్ని దెబ్బతీస్తోందని అన్నారు. సోను అనుసరించిన పద్ధతి అర్థం కావటం లేదని తెలిపారు. ఒకవేళ ఎవరైనా ఉద్యమాన్ని విడిచిపెట్టాలని భావిస్తే పార్టీ కమిటీలో చర్చించి అనుమతి పొందవచ్చని చెప్పారు. తన అభిప్రాయాన్ని పార్టీ విభాగాలకు పంపించి ఉంటే జవాబులు దొరికేవి అన్నారు. అది చేయకుండా, ఈ విధంగా బహిరంగంగా ప్రకటిస్తే పార్టీ శ్రేణుల్లోనూ, విప్లవ శిబిరంలోనూ గందరగోళం తలెత్తుతుందని, ఈ పద్ధతి ఉద్యమానికి నష్టమే తప్ప ఉపయోగపడదని పార్టీ తేల్చి చెప్పింది. "దేశంలోని ఏ పార్టీ అయినా ఇటువంటి నిర్ణయాలను ఇంటర్నెట్ ద్వారా బహిరంగ చర్చకు పెట్టి పరిష్కరించాలని చూస్తారా." అని జగన్ ప్రశ్నించారు. అటువంటిది, రహస్య పార్టీ, కేంద్రీకృత ప్రజాస్వామ్య సూత్రాలకు కట్టుబడిన పార్టీ, తీవ్రమైన యుద్ధ చర్యలు అమలు అవుతున్న వేళ మంచిగా ఆలోచించేవారు ఇలా చేయరని స్పష్టం చేశారు. ప్రస్తుతం ఎదుర్కొంటున్న సమస్యపై పార్టీలోపై స్థాయి నుంచి కింది స్థాయి వరకు అందరూ తీవ్రంగానే ఆలోచిస్తున్నారని, అనవసరంగా నష్టపోవాలని ఎవరూ అనుకోవడం లేదని పార్టీ తెలిపింది. అయితే, ఈ సమస్యకు పరిష్కారం బహిరంగ ప్రకటనలతో అయ్యేది కాదని, భయంకరమైన దమనకాండలో ఇటువంటి నష్టాలు సహజంగానే జరుగుతాయని అర్థం చేసుకోవాలని సూచించింది. కామ్రేడ్ సోను ప్రకటన పార్టీ అధికారిక ప్రకటన కాదని, విప్లవ శిబిరం, మిగిలిన రాజకీయ పార్టీలు దీనిని అధికారిక ప్రకటనగా గుర్తించాల్సిన అవసరం లేదని, దీనితో గందరగోళ పడాల్సిన అవసరం లేదని అధికార ప్రతినిధి తేల్చిచెప్పారు. 2024లో పొలిట్ బ్యూరో విడుదల చేసిన సర్క్యులర్‌ను అమలు జరపటమే తక్షణ కర్తవ్యం అన్నారు. ఫాసిస్ట్ బీజేపీ ప్రజా వ్యతిరేక విధానాలకు వ్యతిరేకంగా పోరాటాలను మరింత తీవ్రతరం చేయాలి అని పార్టీ తన శ్రేణులకు, విప్లవ అభిమానులకు పిలుపునిచ్చింది. కాగా.. గత కొన్నేళ్లుగా దేశంలోని మావోయిస్టు విప్లవోద్యమ శిబిరాన్ని కకావికలం చేస్తున్నాయి. ఇప్పుడు ఆ శిబిరమే చీలిపోయిందన్న వాదన బలంగా వినిపించే ఘటన చోటు చేసుకుంది. కేంద్ర ప్రభుత్వం ఒకవైపు మావోయిస్ట్ పార్టీని 2026 మార్చి నాటికి సమూలంగా నిర్మూలిస్తామని బహిరంగంగా ప్రకటిస్తోంది. ఆ దిశగానే నిర్మూలన చర్యలు తీవ్రతరం చేస్తోంది. ఈ పరిస్థితుల్లో పార్టీ కేంద్ర కమిటీ కీలక నాయకుడు 'సాయుధ పోరాటాన్ని విరమిస్తున్నట్లు' ప్రకటించడం విప్లవ శిబిరంలో తీవ్ర గందరగోళాన్ని సృష్టించింది. ఈ ప్రకటనపై మావోయిస్ట్ పార్టీ అధికార ప్రతినిధి 'జగన్' తీవ్ర అభ్యంతరం తెలుపుతూ, అది పార్టీ నిర్ణయం కాదని, ఈ పద్ధతి ఉద్యమానికి నష్టం కలిగిస్తుందని ఒక ప్రత్యేక పత్రికా ప్రకటన ద్వారా స్పష్టం చేశారు. పార్టీ ముఖ్య నాయకత్వంపై యుద్ధ దాడులు తీవ్రంగా కొనసాగుతున్న ఈ క్లిష్ట సమయంలో వచ్చిన ఈ తాజా ప్రకటన పార్టీలో అంతర్గత విబేధాలు, ఒత్తిడి ఏ స్థాయిలో ఉందో తెలియజేస్తోంది.కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం విప్లవోద్యమ నిర్మూలనకు చాలా ఏళ్ల నుంచి పథకాలు రచిస్తోంది. 'కగార' అనే పేరుతో భారీ స్థాయి యుద్ధ చర్యలను అమలు చేస్తోంది. ఈ చర్యల లక్ష్యం కేవలం క్యాడర్ మాత్రమే కాదు, నాయకత్వాన్ని, సహకరించే ప్రజలను కూడా నిర్మూలించడమేనని మావోయిస్టులు ఆరోపిస్తోంది.ఈ ఆపరేషన్ ఫలితంగా మావోయిస్టు పార్టీకి తీరని నష్టం వాటిల్లింది. మే 21న జరిగిన దాడిలో ఏకంగా పార్టీ ప్రధాన కార్యదర్శితో సహా 28 మంది కామ్రేడ్స్ చనిపోయారు. అంతేకాకుండా, జూన్ నుంచి సెప్టెంబర్ వరకు జరిగిన ఘటనలలో కేంద్ర కమిటీ సభ్యులు ఉదయ్ అలియాస్ గజరల్ రవి, మోడెం బాలకృష్ణ, పరేవశ సోరెన్ కూడా మృతి చెందారు. రాష్ట్ర కమిటీ సభ్యులు గౌతమ్, భాస్కర్, అరుణ, జగన్ అలియాస్ పండన్న, పండు అలియాస్ చంద్రహాస్ వంటివారు కూడా కన్నుమూశారు. ఈ భయంకరమైన దాడులు కొనసాగుతున్న నేపథ్యంలో, కొంతమంది రాష్ట్ర కమిటీ సభ్యులు, కింది స్థాయి కమిటీ సభ్యులు అనారోగ్య సమస్యల రీత్యా పార్టీ అనుమతితోనే సరెండర్ అయ్యారని ప్రస్తుతం విడుదల చేసిన ప్రకటనలో పేర్కొన్నారు జగన్. విప్లవ శిబిరంపై జరుగుతున్న యుద్ధ చర్యలను ఆపాలని దేశవ్యాప్తంగా ప్రజా సంఘాలు, ప్రజలు, మేధావులు, సంఘాలు, ప్రముఖులు విజ్ఞప్తులు చేశారు. తెలంగాణ, ఆంధ్ర రాష్ట్రాల్లోనూ 'కగార' యుద్ధ కాండను నిలుపుదల చేయాలని ఒత్తిడి చేస్తున్నారు.2025 మార్చిలో కొంతమంది ప్రజాస్వామిక మేధావులు 'పీస్ డైలాగ్ కమిటీ'గా ఏర్పడి, ప్రభుత్వానికి, మావోయిస్ట్ పార్టీకి మధ్య శాంతి చర్చలు జరగాలని ప్రతిపాదన చేశారు. దీనికి జవాబుగా కేంద్ర కమిటీ స్పందిస్తూ కూంబింగ్‌లు, హత్యకాండను ఆపాలని, కొత్త క్యాంపుల నిర్మాణం నిలుపుదల చేసి శాంతియుత వాతావరణంలోనే చర్చలు జరపాలని స్పష్టంగా ప్రకటించింది. అని లేఖలో పేర్కొన్నారు. అయితే, కేంద్ర ప్రభుత్వం ఈ డిమాండ్‌లను పట్టించుకోకుండా, ఎటువంటి సడలింపులూ లేకుండా యుద్ధ చర్యలను కొనసాగిస్తూనే ఉంది. బీజేపీ నాయకులు అయితే, తాము మావోయిస్టులతో చర్చించేది లేదని, ఆయుధాలు విడిచిపెట్టి సరెండర్ కావాలని పదే పదే ప్రకటిస్తున్నారని జగన్ పత్రికా ప్రకటనలో పేర్కొన్నారు. ఫాసిస్ట్ భావజాలంతో, రాజ్యాంగ వ్యతిరేకంగా, చట్ట వ్యతిరేకంగా నిర్మూలన కార్యక్రమాన్ని కొనసాగించి తీరుతామని బీజేపీ నాయకత్వం ప్రకటిస్తోందని ఆరోపించారు. ఈ ప్రతికూల వాతావరణంలోనే, కీలకమైన అంతర్గత సంక్షోభం తెరపైకి వచ్చింది. కేంద్ర కమిటీ సభ్యుడైన కామ్రేడ్ సోను, సాయుధ పోరాటాన్ని విరమిస్తున్నామని ప్రకటిస్తూ, తమ అభిప్రాయాలను తెలుసుకోవడానికి నెల రోజులు సమయం ఇవ్వాలని కోరారు. సుదీర్ఘంగా వివిధ ప్రాంతాల్లో ఉన్న పార్టీ నాయకులు, కార్యకర్తలు తమ అభిప్రాయాలను తాను ఇచ్చిన ఇమెయిల్ అడ్రస్‌కు పంపాలని ఆయన కోరారు. ఇది సరైన పద్ధతి కాదని అని లేఖలో అభ్యంతరం వ్యక్తం చేశారు జగన్. ఒక సీనియర్ నాయకుడు, అదీ తీవ్ర దమనకాండ జరుగుతున్న సమయంలో, ఇంటర్నెట్ మాధ్యమంగా పార్టీ మౌలిక సిద్ధాంతమైన సాయుధ పోరాట విరమణ గురించి బహిరంగంగా ప్రకటించడం ఈ మొత్తం వ్యవహారంలో ప్రత్యేకతను సంతరించుకుంది. దీంతో పార్టీ శ్రేణులలో తలెత్తిన గందరగోళాన్ని తగ్గించడానికి జగన్ ఈ కీలక ప్రకటన చేశారు.

## 2002, 2025 జాబితాను పరిగణలోకి తీసుకోండి

**ఓటరు జాబితా ప్రక్రియను పకడ్బందీగా నిర్వహించాలి**

**రాష్ట్ర ముఖ్య ఎన్నికల అధికారి సుదర్శన్ రెడ్డి**

**హైదరాబాద్, సెప్టెంబరు19 ( వెలుతురు):**

2002, 2025 ఓటరు జాబితాల సరి పోల్చే ప్రక్రియను పకడ్బందీగా నిర్వహించాలని రాష్ట్ర ముఖ్య ఎన్నికల అధికారి సుదర్శన్ రెడ్డి అన్నారు. శుక్రవారం హైదరాబాద్ నుంచి ఎన్నికల అధికారులతో కలిసి వీడియో కాన్ఫరెన్స్ ద్వారా అన్ని జిల్లాల ఎన్నికల అధికారులు - కలెక్టర్లు, ఎన్నికల విభాగం అధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా రాష్ట్ర ముఖ్య ఎన్నికల అధికారి మాట్లాడుతూ.. 2002, 2025 ఓటరు జాబితాల సరిపోల్చే కార్యక్రమాన్ని పకడ్బందీగా నిర్వహించాలని తెలిపారు. ఓటర్ల జాబితాల మధ్య విశ్లేషణ, మ్యాచింగ్, బ్యాచింగ్ ప్రక్రియ సక్రమంగా నిర్వహించాలని, రాష్ట్ర వ్యాప్తంగా ఓటర్ల జాబితా పరిశీలనను వ్యవస్థీకృతంగా నిర్వహించేందుకు 4 కేటగిరీలుగా విభజించి తదనగుణంగా నిర్దేశాలు ఇవ్వడం జరిగిందని తెలిపారు. కేటగిరీ ఎ-లో 2002, 2025 రెండింటి జాబితా లోనూ ఒకే వ్యక్తి పేరు ఉన్నట్లయితే ఏ విధమైన డాక్యుమెంట్ అవసరం లేదని, ఈ చర్య స్పష్టంగా సరి పోలిన కేటగిరీగా పరిగణిస్తామని తెలిపారు. కేటగిరీ బి-2002 జాబితాలో పేరు లేదు, కానీ వ్యక్తి పుట్టిన సంవత్సరం 1987 కన్నా ముందు అయి ఉండాలని, అటువంటి వారు ఎన్నికల సంఘం సూచించిన 11 డాక్యుమెంట్లలో కనీసం ఒక్కటి సమర్పించాలని తెలిపారు .కేటగిరీ సి లో 2002 జాబితాలో పేరు లేదు, వ్యక్తి పుట్టిన సంవత్సరం 1987 నుంచి 2002 మధ్య (తద్వారా 18 సంవత్సరాలు కన్నా తక్కువ వయస్సు) అటువంటి వారు ఒక స్వీయ డాక్యుమెంట్, కుటుంబ సంబంధిత డాక్యుమెంట్ మర్పించాలని తెలిపారు. కేటగిరీ డి- 2002లో పేరు లేదు, 2004 తరువాత జన్మించినవారు కానీ, 2025 జాబితాలో పేరు ఉందంటే ఒక స్వీయ డాక్యుమెంట్, తల్లిదండ్రుల డాక్యుమెంట్ తప్పనిసరిగా సమర్పించాలని తెలిపారు. ఈ నెల 24వ తేదీగా నివేదికలు సమర్పించాలని తెలిపారు. ప్రతి పోలింగ్ కేంద్రం వారీగా నివేదికలు రూపొందించాలని తెలిపారు. నిర్దేశిత గడువులోగా ప్రక్రియ పూర్తి చేయాలని తెలిపారు. ఈ సందర్భంగా మంచిర్యాల జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ మాట్లాడుతూ రాష్ట్ర ఎన్నికల సంఘం ఆదేశాల ప్రకారం పిల్లలు చర్యలు తీసుకోవడం జరుగుతుందని తెలిపారు. ఓటరు జాబితాల సరి పోల్చే ప్రక్రియను ఎన్నికల విభాగం అధికారుల సమన్వయంతో వేగవంతం చేస్తామని తెలిపారు.

# పత్తి రైతులు అందరికీ కనీస మద్ధతు ధర లభించేలా సీసీఐ తో అధికారులు సమన్వయం చేసుకోవాలి

- అక్టోబర్ నుంచే పత్తి సేకరణకు ఏర్పాట్లు చెయ్యాలి.
- అవసరమున్న చోట కొత్తగా సెంటర్లు ఏర్పాటు చేయాలి
- సీసీఐ ప్రవేశపెట్టిన కాపాస్ కిసాన్ యాప్ ద్వారా రైతులను రిజిస్ట్రేషన్ చేయించే బాధ్యత తీసుకోవాలి.
- ట్రాన్స్ పోర్టులలో ఎటువంటి ఇబ్బంది రాకుండా రవాణాశాఖ అధికారులు బాధ్యత తీసుకోవాలి.
- రోజువారీ క్రయవిక్రయాలు పరిశీలించేందుకు డైరెక్టరేట్ లో ఒక కమాండ్ కంట్రోల్ రూం ఏర్పాటు చేసుకొని, అన్ని సెంటర్లను అనుసంధానించాలి.
- రైతుల అనుమానాలు నివృత్తి చేసేందుకు టోల్ ఫ్రీ నెం. ఏర్పాటు చేసి, ఒక సీనియర్ అధికారిని నియమించండి.







**హైదరాబాద్ వెలుతురు సెప్టెంబర్ 19:**
రాష్ట్రవ్యాప్తంగా 2025-26 పత్తి మార్కెటింగ్ సీజన్ ప్రారంభానికి ముందు, రాష్ట్ర వ్యవసాయ, మార్కెటింగ్, సహకార, చేతివృత్తులు మరియు వస్త్రశాఖల మంత్రి తుమ్మల నాగేశ్వరరావు ఈ రోజు కాటన్ కార్పొరేషన్ ఆఫ్ ఇండియా (సీసీఐ) ఉన్నతాధికారులతో సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో పత్తి ఉత్పత్తి, మార్కెట్ ధరల పరిస్థితి, MSP అమలు, రైతులకు చెల్లింపులు, జిన్నింగ్ ,ప్రాసెసింగ్ మిల్లుల ఏర్పాట్లు, రవాణా సమస్యలు, డిజిటలైజేషన్, రైతుల రిజిస్ట్రేషన్, స్థానిక కమిటీలు, ఫిర్యాదు పరిష్కారం వంటి అనేక అంశాలపై సమగ్రంగా చర్చ జరిగింది. సీసీఐ ప్రతినిధులు మాట్లాడుతూ.. తెలంగాణ రాష్ట్రంలో పత్తి సేకరణలో రాష్ట్ర ప్రభుత్వ సహకారం అవసరమని, దేశవ్యాప్తంగా ఈ సంవత్సరం కొన్ని నూతన విధానాలు ప్రవేశపెట్టామని అన్నారు. దానికి తగ్గట్టుగా ప్రభుత్వ సహాయం అందించాలని మంత్రి ని కోరారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం తరఫున అన్ని సహాయ సహకారాలు ఉంటాయన్నారు. రాష్ట్రంలో పండే పత్తి ప్రత్యేక నాణ్యత కలిగినదని మంత్రి గారు వివరించారు. ప్రస్తుతం మార్కెట్ ధరలు MSP కంటే క్వింటాల్‌కు రూ.1099 తక్కువగా ఉన్నాయని, ఇది రైతులకు ఆందోళన కలిగిస్తున్నదని పేర్కొన్నారు. కాబట్టి రైతుల ప్రయోజనాలను కాపాడేందుకు సీసీఐ సమర్థవంతంగా కొనుగోళ్లు చేపట్టాలని ఆదేశించారు. అక్టోబర్ నెల నుంచే పత్తి సేకరణకు ఏర్పాట్లు చేసుకోవాలని, రైతులు ఇబ్బందులు ఎదుర్కోకుండా రాష్ట్రవ్యాప్తంగా కొనుగోలు కేంద్రాలను 110 నుండి 122కి పెంచినట్లు మంత్రి గారు వెల్లడించారు. అదనంగా, రాజన్న సిరిసిల్ల జిల్లాలో కొత్తగా కొనరావుపేట AMC కేంద్రాన్ని కూడా చేర్చాలని సూచించారు. రైతులు తమ పత్తిని సులభంగా విక్రయించుకునేందుకు జిన్నింగ్ & ప్రాసెసింగ్ మిల్లులు, గోదాములు సమృద్ధిగా అందుబాటులో ఉండేలా అన్ని ఏర్పాట్లు చేయాలని ఆయన అధికారులను ఆదేశించారు. రైతులకు MSP చెల్లింపులు పూర్తిగా ఆధార్ ఆధారిత ధృవీకరణ తర్వాతే నేరుగా వారి బ్యాంకు ఖాతాల్లో జమ అయ్యే విధంగా చర్యలు చేపట్టాలని మంత్రి అన్నారు. దీంతో రైతులకు పారదర్శకంగా, ఆలస్యం లేకుండా చెల్లింపులు జరుగుతాయని ఆయన పేర్కొన్నారు. సీసీఐ ప్రవేశ పెట్టిన "కపాస్ కిసాన్" యాప్ ద్వారా రైతులు స్వయంగా స్లాట్ నమోదు చేసుకోవచ్చని అన్నారు. ఈ యాప్ పై AEO లకు ప్రత్యేక శిక్షణ ఇవ్వాలని, వారి ద్వారా రైతులకు అవగాహన కార్యక్రమాలు చేపట్టాలని అధికారులను ఆదేశించారు. కౌలు రైతులు కూడా ఓటీపీ ఆధారంగా నమోదు చేసుకునే వీలుంటుందని, అయితే వారి వివరాలు సంబంధిత పట్టాదారు ధృవీకరించిన తర్వాతే ఆమోదం పొందుతాయని తెలిపారు. ఈ విధానం వల్ల అర్హత కలిగిన ప్రతి రైతు MSP ప్రయోజనం పొందే అవకాశం ఉంటుందని స్పష్టం చేశారు. రైతులు L1,L2 స్లాట్ల ద్వారా ఇబ్బందులు తలెత్తే అవకాశం ఉంటుందని, అలాకాకుండా నూతన పద్ధతిలో సెంటర్ కు 10,15 కి.మి పరిధిలో ఉండేలా సెంటర్ ను కేటాయించాలని సూచించారు. రైతుల పత్తి కొనుగోళ్లు సక్రమంగా జరిగేందుకు ప్రతి కొనుగోలు కేంద్రంలో స్థానిక మానిటరింగ్ కమిటీలు ఏర్పాటు చేయాలని మంత్రి ఆదేశించారు. ఈ కమిటీలు తేమ శాతం, నాణ్యత, తూకం, ధరల విషయంలో రైతులకు ఎలాంటి అన్యాయం జరగకుండా పర్యవేక్షిస్తాయి. రైతుల ఫిర్యాదుల పరిష్కారం కోసం టోల్ ఫ్రీ నంబర్ 1800 599 5779, వాట్సాప్ హెల్ప్‌లైన్ 88972 81111 కొనసాగుతాయని తెలిపారు. ప్రతి కొనుగోలు కేంద్రం మరియు జిన్నింగ్ , ప్రాసెసింగ్ మిల్లులలో సీసీ కెమెరాలు తప్పనిసరిగా ఏర్పాటు చేయాలని, రోజువారి క్రయ విక్రయాలను పరిశీలించేందుకు డైరెక్టరేట్ లో కమాండ్ కంట్రోల్ రూం సెంటర్ ఏర్పాటు చేయాలన్నారు. రవాణా సమస్యలపై మంత్రి ప్రత్యేకంగా దృష్టి సారించారు. స్థానిక రవాణా సంఘాలు అధిక ధరలు వసూలు చేస్తున్నందున, గోదాముల నుండి మిల్లులకు పత్తి రవాణాలో ఆటంకాలు కలుగుతున్నాయని గుర్తించారు. ఈ సమస్యలను తక్షణం పరిష్కరించేలా రవాణా శాఖ, జిల్లా కలెక్టర్లు చర్యలు తీసుకోవాలని ఆయన ఆదేశించారు. సీసీఐ కొనుగోలు విధానంలో కొన్ని మార్పులపై కూడా చర్చ జరిగింది. లింట్ శాతం పెంపు, కొరత శాతం లెక్కింపు, జిన్నింగ్ మిల్లుల పాల్గొనకపోవడం వంటి సమస్యలను పరిష్కరించేలా చర్యలు తీసుకోవాలని మంత్రి సూచించారు. సీసీఐ టెండర్ నిబంధనలు పారదర్శకంగా ఉండాలని అన్నారు. రైతుల MSP రక్షణకు రాష్ట్ర స్థాయి, జిల్లా స్థాయి కమిటీలు ఏర్పాటు చేసినట్లు మంత్రి వివరించారు. ఈ కమిటీలు ధరల అమలును పర్యవేక్షించి, సీసీఐతో సమన్వయం చేసేలా ఉంటాయి. జిల్లా కలెక్టర్లు సీజన్ ప్రారంభానికి ముందే ఈ కమిటీల ఏర్పాటుకు ప్రణాళిక రూపొందించాలని సూచించారు. రైతులకు MSP హామీగా అందించడం ప్రభుత్వ ప్రధాన లక్ష్యం అని , పత్తి రైతులు ఎటువంటి ఇబ్బందులు పడకుండా, పారదర్శకంగా మరియు వేగంగా కొనుగోళ్లు జరిగేలా అన్ని విభాగాలు సమన్వయంతో పనిచేయాలని ఆయన సూచించారు. సీసీఐ, మార్కెటింగ్ శాఖ, జిల్లా కలెక్టర్లు, రైతు సంఘాలు సమన్వయంతో పనిచేస్తే ఈ సీజన్ విజయవంతమవుతుందని మంత్రి విశ్వాసం వ్యక్తం చేశారు.

## మున్నూరు కాపు సమస్యల పై మంత్రి పొన్నం ప్రభాకర్ ని కలిసి వినతి పత్రం సమర్పించిన మున్నూరు కాపు రాష్ట్ర నేతలు

**హైదరాబాద్ వెలుతురు సెప్టెంబర్ 19:**



మున్నూరు కాపు వృత్తి విద్యా కోర్సులకు సంబంధించి నిధులు కేటాయించాలని కోకపేట లో మున్నూరు కాపు ల అభివృధి కేటాయించిన 5 ఎకరాల భూమి లో ఆత్మ గౌరవ భవన నిర్మాణాలకు నిధులు కేటాయించాలని మంత్రి పొన్నం ప్రభాకర్ కి వినతి పత్రం సమర్పించిన మున్నూరు కాపు రాష్ట్ర అధ్యక్షులు సర్దార్ పుట్టం పురుషోత్తం రావు ,అధికార ప్రతినిధి మంగళారపు లక్ష్మణ్ , బొమ్మ శ్రీరామ్ చక్రవర్తి , ఈశంపల్లి వెంకన్న ,ఆకుల సతీష్ ,వైద్యుల అంజన్ కుమార్, తదితరులు పాల్గొన్నారు.

## సీబీసీ, హైదరాబాద్ ఆధ్వర్యం లో స్వచ్ఛతా అవగాహన కార్యక్రమాలు

**- కేంద్ర కమ్యూనికేషన్ బ్యూరో (సీబీసీ), హైదరాబాద్**




**హైదరాబాద్ వెలుతురు సెప్టెంబర్ 19:**
స్వచ్ఛతా హి సేవ – 2025 ప్రచారంలో భాగంగా నగరంలోని పలు పాఠశాలల్లో స్వచ్ఛతా అవగాహన కార్యక్రమాలను నిర్వహించింది. ఈ కార్యక్రమాల ప్రధాన ఉద్దేశ్యం విద్యార్థుల్లో పరిశుభ్రత, ఆరోగ్య పరిరక్షణ, మరియు స్వచ్ఛతా ఉద్యమంలో చురుకైన భాగస్వామ్యంపై అవగాహన కల్పించడం. ముషీరాబాద్ ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో విద్యార్థులను ఉద్దేశించి మాట్లాడిన సీబీసీ హైదరాబాద్ డైరెక్టర్ శ్రీమతి కరీనా బి. తేంగమం గారు పాఠశాలలు, ఇళ్లు, మరియు పరిసరాలను శుభ్రంగా ఉంచడం అత్యంత అవసరమని పేర్కొన్నారు. విద్యార్థులు స్వచ్ఛత రాయబారులుగా మారి కనీసం 100 మందికి ప్రేరణనిస్తూ, వారిని ప్రతి సంవత్సరం 100 గంటలు స్వచ్ఛత కార్యకలాపాలకు కేటాయించేలా ప్రోత్సహించాలని ఆమె పిలుపునిచ్చారు. ఈ సందర్భంగా విద్యార్థులు స్వచ్ఛత ప్రతిజ్ఞను స్వీకరించారు.

## పులిగుండాల జ్యూట్ బ్యాగులు అందరికీ ఆదర్శం

**- ఖమ్మం అటవీ శాఖ ఉన్నతాధికారులను ప్రశంసించిన మంత్రి కొండా సురేఖ**



**హైదరాబాద్, వెలుతురు సెప్టెంబర్ 19:**
ఖమ్మం జిల్లాలోని పులిగుండాల ఎకో టూరిజం కేంద్రంలో జ్యూట్ బ్యాగుల వాడకాన్ని తెలంగాణ అటవీ, పర్యావరణ, దేవాదాయ శాఖ మంత్రి కొండా సురేఖ అభినందించారు. రాష్ట్రంలోని అన్ని ఎకో టూరిజం సెంటర్లు ఈ పద్ధతిని అనుసరించాలని పేర్కొన్నారు. ప్లాస్టిక్ వినియోగాన్ని పూర్తిగా తగ్గించి, ఈ జ్యూట్ బ్యాగులు వాడే ప్రయత్నానికి ఖమ్మం అటవీ అధికారులను మంత్రి సురేఖ ప్రశంసించారు. తెలంగాణ వన జీవధార అభియాన్ (టీవీజేఏ), వన సంరక్షణ సమితులకు (VSS) అటవీ సంరక్షణతో పాటు సుస్థిర జీవనోపాధిని కల్పించడమే ఈ సంస్థల లక్ష్యమని చెప్పారు. ఈ పథకంలో హస్తకళలు, నర్సరీ నిర్వహణ, ఎకో టూరిజం, తేనెటీగల పెంపకం వంటి శిక్షణలు, అటవీ ఉత్పత్తులకు విలువ ఆధారిత మార్కెట్ వ్యవస్థలు, హర్బల్ తోటలు వంటి అటవీ మౌలిక సదుపాయాల కల్పన జరగడం హర్షనీయం అన్నారు. క్యాంపా, టీజీ ఎఫ్డీసీ, సీఎస్ఆర్ నిధులు, కేంద్ర పథకాలతో ఈ ప్రాజెక్ట్ అమలవుతుందని, వచ్చే మూడు సంవత్సరాల్లో ఖమ్మం జిల్లాలో ఐదు వందల మందికి పైగా ఉపాధి అవకాశాలు లభిస్తాయని అధికారులు తెలిపారు. కాగా, స్థానికంగా పులిగుండాలలో చేపట్టిన జ్యూట్ బ్యాగుల వినియోగం వంటి చర్యలు ఎకో టూరిజాన్ని బలోపేతం చేస్తాయని పేర్కొన్నారు. పర్యావరణ పరిరక్షణకు, గ్రామీణ అభివృద్ధికి ఈ చర్యలు ఉపయోగపడతాయని మంత్రి సురేఖ అభిప్రాయపడ్డారు.

## ఎమ్మెల్యేలను దొంగిలించడం నేరం కాదా?

ఉంటుందన్నారు. ఓట్ చోరీపై గొంతు చించుకుంటున్న కాంగ్రెస్ నేత రాహుల్ గాంధీ, తెలంగాణలో తమ పార్టీ చేసిన ఎమ్మెల్యేల చోరీపై ఏం సమాధానం చెబుతారని ప్రశ్నించారు. ఓట్ల చోరీ ఒక నేరమైతే, ప్రజలు ఎన్నుకున్న ఎమ్మెల్యేలను దొంగిలించడం అంతకంటే పెద్ద నేరమని, అది ప్రజాస్వామ్యాన్ని పట్టపగలు ఖూనీ చేయడమేనని మండిపడ్డారు. రాహుల్ గాంధీకి సిగ్గు,శరం ఉంటే బీఆర్ఎస్ గుర్తుపై గెలిచి కాంగ్రెస్ కండువా కప్పుకున్న ఎమ్మెల్యేలతో వెంటనే రాజీనామా చేయించాలని కేటీఆర్ సవాల్ విసిరారు. అప్పుడే ఆయనకు ఓట్ల చోరీ గురించి మాట్లాడే నైతిక అర్హత ఉంటుందని స్పష్టం చేశారు. ఢిల్లీలో ప్రజాస్వామ్యం గురించి పాఠాలు చెప్పి, గల్లీలో అదే ప్రజాస్వామ్యాన్ని అపహాస్యం చేయడం కాంగ్రెస్ పార్టీకి, రాహుల్ గాంధీకి వెన్నతో పెట్టిన విద్య అని కేటీఆర్ ఎద్దేవా చేశారు. రాజ్యాంగాన్ని చేతిలో పట్టుకుని దేశమంతా తిరుగుతూ ఈవీఎంల ట్యాంపరింగ్, ఓట్ల దొంగతనం గురించి ఉపన్యాసాలు ఇస్తున్న రాహుల్ గాంధీకి, తెలంగాణలో ఆయన పార్టీ చేస్తున్న ఎమ్మెల్యేల దొంగతనం కనిపించకపోవడం కాంగ్రెస్ పార్టీ డిఎన్ఏలో ఉన్న ద్వంద్వ ప్రమాణాలకు , రాహుల్ గాంధీ రెండు నాల్కల ధోరణికి నిదర్శనం అని విమర్శించారు.బీఆర్ఎస్ సిద్ధాంతాలు కేసీఆర్ నాయకత్వాన్ని విశ్వసించి తెలంగాణ ప్రజలు గెలిపించిన పది మంది ఎమ్మెల్యేలను అధికార మదం, డబ్బును ఎరగా చూపించి కాంగ్రెస్ లో చేర్చుకోవడం అనైతికం, సిగ్గుమాలిన చర్య కాదా అని కేటీఆర్ ప్రశ్నించారు. ప్రజా తీర్పును కాలరాసి కాంగ్రెస్ చేసిన సిగ్గుమాలిన చర్య ఓట్లను దొంగిలించడం కంటే ఘోరమైన నేరం అన్నారు. ఓట్ చోరీ గురించి మాట్లాడే ముందు, తెలంగాణలో కాంగ్రెస్ చేసిన ఎమ్మెల్యేల చోరీపై సమాధానం చెప్పాలని కేటీఆర్ డిమాండ్ చేశారు. ప్రజాతీర్పును అపహాస్యం చేసి సంతలో పశువుల్లా తెలంగాణ లో ఎమ్మెల్యేలను కొనుగోలు చేసిన తీరుపై భారత్ జోడో న్యాయ్ యాత్ర చేసిన రాహుల్ గాంధీ సమాధానం చెప్పాలన్నారు కేటీఆర్. ఫిరాయింపులతో తెలంగాణ ప్రజలకు ఆయన ఏం సందేశం ఇస్తున్నారో చెప్పాలన్నారు. దమ్ము, ధైర్యం ఉంటే, పార్టీ మారిన ఎమ్మెల్యేలందరితో రాజీనామా చేయించి, ఉప ఎన్నికలకు వెళ్లాలని సవాల్ విసిరారు. ఎవరి బలం ఏంటో ప్రజాక్షేత్రంలో తేల్చుకుందామన్నారు. పార్టీ మారిన పది మంది ఎమ్మెల్యేలతో రాజీనామా చేయించకుండా రాహుల్ గాంధీ ప్రజాస్వామ్యం గురించి మాట్లాడితే దెయ్యాలు వేదాలు వల్లించినట్టు అనిపిస్తుందన్నారు. కాంగ్రెస్ పార్టీ ఫిరాయింపు రాజకీయాలను తెలంగాణ ప్రజలు అసహ్యించుకుంటున్నారని, సరైన సమయంలో ఆ పార్టీకి కర్రు కాల్చి వాత పెట్టడానికి సిద్ధంగా ఉన్నారని కేటీఆర్ హెచ్చరించారు.

## జనగాం జిల్లాలో నిరుపేద బాధితుల కుటుంబాలకు చేయూతనందించిన గ్రేట్ ఆఫీసర్స్

### ఒక్కో కుటుంబానికి రూ.50 వేల ఆర్థిక సహాయం....

**జనగాం జిల్లా వెలుతురు సెప్టెంబర్ 19:**






జనగాం జిల్లాకు చెందినటువంటి రెండు భాధిత కుటుంబాలకు గ్రేట్ ఆఫీసర్స్ తమ వంతు సహాయంగా ఒక్కో కుటుంబానికి 50 వేల రూపాయల చొప్పున ఆర్థిక సహాయం అందించారు. ఇట్టి సహాయాన్ని శుక్రవారం రోజున బాధిత కుటుంబాల గ్రామానికి వెళ్లి అందించారు . ఇంటి పెద్దదిక్కు జీవితాంతం మంచానికే పరిమితం అయితే ఆ కుటుంబాల యొక్క భాధ ఏ విధంగా ఉంటుందో ఊహించుకుంటేనే చాలా బాధగా ఉంటుందని, జీవితాంతం మంచానికే పరిమితమై బాడీలో సగభాగం పనిచేయకపోవడం వలన వాళ్లను చూసుకోవడానికి భార్య పిల్లలు ఎటుపోకుండ ఉండాల్సిన దురదృష్టకరమైన పరిస్థితి ఆ కుటుంబాలకు రోజు వారి మందులకు తిండికి వెళ్లడమే చాలా కష్టమైన, దుర్భరమైన పరిస్థితి ఇలాంటి క్లిష్ట సమయంలో మనం చేసిన సాయం అనేది మాటల్లో వర్ణించలేనిది అని ప్రత్యక్షంగా చూసిన మా మనసుకు అనిపించింది ఆఫీసర్లు పుల్లేంల రవీందర్ గౌడ్, ఏ చంద్రయ్య గౌడ్, ఏ నరేందర్ గౌడ్, దీపిక గౌడ్, పద్మ గౌడ్, సైదులు అన్నారు. ఈ కార్యక్రమంలో గ్రామ పెద్దలు, గౌడ నాయకులు తదితరులు పాల్గొన్నారు.

## తెలంగాణ బ్రాండ్ అంబాసిడర్లుగా మారండి

- పెట్టుబడులను సాదారంగా ఆహ్వానిస్తున్నాం
- భవిష్యత్తు తరాలకు అవకాశాలు సృష్టించండి
- హైదరాబాద్‌కు ఎక్కడలేని ఘన చరిత్ర
- 2027 నాటికి ఎలక్ట్రికల్ వాహనాలే ఎక్కువ

**- సీఎం రేవంత్‌రెడ్డి**



**న్యూఢిల్లీ, ఆగస్టు19( వెలుతురు):**
దేశంలోనే ఎక్కడా లేని ఘన చరిత్ర హైదరాబాద్‌కు ఉన్నదని సీఎం రేవంత్‌రెడ్డి అన్నారు. తెలంగాణలో పెట్టుబడులకు ఆహ్వానం పలుకుతున్నామని పేర్కొన్నారు. పెట్టుబడిదారులకు మద్దతుగా నిలుస్తామని... తెలంగాణలో పెట్టే పెట్టుబడులకు భద్రత ఉంటుందని తెలిపారు. తెలంగాణలో పెట్టుబడులు పెట్టి తెలంగాణ బ్రాండ్ అంబాసిడర్లుగా మారాలని పిలుపునిచ్చారు. హైదరాబాద్‌లో ఎలివేటెడ్ కారిడార్ల నిర్మాణం చేపడుతున్నామని వ్యాఖ్యానించారు. పరిపాలన చేసేందుకు రాజకీయ సంకల్పం ఎంతో అవసరమని చెప్పుకొచ్చారు. భవిష్యత్ తరాలకు అవకాశాలను సృష్టించాలనేది తమ ఆలోచన అని తెలిపారు. దేశంలో యంగెస్ట్ స్టేట్ (కొత్త రాష్ట్రం) తెలంగాణ అని ఉద్ఘాటించారు. కొత్త రాష్ట్రమైనా తెలంగాణ, హైదరాబాద్‌కు ఘనమైన చరిత్ర ఉందని నొక్కిచెప్పారు సీఎం రేవంత్‌రెడ్డి. ఢిల్లీలో పబ్లిక్ ఎఫైర్స్ ఫోరం ఆఫ్ ఇండియా 12వ వార్షిక సదస్సు శుక్రవారం జరిగింది. ఈ సదస్సులో ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ముఖ్య అతిథిగా పాల్గొని ప్రసంగించారు. తెలంగాణ సర్వతోముఖాభివృద్ధికి తెలంగాణ విజన్ డాక్యుమెంట్-2047 రూపొందించామని వివరించారు. తెలంగాణను కోర్ అర్బన్, సెమీ అర్బన్, రూరల్‌గా విభజించామని వెల్లడించారు. కోర్ అర్బన్ ఏరియాలో కోటి మంది నివసిస్తున్నారని... ఇక్కడ కాలుష్యకారక పరిశ్రమలను నగరం వెలుపలికి తరలిస్తున్నామని తెలిపారు. సెమీ అర్బన్ ఏరియాను తయారీ రంగం జోన్‌గా (మాన్యుఫాక్చర్) నిర్ణయించామని చెప్పుకొచ్చారు సీఎం రేవంత్‌రెడ్డి . తెలంగాణ అభివృద్ధికి తగినట్లు 70 కిలోమీటర్లు ఉన్న మెట్రోను 150 కిలోమీటర్లు పొడిగించాలని నిర్ణయించామని పేర్కొన్నారు. ప్రస్తుతం అయిదు లక్షల మంది మెట్రోలో పయనిస్తున్నారని.. దానిని 15 లక్షలకు పెంచాలని లక్ష్యంగా పెట్టుకున్నామని చెప్పుకొచ్చారు. సబర్మతీ తీరంలా మూసీని మారుస్తామని.. అందుకు మూసీ పునరుజ్జీవంపై దృష్టి సారించామని తెలిపారు. 2027 నాటికి హైదరాబాద్‌లో ఎలక్ట్రిక్ వాహనాలే ఎక్కువగా ఉండనున్నాయని.. అందుకే ఈవీలకు రాయితీలు ప్రకటించామని పేర్కొన్నారు ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి. 'రాష్ట్ర అవసరాలకు తగినట్లు రీజినల్ రింగ్ రోడ్ నిర్మాణం చేస్తున్నాం. భవిష్యత్ అవసరాలకు తగినట్లు భారత్ ఫ్యూచర్ సిటీ నిర్మాణానికి ప్రణాళికలు సిద్ధం చేశాం. విమానాశ్రయం నుంచి భారత్ ఫ్యూచర్ సిటీ అనుసంధానిస్తాం. తెలంగాణలో సేంద్రియ పంటలు పండుతున్నాయి. ప్రపంచ వ్యాప్తంగా డ్రగ్స్ సమస్య ఉంది.. మేం తెలంగాణలో డ్రగ్స్‌ను కంట్రోల్ చేశాం. డ్రగ్స్ నిర్మూలనలో తెలంగాణ దేశంలోనే మొదటి స్థానంలో ఉంది. జ్ఞానంతో పాటు నైపుణ్యం అవసరం. యువతలో నైపుణ్యాలు పెంచేందుకు యంగ్ ఇండియా స్కిల్ యూనివర్సిటీ ఏర్పాటు చేశాం' అని సీఎం రేవంత్‌రెడ్డి వెల్లడించారు. 'మహాత్మా గాంధీ యంగ్ ఇండియా స్ఫూర్తిని అనుసరిస్తున్నాం. యంగ్ ఇండియా స్కిల్ యూనివర్సిటీలో చదువుకున్న వాళ్లకు ఉద్యోగాలు వస్తాయి. స్పోర్ట్స్‌లో దక్షిణ కొరియా వంటి చిన్న దేశాలకు వచ్చే మెడల్స్ చూస్తే ఆశ్చర్యం కలుగుతోంది. ఒలింపిక్స్‌లో పతకాల సాధనే లక్ష్యంగా యంగ్ ఇండియా స్పోర్ట్స్ యూనివర్సిటీ ఏర్పాటు చేశాం. తెలంగాణకు భూపరివేష్టిత రాష్ట్రం (ల్యాండ్ లక్డ్) కావడంతో ఓడ రేవు లేదు. మచిలీపట్నం ఓడ రేవు అనుసంధానానికి ఫ్యూచర్ సిటీ నుంచి గ్రీన్‌ఫీల్డ్ ఎక్స్‌ప్రెస్ హైవే.. దానికి సమాంతరంగా రైల్వే లైన్ మంజూరు చేయాలని కేంద్ర ప్రభుత్వాన్ని కోరుతున్నాం. 2025, డిసెంబర్ 9వ తేదీన తెలంగాణ విజన్ డాక్యుమెంట్ విడుదల చేస్తాం. బల్క్ డ్రగ్స్ ఉత్పత్తిలో 40 శాతం తెలంగాణనే చేస్తోంది. వ్యాక్సిన్ల తయారీలో హైదరాబద్ ముందు వరుసలో ఉంది' అని సీఎం రేవంత్‌రెడ్డి పేర్కొన్నారు.

# సంపాదకీయం..

# అప్పుల ఊబినుంచి బయటపడేదెలా ?

రాష్ట్రాలు ఆర్థికంగా దెబ్బతిని అప్పులపాలు అయినా..కేంద్రం చోద్యం చూస్తోంది. ఇబ్బడిముబ్బడిగా అప్పులు చేస్తున్న ప్రాంతీయ పార్టీల నేతలు అభివృద్ధి పేరుతో అప్పులు చేస్తున్నారు. పలు సందర్భాల్లో ఎన్నికల సంఘం,సుప్రీంకోర్టు గట్టిగానే హెచ్చరిస్తోంది. ఉచిత పథకాలతో జీతాలు కూడా చెల్లించడం గగనంగా మారుతోంది. ఈ దుస్థితి పోవాలి. ఇందుకు తెలుగు రాష్ట్రాల్లో అప్పులే నిదర్శనం. ఇలా ఎవరి ఇష్టం వచ్చినట్లుగా వారు అప్పులు చేయడం, అందుకు కేంద్రం అనుమతించడం, ఆ భారం ప్రజలు భరించాల్సి రావడం ఎంతకాలం అన్నది ప్రశ్నించుకోవాలి. రాష్ట్రాలు జీతాలు కూడా సక్రమంగా చెల్లించు కోలేక, ఉద్యోగులు రిటైర్ అయితే బెనిఫిట్స్ చెల్లించలేక నానాయాతన పడుతున్నాయి. అయినా ఉచిత పథకాలు, పెన్షన్లనే అభివృద్ధిగా చూపుతున్నారు. వీటన్నిటికన్నా రాజకీయ నాయకుల జీతభత్యాలే అత్యధికంగా ఉంటున్నాయి. దీనిని కూడా ముందుగా అరికట్టాలి. రాజకీయంగా దుబారాలపై దృష్టి పెట్టాలి. ఇకపోతే కేంద్రం కూడా రాష్ట్రాలను ఆర్థికంగా దెబ్బతీయడం..వారు పథకాలను సక్రమంగా అమలు చేయలేక పోవడం...అప్పులను బూచిగా చూపి దెబ్బతీయడం వంటి ప్రణాళికలతో కేంద్రంలోని బిజెపి ప్రభుత్వం వ్యవహరిస్తోంది. మోడీ అధికారంలోకి వచ్చాక కేంద్ర రాష్ట్రాల మధ్య సఖ్యత దెబ్బతినడానికి ఇదే కారణం. రాష్ట్రాల ఆదాయ వనరులను దెబ్బతీయడమే గాకుండా నీతి ఆయోగ్ సిఫార్సుల మేరకు రావాల్సిన మొత్తాలను జిఎస్టీ ద్వారా అందడం లేదు. ప్రధానంగా కేంద్ర పన్నుల్లో రాష్ట్ర వాటా నిధులకు సంబంధించి కూడా అన్యాయమే




జరుగుతోంది. మొత్తం పన్నుల్లో 42శాతం నిధులను రాష్ట్రాలకు పంపిణీ చేయాల్సి ఉండగా గడిచిన సంవత్సరాల్లో 37 శాతం నిధులనే పంపిణీ చేసింది. ఇప్పుడు జిఎస్టీ ఆదాయం తగ్గడం వల్ల రాష్ట్రాల ఇప్పుడు మరింత ఖర్చుల భారం పెరిగే అవకాశం ఉంది. ఏటా 5వేల కోట్ల ఆదాయం కోల్పోతామని ఇప్పటికే డిప్యూటి సిఎం భట్టి విక్రమార్క అన్నారు. ఆదాయం తగ్గినా ప్రజలకు మేలు జరగాలని ఎపి సిఎం చంద్రబాబు అన్నారు, ఇకపోతే వివిధ పథకాలతో కాకుండా నేరుగా ఉమ్మడి పథకాలకు కేంద్ర రాష్ట్రాలు ఖర్చు చేయాల్సి ఉంటుంది. పన్నుల వాటా నిధులను సక్రమంగా విడుదల చేయడానికి కేంద్రం చొరవ తీసుకోవాలి. ఉచిత పథకాల పుణ్యమా అని అనేక రాష్ట్రాల్లో అప్పులపైనే భారం వేయాల్సిన దుస్థితి ఏర్పడుతోంది. ఇందుకు ఉమ్మడి తెలుగు రాష్ట్రాలే నిదర్శనం. ఇకపోతే ఎముకే లేదన్నట్లుగా అనేక రాష్ట్రాలు కూడా ఇబ్బడి ముబ్బడిగా అప్పులు చేస్తూ పోతున్నాయి. అప్పులు చేస్తూ సంక్షేమం పేరిట ఆర్థికస్థితిని దివాళా తీయి స్తున్నాయి. విభజన హామీలతో పాటు, అనేకపథకాల అమలుకు సంబంధించిన నిధులు కూడా కేంద్రం సక్రమంగా ఇవ్వడం లేదు. వైఎస్ జగన్, కెసిఆర్‌లు దుబారాలు చేసి రాష్ట్రాలను దివాళా తీయించారు. దీంతో రాష్ట్రాల ప్రగతి కుంటు పడుతోంది. అదే సమయంలో అప్పులు తెచ్చుకున్నా ఉదార పథకాలకు పందేరం చేస్తున్నారు. దీంతో రాష్ట్రాలు అప్పుల ఊబిలో కూరుకు పోతున్నాయి. అప్పులు చేసిన డబ్బులతో రాష్ట్రాన్ని అభివృద్ధి చేస్తున్నామని, ఆర్థికస్థితి బలంగా ఉందని ఉభయ తెలుగురాష్ట్రాల సిఎంలు నిస్సిగ్గుగా ప్రకటిస్తున్నారు. నిజానికి అప్పులతో రాష్ట్రాలు కుదేలవు తున్నాయి. మరోవైపు రాష్ట్రాలకి ఎంతో చేస్తున్నామని కేంద్ర ప్రభుత్వ ప్రచారం చేసుకుంటున్నది. ఏమి చేశారో వివరాలు చెప్పడం లేదు. ఎపిలో కీలకమైన రెవెన్యూ లోటు అంశం ఇప్పటికీ అపరిష్కృతంగానే ఉండిపోయింది. రాష్ట్ర విభజన జరిగిన తరువాత 2014-15లో ఎపి రాష్ట్ర లోటు రూ.16వేల కోట్లుగా ఉన్నట్లు కాగ్ తేల్చింది. ఈ వివరాలను రాష్ట్ర అధికారులు కేంద్రం దృష్టికి తీసుకు వెళ్లారు. అయితే, వీటిని మోడీ సర్కారు పట్టించు కోలేదు. అలాగే తొలి ఐదేళ్ల కాలానికి సంబంధించి కూడా లోటు వివరాలను ఎప్పటికప్పుడు రాష్ట్ర అధికారులు కేంద్రానికి సమర్పించారు. పోలవరం అంచనాలపై పదేపదే చెబుతూ నిధులు విడుదల చేయాలని కోరారు. విద్యుత్, వ్యవసాయ రంగాల్లో సంస్కరణలు అమలు చేయాలని రాష్ట్ర ప్రభుత్వంపై ఒత్తిడి చేస్తోంది. అమరావతి రాజధాని నిర్మాణ బాధ్యతతమదేనని చెప్పుకున్న కేంద్రం కేవలం రూ.1500 కోట్లు మాత్రమే ఇచ్చి చేతులు దులుపుకొంది. రాష్ట్ర పథకాలకు కేంద్రం అందించే నిధుల్లో కూడా కోతలు పెరుగుతున్నట్లు ఆర్థికశాఖ చెబుతోంది. మోడల్ స్కూల్స్, పోలీస్ మోడర్నైజేషన్ స్కీమ్, మెగా ఫుడ్ ప్రాసెసిరగ్ యూనిట్లు, ఇతర నీటిపారుదల, రహదారుల నిర్మాణంవంటి పథకాలకు నిధులు తగ్గినట్లు ఆర్థికశాఖ చెబుతోంది. రాష్ట్ర విభజన సమయంలో ఏడు వెనుకబడిన జిల్లాలకు ఆర్థికసాయం చేస్తామని చెప్పిన కేంద్రం మూడేళ్లకే చేతులెత్తేసింది. నీతి ఆయోగ్ ఏర్పాటు సందర్భంగా ప్రధాని మోడీ కూడా కేంద్ర రాష్ట్ర సంబంధాలపై కొత్త నిర్వచనం ఇచ్చారు. కానీ మోడీ అధికారంలోకి వచ్చాక రాష్ట్రాలను విశ్వాసంలోకి తీసుకోవడం లేదన్న విమర్శలు వస్తూనే ఉన్నాయి. నిధుల కేటాయింపు మొదలు, అభివృద్ధి పనులు కూడా పరస్పర విశ్వాసంతో కొనసాగించాలి. రాష్ట్రాలు తప్పుదోవ పడుతున్న సందర్భంలో అవసరమైన హెచ్చరికలు కూడా చేయాలి. తాజాగా మారిన రాజకీయాల క్రమంలో ఆయా రాష్ట్రాల ఆర్థిక స్తితిపైనా నీతి ఆయోగ్ ద్వారా హెచ్చరికలు చేయడం మంచిదే. ఇకపోతే సిఎంలుగా ప్రతి ఒక్కరూ ప్రధానితో నిరంతరం సమీక్షిం చుకునే అవకాశాలు ఉండాలి. కనీసం ఒక్కో రాష్ట్రానికి ప్రధాని నెలలో ఒక రోజయినా సమయం కేటాయించి రాష్ట్రాల బాగోగులు, సమస్యలు చర్చించాలి. నీతి ఆయోగ్ సమావేశా లను కూడా కనీసం మూడు నెలలకో మారయినా సమావేశ పరచి చర్చిస్తే మంచిది. ధాన్యం సేకరణ, నదీజలాల కేటాయింపు సమస్యలు, విద్యుత్ సమస్యలు, ప్రభుత్వరంగ సంస్థల అమ్మకాలు వంటివి ఏవైనా కేంద్రం కూడా పెద్ద తరహాలో రాష్ట్రాలను విశ్వాసంలోకి తీసుకోవాలి. అప్పుడే కేంద్ర రాష్ట్రాల మధ్య బంధం బలోపేతం అవుతుంది. పార్టీలు వేరయినంత మాత్రాన దేశం వేరు కాదన్న విషయం ఆయా రాష్ట్రాల సిఎంలు కూడా గమనించాలి. పాలనాపరమైన విషయాల కోసం కేంద్రంతో నిత్యం సంబంధాలు నెరపాల్సిందే. అప్పుడే దేశ అభివృద్ధి, ప్రజల సమస్యల పరిష్కారానికి ఉమ్మడిగా ప్రణాళికలు రూపొందించే అవకాశం ఏర్పడుతుంది.

## దేశంలో నీటియాజామన్య లోపం

**- ఏటా వరదలు వస్తున్నా కాపాడుకోలేని దుస్థితి**

**న్యూఢిల్లీ,సెప్టెంబర్19( వెలుతురు):**

వర్షాల ద్వారా మనం పాఠాలు నేర్చుకోవడం లేదు. వరదలను నివారించి, నీటిని నిల్వ చేసుకునే పద్దతలను అవలంబించడం లేదు. దేశవ్యాప్తంగా కురుస్తున్న వర్షాలకు వాగులు వంకలు పొంగుతున్నా నిర్లక్ష్యంతో ప్రజలను బలి చేస్తున్నారు. వరదలతో సామాన్యులు నిండా మునిగినా పాలకుల్లో చలనం రావడం లేదు. దేశంలో జాతీయ జలవిధానం కూడా అమలు కావడం లేదు. ప్రధాని మోడీ నదుల అనుసంధానం గురించి గొప్పలు చెప్పినా పదకొండేళ్లుగా ఆయనకూడా చేసింది శూన్యమనే చెప్పాలి. వరదప్రాంతాల ప్రజలకు పక్కా ఇళ్లు నిర్మించి వారు వరద బారినపడకుండా చేయడం లేదు. వివిధ రాష్ట్రాల్లో చెరువులను మింగిన పాపానికి ఇటీవల కురిసిన వర్షాలకు నగరాలు, పట్టణాలు, గ్రామాలు నీట మునిగాయి. ఇదంతా పాలకుల పాపం కాక మరోటి కాదు. ఈ క్రమంలో గొలుసుకట్టు చెరువులను రక్షించుకోవాలి. పెరుగుతున్న జనాభాను దృష్టిలో పెట్టుకుని కనీసం ఇప్పటి నుంచయినా నీటి అవసరాలను గుర్తించి పొదుపు చేయడం అలవాటు చేసుకోవాలి. గతంలో ఎప్పుడూ లేనంతగా దేశంలో జలాశయాలు నిండుకుండల్లా మారాయి. ప్రాజెక్టుల నుంచి నీరు విడుదల చేయడంతో మళ్లీ సముద్రంలోకి నీరు చేరుతోంది. ముందస్తు ప్రణాళికలు లేకపోవడంతో దేశంలో నీటి యాజమాన్యం సరిగా లేదని ఏటా కురుస్తున్న వర్షాలు స్పష్టం చేస్తున్నాయి. దీనికితోడు అనేక జలాశయా ల్లో పూడిక పేరుకుని పోతోంది. ఏటేటా వర్షాలతో ఒండ్రు చేరుతోందని నిపుణులు చెబుతున్నారు. ఇటీవలి వరదలకు ఉత్తరాది, దక్షిణాది అన్న తేడా లేకుండా అనేక నదులు ఉప్పొంగాయి. చివరకు మళ్లీ నీరు సముద్రానికి చేరింది. తాజాగా కూడా అలాంటి పరిస్థితిని చూస్తున్నాం. ఇప్పటికైనా పాలకులు జాతీయ జలవిధానం రూపొందిం చాల్సి ఉంది. అలాగే వర్షాలతో నష్టపోయిన రైతులకు అండగా నిలిచి వారిని ఆదుకునే ప్రయత్నం చేయాలి. అందుకు జాతీయ జలవిధానం కూడా అవసరమని గుర్తించాలి. జలవిధానంతో నదులను దారి మళ్లించగలిగితే నీటి కటకటలు రావు. ఈ యేడు వర్షాలు విపరీతంగా పడడమే గాకుండా వరదలు పొంగి నదులన్నీ ఉప్పొంగు తున్నాయి. ఈ దశలో నీటి సంరక్షణతో పాటు, రైతు సంక్షేమానికి చర్యలు తీసుకునే ప్రణాళికలు ముందుకు సాగాలి.

**(ఆధ్యాత్మిక చింతన )**

## నెగెటివ్ ఎనర్జీని వదిలించుకోవాలి!

**తిరుమల,సెప్టెంబర్19( వెలుతురు):**

మన శరీరంలోకి అధిక మొత్తంలో ప్రాణశక్తిని చేర్చే ఏకైక మార్గం ధ్యానం, యోగాయే...



అందుకే భారతీయ ఋషులు ధ్యానం, యోగ మార్గాన్నే అనుసరించారు. రోజూ కనీసం అర గంట... ధ్యానం, యోగ చెయ్యండి... ఆరోగ్యంగా జీవించండని తెలిపారు. అలాగే నెగెటివ్ థాట్స్‌కు దూరంగా ఉండాలి. అలా ఉంటేనే మన అవయవాలు సరిగా పనిచేస్తాయి. లేకుంటా వాటిపై ప్రభావం పడి అవి పనిచేయకుండా చచ్చుపడతాయి. మన శరీరం లోకి వెళ్లిన ఆహారం 24 గంటల్లో... మలినంగా బయటికి వెళ్లిపోవాలి. లేకపోతే ఆ మలినాలు జబ్బులకు కారణం అవుతాయి. .మన శరీరం లోకి వెళ్లిన నీరు 4 గంటల్లో బయటికి వెళ్లిపోవాలి, లేకపోతే జబ్బులు తప్పవు. మన శరీరంలోకి వెళ్లిన గాలి ఒక నిముషంలోగా బయటికి వెళ్లిపోవాలి లేకపోతే మనం రోగ గ్రస్థులం అవుతాం. మరి మనలోకి చేరిన కోపం, అసూయ, ద్వేషం, మోసం... ఇలాంటివన్నీ సంవత్సరాలుగా మనలోనే ఉంటే... ఏమౌతుందో తెలుసా... మనం నిత్య రోగగ్రస్తులుగా అవుతాం.అందుకే ఋషులు అంటారు... మనం రోజూ జీవిస్తున్నాం అని అనుకుంటున్న మూర్ఖులం... నిజానికి మనం రోజూ కొద్దీ కొద్దీగా మరణిస్తున్నాం. మనకు వయసు పెరిగితే... ఆయుష్షు తగ్గినట్టా? పెరిగినట్టా?... మనం ప్రతి రోజూ... నెగెటివ్ ఎనర్జీ లతో కొద్ది కొద్దిగా మరణిస్తు న్నామన్న చేదు నిజాన్ని త్వరగా గ్రహించాలి. మనలో చేరి బయటికి వెళ్లిపోకుండా తిష్ట వేసుకొని... మన జీవితాల్ని మృతప్రాయం చేస్తున్న కోపాన్ని, ఒత్తిడిని, ద్వేషాన్ని, బద్ధకాన్ని, అనారో గ్యాన్ని ప్రతి రోజూ ధ్యానం, యోగ చెయ్యడం ద్వారా ప్రాణశక్తిని ఎక్కువగా పొంది నెగెటివ్ ఎనర్జీ దూరం చెయ్యాలి.

## హైదరాబాద్ నగరం వారం రోజుల వర్షాల వేదన..



మన్నారం నాగరాజు
సామాజిక రాజకీయ విశ్లేషకులు.

హైదరాబాద్ నగరం గత వారం రోజులుగా వరుసగా కురుస్తున్న వర్షాల వలన మరోసారి కుదేలైంది. వర్షం అంటే సాధారణంగా ప్రకృతి ప్రసాదం, పంటలకు ఆశీర్వాదం, నగరానికి చల్లదనం అని అనుకుంటారు. కానీ హైదరాబాద్ ప్రజలకు వర్షం అనగానే ఆనందం కన్నా భయం ఎక్కువ అవుతోంది. ఎందుకంటే ఒక గంట పాటు వర్షం కురిసినా నగరంలో జీవితం పూర్తిగా స్తంభిస్తుంది. రోడ్లు చెరువుల్లా మారిపోతాయి, ట్రాఫిక్ జామ్‌లు అంతులేని క్యూలా మారతాయి, లోతట్టు ప్రాంతాలు నీటమునుగుతాయి, బస్తీల్లో మురికినీరు చేరుతుంది.ఈ వారం రోజులుగా ప్రతి రోజు ఎప్పుడో ఒక సమయంలో కురిసిన వర్షం నగరాన్ని మళ్లీ మళ్లీ పరీక్షించింది. మొదటి రోజు వర్షం కురిసినప్పుడే ప్రధాన రోడ్లపై వాహనాలు కదలకుండా నిలిచిపోయాయి. రెండవ రోజు పరిస్థితి మరింతగా దిగజారింది. మూడవ రోజు నుంచే పలు ప్రాంతాల్లో విద్యుత్ సరఫరా ఆగిపోయింది. నాలుగవ రోజు మురికికాలువలు పొంగిపొర్లి బస్తీలలోకి చేరాయి. ఐదవ రోజు పాత భవనాలు కూలిపోయాయి. ఆరో, ఏడవ రోజు వర్షం కురిసే సమయానికి ప్రజలు ఇళ్లలోనుంచే బయటికొచ్చేందుకు భయపడ్డారు.

ట్రాఫిక్ సమస్య మొదటి నుంచే పెద్ద ఇబ్బంది. వర్షం పడగానే హైదరాబాద్‌లోని ప్రధాన రోడ్లు నిలిచిపోతాయి. హైటెక్ సిటీ, మియాపూర్, గచ్చిబౌలి, మణికొండ, కూకట్‌పల్లి, అమీర్‌పేట్, పంజాగుట్ట, మలక్పేట్, ఖైరతాబాద్, ఉప్పల్, సికింద్రాబాద్, ఎర్రమంజిల్ వంటి ప్రాంతాల్లో వాహనదారులు గంటల తరబడి నిలబడిపోయారు. ఒక కిలోమీటరు దూరం వెళ్లడానికి ఒక గంట పడింది. ఆటోలు దొరకలేదు. బస్సులు రాకపోవడంతో ప్రజలు తడిసి ముద్దయ్యారు. మెట్రో స్టేషన్లలో జనం నిలిచిపోయి రైళ్లు రావడానికే సగం గంట సమయం పట్టింది. రెండు చక్రాల వాహనదారులు వర్షపు నీటిలో గుంతల్లో పడిపోయి గాయపడ్డారు. చాలా చోట్ల కార్లు నీటిలో ఇరుక్కుపోయాయి. వర్షం పడితే నగరం స్తంభించడం ఇప్పుడు సహజమైన దృశ్యంలా మారింది. లోతట్టు ప్రాంతాల్లో పరిస్థితి మరింత దారుణంగా ఉంది. అల్వాల్, మలక్‌పేట్, ముషీరాబాద్, చిక్‌పేట, బహదూర్‌పురా, బోయిన్‌పల్లి, చంద్రాయణగుట్ట, మాదన్నపేట, అంబర్‌పేట్, కాచిగూడ, యూసుఫ్‌గూడ, ఎర్రగడ్డ వంటి ప్రాంతాల్లో వర్షపు నీరు మురికికాలువ నీటితో కలసి ఇళ్లలోకి చేరింది. రాత్రివేళలు ప్రజలు నీటిని బయటకు తోసేందుకు బకెట్లు పట్టుకుని గడిపారు. ఇళ్లలోని సామానులు తడిసి పాడైపోయాయి. వృద్ధులు, పిల్లలు ఆ మురికినీటిలోనే గడపాల్సి వచ్చింది. కొన్ని చోట్ల బస్తీలలో గుడిసెలు కూలిపోయాయి. ప్రజలు పొరుగు ఇళ్లలో లేదా పాఠశాల భవనాలలో తలదాచుకున్నారు.విద్యుత్ సమస్య ఈ వారం ప్రజలకు మరొక కష్టం తెచ్చింది. వర్షం కురిసిన ప్రతీసారి చెట్లు వేరుతో సహా కూలిపడి విద్యుత్ తీగలపై పడడంతో పలు ప్రాంతాల్లో విద్యుత్ సరఫరా ఆగిపోయింది. కొన్ని కాలనీలు ఒకే రోజులో 8%-%10 గంటల పాటు చీకటిలోనే గడిపాయి. విద్యుత్ లేకపోవడంతో ఇళ్లలోని మోటర్లు పనిచేయక తాగునీరు సేకరించడంలో ప్రజలు తీవ్రంగా ఇబ్బంది పడ్డారు. చీకటిలో దోమల సమస్య మరింతగా పెరిగింది.ఆరోగ్య సమస్యలు కూడా తీవ్రంగా తలెత్తాయి. వర్షపు నీరు నిలిచిపోవడం వల్ల దోమలు పెరిగాయి. ఫలితంగా డెంగీ, మలేరియా, వైరల్ ఫీవర్ కేసులు పెరుగుతున్నాయని ఆసుపత్రులు చెబుతున్నాయి.



పిల్లల్లో జ్వరం, దగ్గు, జలుబు కేసులు పెరిగాయి. పలు ప్రైవేట్ ఆసుపత్రులు రోగులతో నిండిపోయాయి. ప్రభుత్వ ఆసుపత్రుల్లో కూడా వందలాది కేసులు నమోదయ్యాయి. ఈ వారం రోజుల వర్షం ప్రజల ఆరోగ్యంపై ప్రభావం చూపింది.పాత భవనాలు, గోడలు కూలిపోవడం వలన కొన్ని చోట్ల ప్రాణనష్టం కూడా సంభవించింది. GHMC అధికారులు పాత ఇళ్లను ఖాళీ చేయమని నోటీసులు ఇచ్చినా, పేద కుటుంబాలకు వెళ్లడానికి వేరే చోటు లేకపోవడంతో ప్రమాదం తప్పలేదు. పాత నగరంలోని కొన్ని ఇళ్లు కూలిపోవడంతో ప్రజలు భయంతో గడిపారు. %+ఎవీజ% సిబ్బంది అత్యవసరంగా సహాయం చేసినా, సమస్య పూర్తిగా పరిష్కారం కాలేదు.చిన్న వ్యాపారులు, రోడ్డు పక్క దుకాణదారులు ఈ వర్షంతో తీవ్రంగా నష్టపోయారు. వర్షం పడగానే వీధుల్లో కస్టమర్లు కనిపించకపోవడంతో అమ్మకాలు పడిపోయాయి. వర్షపు నీటితో దుకాణాలు తడవడంతో సరుకులు పాడైపోయాయి. రోజువారీ ఆదాయం మీద ఆధారపడి జీవించే వ్యాపారులు ఈ వారం ఆర్థికంగా ఇబ్బంది పడ్డారు. పండ్ల వ్యాపారులు, కూరగాయల అమ్మకందారులు నష్టపోయారు. మార్కెట్లలో సరుకులు తడవడంతో ధరలు పెరిగాయి.

విద్యార్థులు కూడా ఇబ్బంది పడ్డారు. వర్షం పడే సమయాల్లో స్కూల్ బస్సులు సమయానికి రాలేకపోవడంతో పిల్లలు గంటల తరబడి నిలబడ్డారు. రోడ్లపై ట్రాఫిక్ వల్ల ఆలస్యమవడంతో పాఠశాలలకు సమయానికి చేరుకోలేకపోయారు. కొన్ని చోట్ల పాఠశాలలు ముందుగానే విద్యార్థులను వదిలేయాల్సి వచ్చింది. తల్లిదండ్రులు వర్షంలో పిల్లలను తీసుకువెళ్లడం కోసం కష్టపడ్డారు.

ఉద్యోగులు, ముఖ్యంగా ఐటీ రంగంలో పనిచేసేవారు, ఈ వారం రాత్రివేళ ఇళ్లకు చేరుకోవడం చాలా కష్టపడ్డారు. వర్షం పడగానే ఆఫీసుల వద్ద వాహనాలు కదలకుండా నిలిచిపోవడంతో చాలామంది తమ కార్యాలయాల్లోనే ఎక్కువసేపు గడిపారు. కొందరు రాత్రి 10%-%11 గంటలకు మాత్రమే ఇళ్లకు చేరుకున్నారు. మెట్రో స్టేషన్లలో జనం నిలబడి రైళ్ల కోసం వేచి చూశారు. ఆటోలు, క్యాబ్‌లు దొరకకపోవడంతో ఉద్యోగులు ఇబ్బంది పడ్డారు.

హైదరాబాద్ రోడ్ల అసలు పరిస్థితి ఈ వర్షాల వలన బహిర్గతమైంది. ఎన్ని కోట్లతో రోడ్లు వేశామంటున్నా, వారం రోజుల వర్షానికే గుంతలు, గోతులు బయటపడ్డాయి. వర్షపు నీటిలో దాగి ఉన్న గుంతల్లో వాహనాలు పడిపోవడం తరచూ జరిగింది. ట్రాఫిక్ పోలీసులు, GHMC సిబ్బంది తాత్కాలికంగా బారికేడ్లు పెట్టినా, సమస్య పూర్తిగా పరిష్కారం కాలేదు.మరొక ప్రధాన సమస్య పాత చెట్లు వేరుతో సహా కూలిపోవడం. వారం రోజుల వర్షంలో పలు ప్రాంతాల్లో చెట్లు కూలి వాహనాలు దెబ్బతిన్నాయి, కొందరు గాయపడ్డారు. విద్యుత్ తీగలపై పడిన చెట్ల వల్ల మరికొన్ని ప్రాంతాలు చీకటిలో మునిగాయి.

ప్రతి సారి వర్షం పడితే నగరం స్తంభించడం కొత్త విషయం కాదు. కానీ ఈసారి వరుసగా వారం రోజుల పాటు వర్షం పడటం వలన సమస్యలు మరింత పెరిగాయి. కాలువలు శుభ్రం చేయకపోవడం, డ్రైనేజీలు మూసుకుపోవడం, రోడ్లపై నీరు చేరడం, ఇవన్నీ GHMC పనితీరుపై ప్రశ్నలు లేవనెత్తాయి. అధికారుల వైఫల్యం వల్లే వర్షం ప్రజలకు విపత్తుగా మారిందని పౌరులు ఆగ్రహిస్తున్నారు.

ప్రజలు ఇప్పుడు ఒకటే మాట చెబుతున్నారు , “విశ్వ నగరమని గొప్పలు చెప్పుకుంటారు, కానీ వారం రోజుల వర్షం పడగానే నగరం విషాద నగరంగా మారిపోతుంది. ఇక్కడ జీవించడం ఒక కష్టసాధ్యమైన పని అవుతోంది. ఈ సమస్యలు ఎప్పటికి తీరుతాయో తెలియదు” అని.

హైదరాబాద్ నగరం ఈ వారం రోజుల వర్షాలతో మరోసారి నిరూపించింది ం వర్షం అనేది ప్రకృతి వరం అయినప్పటికీ, దాన్ని ఎదుర్కొనే ప్రణాళికలు లేకపోతే అది ప్రజలకు విపత్తు అవుతుంది. ఈ వర్షం ప్రజలకు ఇబ్బందులు మాత్రమే కాదు, పాలకుల వైఫల్యాన్ని కూడా బహిర్గతం చేసింది అనేది నగ్నసత్యం.

## ఇబ్రహీంపట్నం బస్సు డిపో ముందు బిజెపి ఆధ్వర్యంలో ధర్నా

- ఇబ్రహీంపట్నం పాత బస్టాండ్ వరకు బస్సులు నడపాలి
- ఇబ్రహీంపట్నం మున్సిపాలిటీ బిజెపి అధ్యక్షుడు ముత్యాల మహేందర్




**ఇబ్రహీంపట్నం వెలుతురు సెప్టెంబర్ 19:**
ఇబ్రహీంపట్నం మున్సిపాలిటీ పాత బస్టాండు వరకు బస్సుల రాకపోకలు కొనసాగించాలని డిమాండ్ చేస్తూ బిజెపి ఇబ్రహీంపట్నం మున్సిపాలిటీ అధ్యక్షుడు ముత్యాల మహేందర్ ఆధ్వర్యంలో ఇబ్రహీంపట్నం బస్సు డిపో ముందు ధర్నా నిర్వహించారుఈసందర్భంగా ముత్యాల మహేందర్ మాట్లాడుతూ పాతబస్టాండ్ వరకు బస్సులు రాకపోకలు కొనసాగించాలని ప లుమార్లుడిపో మేనేజర్ కుఫిర్యాదు చేసిన పట్టించుకోవడంలేదని మండిపడ్డారు గురువారం రాత్రి అంబేద్కర్ చౌరస్తాలో ఆగిన ఆర్టీసీ బస్సు డ్రైవర్ ను బస్సు పాత బస్టాండ్ వద్దకువెళ్లాలని అడిగితే దురుసుగా మాట్లాడారని ఆగ్రహం వ్యక్తం చేశారు ఇప్పటికైనా బస్సులను పాత బస్టాండ్ వరకు రాకపోకలు కొనసాగించాలని డిపో మేనేజర్ వెంటనే స్పందించి పాత బస్టాండ్ వరకు బస్సులు రాకపోకలు జరిగేలా బస్సు డ్రైవర్లకు దేశాలుఇవ్వాలని అన్నారు లేనిపక్షంలో బిజెపి పార్టీ ఆధ్వర్యంలో ఆందోళన వేగవంతం చేస్తాం అని హెచ్చరించారు ఈకార్యక్రమంలో బిజెపి నాయకులు జక్క రవీందర్ రెడ్డి ఆకులసంతోష్ తదితరులు పాల్గొన్నారు

## ప్రభుత్వ హాస్టల్లో మెస్ బిల్లులు చెల్లించాలని ఆర్ కృష్ణయ్య డిమాండ్



**బషీర్ బాగ్ వెలుతురు 19 సెప్టెంబర్:**
గత 18 నెలలుగా రాష్ట్రంలోని ఎస్టీ హాస్టల్స్ లో మెస్ బిల్లులు రాష్ట్ర ప్రభుత్వం చెల్లించడం లేదని జాతీయ బీసీ సంక్షేమ సంఘం జాతీయ అధ్యక్షులు, రాజ్యసభ సభ్యుడు ఆర్ కృష్ణయ్య అన్నారు. దీని మూలంగా హాస్టల్ లలో వార్డెన్ లు వడ్డీలకు డబ్బులు తెచ్చి , మెస్ లు నిర్వహిస్తున్నారని తెలిపారు. శుక్రవారం హైదరాబాద్, బషీర్ బాగ్ ప్రెస్ క్లబ్ లో బీసీ యువజన సంఘం వర్కింగ్ ప్రెసిడెంట్ నీల వెంకటేష్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆర్ కృష్ణయ్య పాల్గొని, మాట్లాడారు. ఎస్సీ, ఎస్టీ , బీసీ హాస్టళ్లు అద్దె భవనాల్లో కొనసాగుతున్నాయని... వాటి అద్దె బిల్లులు గత 20 నెలలుగా చెల్లించడం లేదని విమర్శించారు. ఫైనాన్స్ సెక్రెటరీ సందీప్ సుల్తానీయా , డిప్యూటీ సీఎం బట్టి విక్రమార్క లను పలుమార్లు కలిసి వినతి పత్రాలను అందజేసిన స్పందించడం లేదన్నారు. బడా బడా కాంట్రాక్టర్లకు వేలాది కోట్లు విడుదల చేస్తున్న ప్రభుత్వానికి... ఎస్టీ హాస్టళ్ల మెస్ చార్జీల బిల్లులు చెల్లించడానికి వంద కోట్లు లేవా అని ఆయన ప్రశ్నించారు. దసరా వరకు రాష్ట్ర ప్రభుత్వానికి గడువు ఇస్తున్నామని... అప్పటివరకు బిల్లులు చెల్లించకపోతే , వేలాది మంది విద్యార్థులతో ప్రజా భవన్ ముట్టడిస్తామని ఆర్. కృష్ణయ్య స్పష్టం చేశారు. బీసీ యువజన సంఘం వర్కింగ్ ప్రెసిడెంట్నీల వెంకటేష్ మాట్లాడుతూ గిరిజన శాఖ మంత్రి అడ్లూరి లక్ష్మణ్ దృష్టి సారించి సీఎం రేవంత్ రెడ్డి మాట్లాడి మెస్ బిల్లులు తక్షణమే విడుదల చేయాలన్నారు. ఈ సమావేశంలో బీసీ నేతలు గుజ్జ కృష్ణ, అనంతయ్య, నంద గోపాల్, శివ కుమార్ యాదవ్, నరేష్ గౌడ్, కిరణ్ , రవి యాదవ్ తదితరులు పాల్గొన్నారు.

## కాచిగూడ నూతన ట్రాఫిక్ సీఐని కలిసిన ఎస్.ఆర్.ఈ ట్రావెల్స్ మేనేజర్ లు



**వెలుతురు, హైదరాబాద్ సెప్టెంబర్ 19 :**
కాచిగూడ ట్రాఫిక్ పోలీస్ స్టేషన్ నూతన ఇన్స్ స్పెక్టర్ గా బాధ్యతలు చేపట్టిన బి.వి.కౌశిక్ ని కాచిగూడ ఎస్.ఆర్.ఈ ట్రావెల్స్ మేనేజర్ లు బాలరాజు, విష్ణుగౌడ్ లు శుక్రవారం మర్యాద పూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా ఇన్స్ స్పెక్టర్ ని శాలువతో సన్మానించి, పుష్పగు చ్చం అందజేసి శుభాకాంక్షలు తెలిపారు. అనంతరం సీఐ మాట్లాడుతూ...పీఎస్ పరిధి వ్యాప్తంగా ట్రాఫిక్ నియంత్రణకు ప్రతి ఒక్కరూ సహకరించాలని సూచించారు.

## ఆరు గ్యారెంటీలపై వినూత్న ప్రచారం

**ఆదిలాబాద్, సెప్టెంబరు19 ( వెలుతురు):**
ఆదిలాబాద్ జిల్లా ఇచ్చోడ మండలంలోని ముఖ్రు (కే) గ్రామంలో ప్రభుత్వ 6గ్యారెంటీలపై వినూత్న రీతిలో ప్రచారం చేశారు. 6 గ్యారంటిలతో కాంగ్రెస్ పార్టీ ప్రజలను పథకాల వారీగా ఏ విధంగా మోసం చేసిందో గ్రామంలో ఇంటిటీకి, గ్రామంలో గోడలపై వాల్ పోస్టర్ లను మాజీ సర్పంచ్ మీనాక్షి అంటించి ప్రచారం చేశారు. కాంగ్రెస్ ప్రభుత్వం తెలంగాణ ప్రజలకు ఎన్నికల్లో ఇచ్చిన హామీలను అమలు చేయకుండా ప్రజలకు ఏ విధంగా మోసం చేసిందో మహాలక్ష్మి పథకం 2500,తులం బంగారం, 4000 పింఛన్, ఆడపిల్లలకు స్కూటీలు, సంపూర్ణ రుణమాఫీ, 15000 రైతు భరోసా, పథకాల వాల్ పోస్టర్ను గ్రామంలో అతికించి మాజీ సర్పంచ్ గాడ్గే మీనాక్షి తెలియజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. కాంగ్రెస్ ప్రభుత్వం హామీల పేరుతొ ప్రజలను మోసం చేసింది అని, ఒక పథకం కూడా సరిగ్గా అమలు చెయ్యక ప్రజలను మోసం చేసిందని, 100 రోజుల్లో 6 గ్యారంటీలు పూర్తిగా అమలు చేస్తానని చెప్పి అధికారంలో వచ్చి 22 నెలలు అవుతున్న ఇంకా పూర్తిగా హామీలు అమలు చేస్తలేదని, అమలు కానీ హామీలు ఇచ్చి ప్రజలను కాంగ్రెస్ సర్కార్ మోసం చేసిందని, ఇంటిటీకి తిరిగి బోర్డలను పెట్టడం జరిగిందన్నారు. ఈ కార్యక్రమంలో మాజీ ఎంపీటీసీ గాడ్గే సుభాష్, గ్రామస్తులు పాల్గొన్నారు.

## హైదరాబాద్ లో కురుస్తున్న వర్షాలు, తీసుకోవాల్సిన జాగ్రత్త చర్యలపై అధికారులతో మంత్రి పొన్నం ప్రభాకర్ టెలికాన్ఫరెన్స్



**హైదరాబాద్ వెలుతురు సెప్టెంబర్ 19:**
హైదరాబాద్ లో కురుస్తున్న భారీ వర్షాలు తీసుకుంటున్న చర్యలపై జీహెచ్ఎంసీ ,హైడ్రా,పోలీస్, ట్రాఫిక్, హైదరాబాద్ మెట్రో వాటర్ వర్క్, జిల్లా రెవెన్యూ , విద్యుత్ ,హెల్త్ వివిధ విభాగాల అధికారులతో హైదరాబాద్ ఇన్చార్జి మంత్రి పొన్నం ప్రభాకర్ టెలికాన్ఫరెన్స్ నిర్వహించారు. నగరంలో గత మూడు రోజులుగా పలు ప్రాంతాల్లో తక్కువ సమయంలో ఎక్కువ వర్షం కురుస్తుండటం ప్రజల ఇబ్బందులు పడుతుండడంతో అధికారులు అప్రమత్తంగా ఉండాలని ఆదేశించారు. వచ్చే మూడు రోజుల వరకు భారీ వర్షాలు కురిసే అవకాశం ఉందని వాతావరణ శాఖ హెచ్చరికలతో అధికారులు విధుల్లో ఉండాలని ఆదేశించారు. లోతట్టు ప్రాంతాల్లో నివసిస్తున్న ప్రజలు ఇబ్బందులు పిర్యాదులు వస్తె వెంటనే స్పందించాలని ఆదేశించారు. ప్రజలు పిర్యాదు చేసే టోల్ ఫ్రీ నెంబర్ లు టీవీ లు ,సంజిక మాధ్యమాల ద్వారా ప్రజలకు తెలిసేలా చేయాలన్నారు. పునరావాస కేంద్రాల్లో అన్ని రకాల సౌకర్యాలు కల్పించాలని సూచించారు. రైల్వే అండర్ బ్రిడ్జి ల వద్ద వాహనదారులు జాగ్రత్తగా వెళ్ళేల అక్కడ పోలీస్ సిబ్బందిని ఏర్పాటు చేయాలని తెలిపారు. భారీ వర్షం కురిసినప్పుడు వరద నీరు వెళ్ళేడానికి మ్యాన్ హోల్ లు ప్రమాదాలు జరగకుండా అక్కడ జీహెచ్ఎంసీ సిబ్బంది నిరంతరం పర్యవేక్షించాలనీ సూచించారు. విద్యుత్ స్తంభాల ,విద్యుత్ తీగల వద్ద జాగ్రత్తగా వ్యవహరించాలని సూచించారు. భారీ వర్షాలు కురిసే అవకాశం ఉన్నప్పుడు ప్రజలను అప్రమత్తం చేస్తూ మొబైల్ మెసేజ్ ల రూపంలో సందేశాలు పంపాలని ఆదేశించారు. తీవ్రత అధికంగా ఉన్నప్పుడు అత్యవసరం అయితేనే బయటకు రావాలని ప్రజలకు విజ్ఞప్తి చేయాలని అధికారులకు సూచించారు. తాగునీటి సరఫరా అయ్యే సమయంలో కచ్చితంగా మంచినీటినవణ్యతను పరీక్షించాలి. ఎక్కడ తాగునీరు కలుస్తాం కాకుండా తగు జాగ్రత్త చర్యలు తీసుకోవాలి. బస్తీలు లోతట్టు ప్రాంతం మరింత అప్రమత్తంగా ఉండాలని ఆదేశించారు. నగర ప్రజలు ఇలాంటి పరిస్థితులను మ్యాన్ హోల్ మూతలు తెరవకుండా జాగ్రత్తలు తీసుకోవాలి. హైడ్రా ,జిహెచ్ఎంసి, పోలీసు, ఇతర విభాగాల అధికారులు సమన్వయం చేసుకుంటూ పని చేయాలి.



పెండింగ్ లో ఉన్న నిరుద్యోగుల సమస్యలను ప్రభుత్వం వెంటనే పరిష్కరించి జాబ్ క్యాలెండర్ ను ప్రకటించాలని కోరుతూ గత ఐదు రోజులుగా ఆమరణ నిరాహారదీక్ష చేస్తున్న పాలకూరి అశోక్ గౌడ్ ను పోలీసులు బలవంతంగా దీక్షను భగ్నం చేసే ప్రయత్నం చేశారు అయినా తను వనస్థలిపురం లో గల ప్రభుత్వ ఆసుపత్రిలో ఆమరణ నిరాహారదీక్ష ను కొనసాగిస్తున్నారు.. అశోక్ గౌడ్ ను పరామర్శించడం జరిగింది.

**అయిలి వెంకన్న గౌడ్.**

**రాష్ట్ర అధ్యక్షులు గౌడ కల్లుగీత వృత్తిదారుల సంఘం.**

**హైదరాబాద్ వెలుతురు సెప్టెంబర్ 19:**

## సోషల్ మీడియా ట్రోల్‌తో ప్రాచుర్యం కల్పించారు

- బిఆర్ఎస్‌కు రుణపడి ఉన్నా: ఎంపి చామల

**హైదరాబాద్,సెప్టెంబరు19 ( వెలుతురు):**
సోషల్ మీడియాలో తనను ట్రోల్ చేస్తూ ప్రాచుర్యం కల్పించిందే బిఆర్ఎస్ అని కాంగ్రెస్ ఎంపి చామల కిరణ్‌కుమార్ రెడ్డి అన్నారు. తాను ఏదీ మాట్లాడినా దాంట్లో నుంచి కొంత తీసేసి మరి కొంత ప్రచారం చేస్తున్న బిఆర్ఎస్ నాయకులకు ధన్యవాదాలు అని చామల కిరణ్‌కుమార్ రెడ్డి శుక్రవారం మీడియా ప్రతినిధులతో మాట్లడుతూ చెప్పారు. తనను ట్రోల్ చేస్తే భయపడి మాట్లాడడం ఆపేస్తానని వారు భావిస్తున్నారేమోనని ఆయన తెలిపారు. తాను ఒక్కసారి మీడియా సమావేశాన్ని నిర్వహిస్తే, బిఆర్ఎస్ నేతలు దానిని మూడు, నాలుగు రోజులు తిప్పుతూ ట్రోల్ చేస్తుంటారని ఆయన చెప్పారు. ఇది ఒక రకంగా తనకు మేలు కలుగుతున్నదన్నారు. నీటి పారుదల విషయంలో బిఆర్ఎస్ నేతలు తప్పుడు ప్రచారం చేస్తూ ప్రజలను తప్పుదారి పట్టిస్తున్నారని ఆయన విమర్శించారు. బనకచర్లపై కొన్ని రోజులు డ్రామా చేశారని, కాంగ్రెస్ ప్రభుత్వం తప్పు చేస్తున్నదంటూ బిఆర్ఎస్ ఎమ్మెల్యే, మాజీ మంత్రి టి. హరీష్ రావు ఏకపాత్రాభినయం చేశారని ఆయన విమర్శించారు. పోతిరెడ్డి పాడుకు గండి కొట్టడానికి సహకరించింది బిఆర్ఎస్సేనని ఆయన విమర్శించారు. కృష్ణా నీటిని ఆంధ్ర ప్రదేశ్ ప్రభుత్వం తరలించుకుపోతుంటే పది సంవత్సరాలు ముఖ్యమంత్రిగా ఉన్న బిఆర్ఎస్ నేత కె. చంద్రశేఖర్ రావు ఎందుకు మౌనంగా ఉన్నారని ఎంపి చామల ప్రశ్నించారు. బనకచర్ల, ఆల్మట్టి విషయంలో తమ ప్రభుత్వం అలసత్వంగా లేదని ఆయన తెలిపారు.

## లయన్స్ క్లబ్ డిస్ట్రిక్ట్ 320బి లో జరిగిన నిధుల దుర్వినియోగంపై విచారణ జరిపించండి

- సామాజిక కార్యకర్త స్పెన్సర్ లాల్ డిమాండ్



**హైదరాబాద్ వెలుతురు సెప్టెంబర్ 19:**
లయన్స్ క్లబ్ ఆఫ్ హైదరాబాద్ డిస్ట్రిక్ట్ 320బిలో జరిగిన నిధుల దుర్వినియోగంపై విచారణ జరిపించి, బాధ్యులైన వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని సామాజిక కార్యకర్త స్పెన్సర్ లాల్ డిమాండ్ చేశారు. క్లబ్లో జరిగిన నిధుల దుర్వినియోగంపై ప్రశ్నించిన లయన్స్ క్లబ్కు చెందిన ఓ మహిళా సభ్యురాలిని లయన్స్ క్లబ్ నుంచి బైలాకు విరుద్ధంగా తొలగించారని ఆయన ఆరోపించారు. శుక్రవారం బర్కత్పురలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో మరో సామాజిక కార్యకర్త రాజుతో కలిసి ఆయన మాట్లాడుతూ నిధుల దుర్వినియోగానికి పాల్పడిన లయన్స్ క్లబ్లో ఉన్న సీనియర్ సభ్యులైన టి.రాజేంద్ర ప్రసాద్ (ఎ1), వీణా సరస్వతి (ఎ2), విజయ్ కుమార్ శెట్టి (ఎ3), సల్వసాయి రామరాజు(ఎ4). లింగమూర్తి (ఎ5), అబాన్ ఇచాపోరియా(ఎ6)లపై సికింద్రాబాద్ కోర్టులో ప్రైవేట్ క్రిమినల్ కేసు దాఖలు చేయడం జరిగిందన్నారు. వీరిపై బిఎన్ఎ ఎస్ 351(2), 356(2), 61(2), 79, 3(5) సెక్షన్ల కింద కేసులు నమోదైనట్లు ఆయన తెలిపారు. సేవా కార్యక్రమాలకు నిలయమైన లయన్స్ క్లబ్ లో అవినీతికి పాల్పడిన వారిని వెంటనే లయన్స్ క్లబ్ సభ్యత్వం నుంచి తొలగించాలని డిమాండ్ చేశారు. లేని పక్షంలో సికింద్రాబాద్ లయన్స్ భవన్ ఎదుట ధర్నా చేస్తామని వారు హెచ్చరించారు. లయన్స్ క్లబ్నుంచి నిబంధనలకు విరుద్ధంగా తొలగించబడిన మహిళ తనకు జరిగిన అన్యాయాన్ని వివరిస్తూ క్లబ్ నిధుల దుర్వినియోగంపై సమగ్ర దర్యాప్తుకు ఆదేశించాలని, అక్రమంగా తొలగించిన తన లయన్స్ క్లబ్ సభ్యత్వాన్ని పునరుద్ధరించాలని కోరుతూ కోర్టును ఆశ్రించిందని ఆయన పేర్కొన్నారు. నిధుల దుర్వినియోగంపై ప్రశ్నించి సస్పెన్షన్కు గురైన మహిళకు న్యాయం జరిగే విధంగా చూడాలని, వారు లయన్స్ ఇంటర్నేషనల్ ప్రతినిధులను, ప్రభుత్వ అధికారులను కోరారు.

## దాద్ పల్లి పారశాల విద్యార్థులకు దాతల సహకారంతో షూస్ పంపిణీ

### షూ పంపిణీ చేయడం అభినందనియం ఎంఈఓ రాందాస్





**మంచాల వెలుతురు సెప్టెంబర్ 19:**
మంచాల మండలం దాధ్ పల్లి గ్రామంలోని ప్రాథమికోన్నత పాఠశాల విద్యార్థులకు దాత మీనుగు శ్రీనివాస్ పాఠశాలలోని 1వ తరగతి నుండి 7వ తరగతుల విద్యార్థులకు షూస్ ను అందజేశరు ఈకార్యక్రమానికి ముఖ్యఅతిథిగా మండల విద్యాధికారి రాందాస్ హాజరై మాట్లాడుతూ పాఠశాల విద్యార్థులకు షూస్ పంపిణీ చేసిన దాత మీనుగు శ్రీనివాస్ ను అభినందించిలలో సన్మానించారు దాతలు గ్రామస్తులు అందరూ ప్రభుత్వ పాఠశాలల చదివే పేద విద్యార్థులకు సహాయం చేయాలని అన్నారు అప్పుడే ప్రభుత్వ పాఠశాల విద్యార్థులు ప్రవేట్ పాఠశాల విద్యార్థులకు దీటుగా ఎదుగుతారు అదేవిధంగా పాఠశాల ప్రధానోపాధ్యయులు యన్.యాదగిరి నికూడా అభినందించారు పాఠశాల ప్రధానోపాధ్యాయులు యన్ యాదగిరి మాట్లాడుతూ ప్రభుత్వ పాఠశాల్లో చదివే పేద విద్యార్థులకు ఈవిద్య సంవత్సరంలో ఉచితంగా షూస్ సహాయం చేస్తున్న గ్రామస్థులు శ్రీనివాస్ కి పాఠశాల తరుపున కృతజ్ఞతలు తెలిపారు శ్రీనివాస్, గత సంవత్సరంలో విద్యార్థులందరికీ ఉచితంగా ఐడి కార్డులు మరియు బెల్ట్, టై అందించారు రాబోయే రోజుల్లో కూడా ఇలాగే పాఠశాల అభివృద్ధికి సహాయపడాలని కోరుతున్నాను అని అన్నారు అలాగే పాఠశాలలో చదువుకుంటున్న విద్యార్థులు ప్రతిరోజు పాఠశాలకు హాజరుకావాలని ఉపాధ్యాయులు చెప్పిన విధంగా నడుచుకొని పాఠశాలకు మంచిపేరు తీసుకురావాలని కోరారు గత ఏడు సంవత్సరాలుగా పాఠశాలలో ఉపాధ్యాయుల కొరత ఉన్నతనలలో సొంత నిధులతో విద్యావాలంటీర్లను నియమించడం జరిగిందని తెలిపారు రాబోయే విద్యాసంవత్సరంలో గ్రామస్తులంతా పిల్లలను గ్రామంలోని పాఠశాలలకు పంపాలని విజ్ఞప్తి చేసారు అనంతరం షూస్ పంపిణీ చేసిన మీనుగు శ్రీనివాస్, మాట్లాడుతూ ప్రభుత్వ పాఠశాలల్లో చదివే విద్యార్థులు కూడా ప్రవేట్ పాఠశాల విద్యార్థులగా ఉండాలనే ఉద్దేశంతో నావంతు సాయం చేస్తున్నాను అని చెప్పారు అభివృద్ధి సహకరించాలని కోరారు ఈసందర్భంగా జిల్లాస్థాయి ఉత్తమ ఉపాధ్యాయులుగా అవార్డు అందుకున్న ఉపాధ్యాయులు డి. ప్రసన్నకుమారి ఎండి జావేద్ ను బిటిఎఫ్ రాష్ట్ర అధ్యక్షులు యన్ యాదగిరిగా మంచాల ఎంఈఓ రాందాస్ గారిచే సన్మానం చేసారు ఈకార్యక్రమంలో ఎం శోభారాణి వెంకటేశ్వర తండా ప్రధానోపాధ్యాయులు ఎండి జావేద్ విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు

## ఉద్యోగ విరమణ అభినందన సభలో అవయవ, శరీరదానం చేసిన ఉపాధ్యాయ దంపతులు

### అభినందించిన ఈటెల రాజేందర్, డిఇఓ సుశీందర్ రావు

### శరీర దానం,అవయవ దానం అంటే ప్రాణ దానమే - ఇంజమూరి రఘునందన్



**రంగారెడ్డి జిల్లా వెలుతురు సెప్టెంబర్ 19:**
జిల్లా పరిషత్ హై స్కూల్ ప్రధానోపాధ్యాయులు ప్రధానోపాధ్యాయులు సూర్యపల్లి ఉమాదేవి ఉద్యోగ విరమణ అభినందన సభలో ఉమాదేవి వారి భర్త ఇంజమూరి రఘునందన్ దంపతులు మరణానంతరం తమ దేహాలను మరియు అవయవాలను వైద్య విద్యార్థుల విద్యాభ్యాసమునకు ఉపయోగపడాలనే ఉద్దేశ్యంతో గాంధీ ఆసుపత్రి వైద్య కళాశాలకు అందచేయాలని మల్కాజిగిరి పార్లమెంట్ సభ్యులు ఈటెల రాజేందర్, డిఇఓ సుశీందర్ రావు గారల సమీక్షలో అమ్మ ఐ ఆర్గాన్ మరియు బాడీ డొనేషన్ ప్రమోటర్స్ ఆర్గనైజేషన్ సంస్థ ప్రతినిధి కృష్ణ చంద్ కి తమ అంగీకార ప్రమాణ పత్రములు అందచేయడం జరిగింది. శరీర దానం (%దీశీంఎ ఐశీఞఆశీఅ%) చేయడం అనేది మరింతగా ప్రాచుర్యంలోకి రావాలనే ఇది అందరికీ తెలియాలని తద్వారా ఇతరులు కూడా ఆలోచించి ముందుకు వస్తారని ఆశించి ఉద్యోగ విరమణ అభినందన సభలో సభికుల చప్పట్ల మధ్య ప్రకటించడం జరిగింది. ఈ సందర్భంగా వారిని ఈటెల రాజేందర్, రంగారెడ్డి డిఇఓ సుశీందర్ రావు, కార్పొరేటర్లు ప్రేమేందర్ రెడ్డి, ఆకుల శ్రీవాణి ఉపాధ్యాయ సంఘాల నాయకులు, సభకు హాజరైన ఉపాధ్యాయులు అభినందించారు. పుట్టిన వాళ్ళు అందరూ ఎప్పుడో ఒకప్పుడు గిట్టే వాళ్ళే గిట్టిన అనంతరం కూడా మన దేహం, మన అవయవాలు ఇతరులకు ఉపయోగపడితే మన పుట్టుకకు ఒక సార్థకత ఉంటుంది. వైద్య విజ్ఞానం మరింతగా అభివృద్ధి కావాలి. మానవ శరీర నిర్మాణం గూర్చి వైద్య విద్యార్థులు ప్రత్యక్షంగా తెలుసుకోవాలంటే వారికి ప్రాక్టికల్స్ గా మనుషుల డెడ్ బాడీలు అవసరం. నేడు మెడికల్ కాలేజీలు డెడ్ బాడీల కొరతను ఎదుర్కొంటున్నవి. ఫలితంగా వైద్య విద్యార్థులు సమగ్ర వైద్య విజ్ఞానం పొందలేక పోతున్నారు. కాబట్టి మిత్రులారా మనమంతా అవయవ దానం గురించి, శరీర దానం గురించి ప్రజల్లో ఉన్న అపోహలు తొలగించుటకు కృషి చేద్దామని, శరీర దాతలు ముందుకు వచ్చేలా కృషి చేద్దామని ఈ సందర్భంగా సూర్యపల్లి ఉమాదేవి దంపతులు పిలుపునిచ్చారు.

https://epaper.velthuru.com



## డైరెక్టర్ ఆఫ్ పబ్లిక్ హెల్త్ & ప్యామిలీ వెల్ఫేర్ కమీషనర్ కు వినతి పత్రం అందజేత.



**హైదరాబాద్ వెలుతురు సెప్టెంబర్ 19:**
మర్రిగూడ మండల కేంద్రంలో రెండు వైద్య కేంద్రాలు(CHC,PHC) ఒకే ఆవరణలో ఉండడం చట్ట విరుద్ధం అని భావించి ప్రాథమిక ఆరోగ్య కేంద్రంను మండల పరిధిలోని శివన్నగూడ గ్రామం పరిసర ప్రాంతాలలో నివసించే పేద ప్రజలు మండల కేంద్రానికి రాలేక ప్రైవేట్ ఆసుపత్రులలో డబ్బులు వైద్యానికి ఖర్చు చేసి తీవ్రంగా నష్టపోతున్నారు. ఈ విషయాన్ని దృష్టిలో ఉంచుకొని శివన్నగూడ గ్రామంలో ప్రాథమిక ఆరోగ్య కేంద్రంను ఏర్పాటు చేస్తే వేల మంది బీసీ, ఎస్సీ, ఎస్టీ, మైనార్టీ మరియు ఓసి పేద ప్రజలకు వైద్య సదుపాయం అందుతుందనే ఉద్దేశంతో శివన్నగూడ గ్రామంలో ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని ఏర్పాటు చేయాలని అప్పటి మండల ప్రజా ప్రతినిధులు తీర్మానం చేశారు. ప్రభుత్వం ఉత్తర్వులు కూడ జారీ చేశారు. కానీ ఇప్పటివరకు అధికారులు ఎలాంటి ఏర్పాట్లు చేయలేకపోయారని కావున దయచేసి అట్టి గ్రామాల ప్రజల శ్రేయస్సును దృష్టిలో ఉంచుకొని వెంటనే ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని శివన్నగూడ గ్రామంలో ఏర్పాటు వేసి తగిన వసతులు కల్పించాలని కోరుతూ శుక్రవార డైరెక్టర్ ఆఫ్ పబ్లిక్ హెల్త్ & ప్యామిలీ వెల్ఫేర్ కమీషనర్ ను కోరుతూ శుక్రవారం హైదరాబాద్ లోని వారి కార్యాలయంలో మర్రిగూడ మాజీ ఎంపీపీ బిఆర్ఎస్ రాష్ట్ర నాయకులు అనంత రాజు గౌడ్ కలిసి వినతి పత్రాన్ని అందజేశారు.

## లీగల్ ఎయిడ్ క్లినిక్ ద్వారా అవగాహన సదస్సు ఏర్పాటు

**- హాజరైన లీగల్ సెల్ సభ్యులు బత్తుల గణేష్**



**రామన్నపేట వెలుతురు న్యూస్ సెప్టెంబర్ 19**
మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ బాలికల ఉన్నత పాఠశాల నందు జిల్లా న్యాయ సేవాధికార సంస్థ ఆదేశాలనుసారం, పాఠశాల ప్రధానోపాధ్యాయులు కం మండల విద్యాధికారి గవ్వ జ్యోతి సమక్షంలో మండల న్యాయ సేవా అధికార సంస్థ రామన్నపేట అధ్వర్యంలో లీగల్ టీమ్ సభ్యులు బత్తుల గణేష్ పాఠశాలలో లీగల్ ఎయిడ్ క్లినిక్ ఏర్పాటు చేసి, విద్యార్థులకి అవగాహన కల్పించారు. విద్యార్ధులు దసరా సెలవుల సందర్భంగా ఇంటికి వెళ్ళిన క్రమంలో పలు జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. విద్యార్ధులు చదువు తో పాటు చట్టాలపై అవగాహన ఉండాలని, బయట సమాజంలో బాలికల పట్ల ఎన్నో రకాల అగత్యాలు జరుగుతున్న తరుణంలో ప్రతి ఒక్కరూ సామాజిక బాధ్యత, అవగాహన ముఖ్యం అని అన్నారు. విద్య హక్కు చట్టం, పోక్సో చట్టం, మాదక ద్రవ్యాలు, చెడు వ్యసనాలు, బాల కార్మికుల చట్టాలు, బాల్య వివాహాలు, తదితర అంశాలపై అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో అధ్యాపక బృందం, విద్యార్ధులు పాల్గొన్నారు.

## సిఎం రిలీఫ్ ఫండ్ నిరుపేదలకు భరోసా

- ఎమ్మెల్సీ నెల్లికంటి సత్యం.



**మునుగోడు, సెప్టెంబర్ 19 (వెలుతురు):**
సి ఎం రిలీఫ్ ఫండ్ నిరుపేద కుటుంబాలకు ఎంతో భరోసానిస్తుందని ఎమ్మెల్సీ నెల్లికంటి సత్యం అన్నారు. శుక్రవారం మండల కేంద్రంలోని సిపిఐ కార్యాలయంలో నారాయణపురం, చిట్యాల,మునుగోడు మండలాలకు మంజూరైన సి ఎం రిలీఫ్ ఫండ్ చెక్కులను లబ్ధిదారులకు అందజేశారు.ఈ సందర్భంగా ఎమ్మెల్సీ నెల్లికంటి సత్యం మాట్లాడుతూ సి ఎం రిలీఫ్ ఫండ్ తో పాటు రాష్ట్ర ప్రభుత్వం విద్య వైద్య రంగానికి పెద్దపీట వేయాలని కోరారు.సి ఎం సహాయ నిధి నుండి ఇచ్చే సహకారాన్ని పెంచాలని కోరారు.ఈ కార్యక్రమంలో ప్రజానాట్యమండలి రాష్ట్ర అధ్యక్షులు కురు మిద్దె శ్రీనివాస్,సిపిఐ జిల్లా కార్యవర్గ సభ్యులు గురుజ రామచంద్రం,బొలుగూరి నరసింహ,తీర్పారి వెంకటేశ్వర్లు,యాదాద్రి భువనగిరి జిల్లా సిపిఐ జిల్లా కార్యవర్గ సభ్యులు బచ్చనగొని గాలయ్య, సిపిఐ జిల్లా సమితి సభ్యులు బి.లాలు , సురిగి చలపతి,సిపిఐ మండల కార్యదర్శి చాపల శ్రీను,మాజీ జెడ్పిటిసి గోస్కొండ లింగయ్య,సుకంటి శ్రీనివాస్ రెడ్డి,ఈదులకంటి కైలాస్, వనం వెంకన్న,పొట్ట శంకర్,కట్కూరి లింగస్వామి తదితరులు పాల్గొన్నారు.

## అధిక దిగుబడినిచ్చే రాశి స్విఫ్ట్ పత్తి విత్తనం మెగా ఫీల్డ్ డే

- రీజనల్ మేనేజర్ ప్రదీప్ కుమార్.

**చింతపల్లి, సెప్టెంబర్ 19 (వెలుతురు):**



నల్గొండ జిల్లా చింతపల్లి మండలం గొల్లపల్లి గ్రామంలో రైతు సేవ్యా నాయక్ పత్తి చేనులో రాశి సీడ్స్ ప్రైవేటు లిమిటెడ్ వారు క్షేత్ర ప్రదర్శన నిర్వహించారు. ఈ కార్యక్రమంలో రీజినల్ బిజినెస్ మేనేజర్ ప్రదీప్ కుమార్,టెర్రిటరీ సేల్స్ మేనేజర్ రోహిత్ లు మాట్లాడుతూ రాసి స్విఫ్ట్ అనే హైబ్రిడ్ పత్తి తొందరగా కాపుకు వచ్చే రకమని,ప్రతికూల వాతావరణం లో రసం పీల్చె పురుగులను సమర్ధవంతంగా తట్టుకొని ఎక్కువ కాయలను నిలుపుకునే సామర్థ్యం కలిగి,రైతులకు అత్యధిక దిగుబడిని ఇచ్చే రకమని రైతులకు వివరించారు.ఈ కార్యక్రమంలో చుట్టుపక్కల గ్రామాల నుంచి 400 మంది పత్తి రైతులు,డీలర్లు, కంపెనీ డిస్ట్రిబ్యూటర్లు పూల యాదయ్య, శ్రీకాంత్, వెంకటయ్య,కంపెనీ సిబ్బంది రమేష్ ,భూపాల్ ,శ్యామ్ ,రాజు,మనోహర్ లు పాల్గొని ఈ కార్యక్రమాన్ని విజయవంతం చేశారు.

## బిజెపి చౌటుప్పల్ మున్సిపల్ శాఖ మహిళా మోర్చా ఆధ్వర్యంలో చిత్రలేఖనం పోటీలు...





**చౌటుప్పల్ వెలుతురు సెప్టెంబర్ 19:**
భారతీయ జనతా పార్టీ చౌటుప్పల్ మున్సిపల్ శాఖ, మహిళా మోర్చా ఆధ్వర్యంలో భారత ప్రధాని గౌరవనీయ నరేంద్ర మోడీ 75వ జన్మదినం పురస్కరించుకొని సేవా పక్వాడ్ ప్రోగ్రాంలో భాగంగా , చౌటుప్పల మున్సిపాలిటీ తంగడపల్లి జిల్లా ప్రజా పరిషత్ ఉన్నత పాఠశాలలో విద్యార్థులతో చిత్రలేఖనం పోటీలు నిర్వహించారు. భారత ప్రధాని నరేంద్ర మోడీ భారతదేశాన్ని అత్యున్నత స్థాయికి తీసుకెళ్తున్న సందర్భంగా గౌరవ ప్రధాని అభినందనలు తెలుపుతూ చౌటుప్పల్ మున్సిపల్ నాయకులు కార్యకర్తలు ఈ యొక్క ప్రోగ్రామ్ నిర్వహించడం జరిగింది. విద్యార్థులతోటి ఆత్మనిర్బార్ భారత్ వికసిత్ భారత్ చిత్రాలను ప్రధానోపాధ్యాయులు గారి చొరవతో ఈ యొక్క కార్యక్రమం నిర్వహించడం జరిగింది యొక్క కార్యక్రమంలో పట్టణ అధ్యక్షురాలు కడారి కల్పనా యాదవ్ మునుగోడు అసెంబ్లీ కన్వీనర్ దూడల బిక్షం గౌడ్ జిల్లా మాజీ ఉపాధ్యక్షులు రమణ గోని శంకరయ్య సేవా పక్వాడ్ కన్వీనర్ ఆలె చిరంజీవి హై స్కూల్ ప్రధానోపాధ్యాయులు మరియు అధ్యాపకులు లింగోజిగూడెం మాజీ సర్పంచ్ రమణ గోని





దీపిక పట్టణ మహిళా మోర్చా అధ్యక్షురాలు ఉడుగు విజయలక్ష్మి మున్సిపల్ నాయకులు ముత్యాల భూపాల్ రెడ్డి ఉడుగు వెంకటేశం గౌడ్ బత్తుల జంగయ్య గౌడ్ బత్తుల జనార్ధన్ గౌడ్ చికూరి ప్రభాకర్ కడారి ఐలయ్య బీజేవైఎం నాయకులు దిండు భాస్కర్ నాయకులు ఎల్లంకి పాండు వరగంటి భాను ప్రకాష్ ప్రధాన కార్యదర్శి తోకల సాయికుమార్ మున్సిపల్ ఉపాధ్యక్షులు గుండెబోయిన వేణు ఉడుగు శ్రీశైలం పట్టణ కార్యదర్శి పర్నే గాయత్రి రెడ్డి జె.కృష్ణవేణి బి.మమత బి . విజయలక్ష్మి అశ్విని దుర్గయ్య ముత్యాలు విగ్నేష్ తదితరులు పాల్గొన్నారు

## సీఎం సహాయ నిధి.. పేదల ఆరోగ్యానికి తోడ్పాటు...

**లబ్ధిదారులకు రూ. 5,79,500/- విలువ గల చెక్కులు పంపిణీ చేసిన కాట శ్రీనివాస్ గౌడ్**





**పటాన్‌చెరు వెలుతురు సెప్టెంబర్ 19:**
పేదల ఆరోగ్య సమస్యల పరిష్కారంలో ముఖ్యమంత్రి సహాయ నిధి నిజమైన సంజీవనిగా మారిందని పటాన్‌చెరు నియోజకవర్గం కాంగ్రెస్ పార్టీ ఇంచార్జి కాట శ్రీనివాస్ గౌడ్ అన్నారు. శుక్రవారం ఉదయం ఆయన నివాసంలో 11 మంది లబ్ధిదారులకు రూ. 5,79,500/- విలువైన సీఎంఆర్ఎఫ్ చెక్కులను అందజేశారు. ఈ సందర్భంగా కాట శ్రీనివాస్ గౌడ్ గారు మాట్లాడుతూ – "ప్రజల ఆరోగ్యం కాపాడటం, పేదలకు ఆర్థిక భరోసా కల్పించడం ప్రభుత్వ ప్రధాన లక్ష్యమన్నారు. అనారోగ్యంతో బాధపడుతున్న పేద కుటుంబాలకు సీఎం సహాయనిధి నిజమైన వరప్రసాదం, ఇప్పటి వరకు వందలాది కుటుంబాలు ఈ పథకం ద్వారా లబ్ధి పొందాయన్నారు. ప్రతి అర్హుడికి సహాయం అందేలా నిరంతరం కృషి చేస్తాను" అని పేర్కొన్నారు. చెక్కులు అందుకున్న లబ్ధిదారులు ఆనందం వ్యక్తం చేస్తూ "ఈ ఆర్థిక సహాయం మా కుటుంబానికి పెద్ద ఊరటను ఇచ్చిందని, చికిత్స ఖర్చుల భారాన్ని తగ్గించినందుకు శ్రీనన్న గారికి, రాష్ట్ర ప్రభుత్వానికి కృతజ్ఞతలు" తెలిపారు.

## మహిళలు, చిన్నారుల ఆరోగ్య సంరక్షణ కోసమే అంగన్వాడీ కేంద్రాలు...

**- అడిషనల్ కలెక్టర్ డా. అశ్విని తానాజీ వాకడే**






**కరీంనగర్ వెలుతురు సెప్టెంబర్ 19:**
మహిళలు , చిన్నారుల ఆరోగ్య సంరక్షణ కోసం కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు అంగన్వాడీ కేంద్రాలను నిర్వహిస్తున్నాయని అడిషనల్ కలెక్టర్ డా. అశ్విని తానాజీ వాకడే అన్నారు. కరీంనగర్లోని 48వ డివిజన్ అంగన్వాడీ కేంద్రంలో శుక్రవారం సభ కార్యక్రమం జరిగింది. ఇట్టి కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా హాజరైన ఆమె మాట్లాడుతూ గర్భిణీలు, బాలింతలు, పిల్లల ఎదుగుదల కోసం అంగన్వాడీ కేంద్రాల ద్వారా పౌష్టికాహారం అందించడం జరుగుతుందని తెలిపారు. మహిళలు పరిపూర్ణ ఆరోగ్యంతో ఉండాలని, పిల్లల మానసిక వికాసాహానికి దోహదపడే ప్రోగ్రాములు చేపట్టాలన్నారు.ఈ కార్యక్రమంలో తాజా మాజీ కార్పొరేటర్ డీ.అనూప్ కుమార్, సిపిఓ అధికారిని ,వరి సిబ్బంది, పట్టణ ప్రాథమిక ఆరోగ్య కేంద్రం డాక్టర్ ప్రణవ్, మెప్మ సీఈఓ స్వప్న, ఆర్.పిలు రమాదేవి, ఉమాదేవి, వనిత, ఏఎన్ఎం పులమ్మ అంగన్వాడీ టీచర్ వనజ, పిల్ల తల్లులు పాల్గొన్నారు.

## ఇండ్ల నిర్మాణాలను పూర్తి చేయాలి

**- ఆదిలాబాద్ ఎమ్మెల్యే పాయల్ శంకర్**



**మావల వెలుతురు సెప్టెంబర్ 19:**
నిరుపేదలకు ప్రధానమంత్రి జన్మన్ యోజన పథకం కింద మంజూరైన ఇళ్ల నిర్మాణ పనులను అధికారులు నిర్లక్ష్యం చేయకుండా చేపట్టాలని ఆదిలాబాద్ ఎమ్మెల్యే పాయల్ శంకర్ అన్నారు. మావల మండలంలోని దుబ్బగూడ కాలనీలో శుక్రవారం ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణ భూమి పూజ కార్యక్రమంలో పాల్గొన్నారు, ఈ సందర్భంగా లబ్ధిదారులతో



కలిసి ఎమ్మెల్యే ఇంటి నిర్మాణ పనులకు భూమి పూజ చేసి, పనులను ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ సొంతిల్లు లేక ఇబ్బంది పడుతున్న ప్రజల సొంతింటి కలను సహకారం చేసేందుకు కేంద్ర, ప్రభుత్వం రాష్ట్ర ప్రభుత్వాలు సంయుక్తంగా ఇళ్ల నిర్మాణ కార్యక్రమాన్ని చేపట్టినని అన్నారు. నిరుపేదలందరికీ ఇంటి నిర్మాణం చేపట్టేలా చర్యలు తీసుకోవాలని రాష్ట్ర ప్రభుత్వాన్ని కోరారు. ఈ కార్యక్రమంలో బీజేపీ నాయకులు రఘుపతి. రవి రెడ్డి. దశరథ్. గంగారెడ్డి. నిఖిల్ ఆకుల ప్రవీణ్ . ముకుందరావు. నాందేవ్ తదితరులు పాల్గొన్నారు



## ఖేడ్ మున్సిపాలిటీ బిజెపి ఆధ్వర్యంలో స్వచ్ఛభారత్ కార్యక్రమం

**వెలుతురు నారాయణఖేడ్ సెప్టెంబర్ 19**
భారత ప్రధాని నరేంద్ర మోడీ గారి పిలుపుమేరకు నేడు నారాయణఖేడ్ పట్టణంలోని దుర్గాభవాని మందిరం మంగళపేట వద్ద భాజపా నాయకులు స్వచ్ఛభారత్ కార్యక్రమం నిర్వహించడం జరిగింది ఇట్టి కార్యక్రమంలో నారాయణఖేడ్ మున్సిపాలిటీ బీజేపీ అధ్యక్షులు శ్రీ రాజశేఖర్ గౌడ్, బీజేవైఎం అసెంబ్లీ కన్వీనర్ పట్నం మాణిక్, సాయందర్, వెంకటరెడ్డి, మేకల జ్ఞానేశ్వర్, సగుణాకర్, ఏక్ నాథ్, లోకేష్ తదితరులు పాల్గొనడం జరిగింది.ం

## బిజెపి మహిళా మోర్చా ఆధ్వర్యంలో చిత్రలేఖనం




**వెలుతురు నారాయణఖేడ్ సెప్టెంబర్ 19 :**
భారత ప్రధాని నరేంద్ర మోడీ పిలుపు మేరకు నారాయణఖేడ్ మున్సిపాలిటీ మహిళా మోర్చా అధ్యక్షురాలు శ్రీమతి శ్రీ పట్నం లలితా మానిక్ ఆధ్వర్యంలో శ్రీ సరస్వతీ శిశు మందిరం నందు చిత్రలేఖనం పోటీ నిర్వహించి బహుమతుల ప్రధానం చేయడం జరిగింది. ఈ కార్యక్రమంలో నారాయణఖేడ్ మున్సిపాలటీ ప్రెసిడెంట్ రాజశేఖర్ గౌడ్, బీజేవైఎం అసెంబ్లీ కన్వీనర్ పట్నం మాణిక్, టౌన్ ప్రధాన కార్యదర్శి వడ్ల సాయందర్, కార్యక్రమ కో కన్వీనర్ మేకల జ్ఞానేశ్వర్, మడపతి లోకేష్, శ్రీధర్, సుగుణాకర్, ఏకనాథ్ తదితరులు పాల్గొనడం జరిగింది.

## పాలేరు నుండి పద్మభూషణ్ అయిన బోయి భీమన్న



**కరీంనగర్ వెలుతురు సెప్టెంబర్ 19:**
సాహితీ క్షేత్రంలో తనదైన ముద్ర వేసుకున్న గొప్ప కవి పద్మభూషణ్ డా. బోయి భీమన్న అని తెలుగు శాఖ అధ్యక్షులు డా. బూర్ల చంద్రశేఖర్ పేర్కొన్నారు. శ్రీ రాజరాజేశ్వర ప్రభుత్వ ఆర్ట్స్ & సైన్స్ కళాశాల కరీంనగర్ లో డా. బోయి భీమన్న జయంతి వేడుకలు తెలుగు శాఖ ఆధ్వర్యంలో నిర్వహించారు. పలువురు అధ్యాపకులు వారు చేసిన సాహితీ కృషిని కొనియాడారు. సాహిత్యం ద్వారా సామాజిక అంతరాలను, వివక్షలను ప్రశ్నించిన కవి బోయి భీమన్న అని అన్నారు. ఆయన రచనలు దళిత సాహిత్యానికి పాదులువేశాయని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో బూర్ల వేంకటేశ్వర్లు, డా.రాపర్తి శ్రీనివాస్, మెట్టు వేంకటేశ్వర్లు, డా. డి. ప్రకాశ్, మాలతీ దేవి, డా. పాత అశోక్, డా. పుప్పాల చైతన్య, డా.టి. భోజన్న, పొరండ్ల శంకర్ మరియు విద్యార్థులు పాల్గొన్నారు.

# ప్లాస్టిక్ నుంచి పర్యావరణాన్ని పరిరక్షించుకోవాలి

**ఎంపీపీఎస్ ఆత్మకూర్ పాఠశాలలో పర్యావరణం పై విద్యార్థులకు అవగాహన సదస్సు**

**లయన్స్ క్లబ్ ఆత్మకూర్ శాఖ అధ్యక్షులు ఏరుకొండ రవీందర్ గౌడ్**





**ఆత్మకూర్ వెలుతురు సెప్టెంబర్ 19:**
ప్లాస్టిక్ నుంచి పర్యావరణాన్ని పరిరక్షించుకోవాల్సిన అవసరం ఎంతైనా ఉందని లయన్స్ క్లబ్ ఆత్మకూర్ శాఖ అధ్యక్షులు ఏరుకొండ రవీందర్ గౌడ్ అన్నారు. శుక్రవారం ఎంపీపీఎస్ ఆత్మకూర్ బ గొల్లవాడ పాఠశాలలో ప్లాస్టిక్ ను వాడడం వల్ల కలిగే అనర్థాల గురించి విద్యార్థులకు లయన్స్ క్లబ్ ఆత్మకూర్ శాఖ ఆధ్వర్యంలో "పర్యావరణం పరిరక్షణ ,అందరి బాధ్యత" అనే అంశంపై అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా రవీందర్ గౌడ్ మాట్లాడుతూ నిత్యజీవితంలో ప్లాస్టిక్ వాడడం వల్ల మనుషులు, జంతువులు రోగాల బారిన పడుతున్నారని, ప్లాస్టిక్ వల్ల నీరు కూడా కలుషితం అవుతుందని దానివల్ల రోగాలు తొందరగా వ్యాపిస్తాయని అన్నారు. ప్లాస్టిక్ వాడకాన్ని తగ్గించి కాగితం సంచులు, జనపనారతో చేసిన సంచులు వాడాలని ఆయన అన్నారు. ఈ సందర్భంగా ఉపాధ్యాయులకు చేతి సంచులు పంపిణీ చేశారు. అనంతరం హనుమకొండ జిల్లా లయన్స్ క్లబ్ గవర్నర్ చంద్రశేఖర్ ఆర్య జన్మదినాన్ని పురస్కరించుకొని విద్యార్థులకు రసాయనాలు వాడని పండ్లు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమానికి పాఠశాల ప్రధానోపాధ్యాయులు పెండెం రాజు అధ్యక్షత వహించారు. ఈ కార్యక్రమంలో లయన్స్ క్లబ్ చార్టర్ ప్రెసిడెంట్ టింగిల్ కార్ సత్యనారాయణ ,లయన్స్ క్లబ్ ప్రధాన కార్యదర్శి నాగ బండి శివప్రసాద్, ఉపాధ్యక్షులు పాపాని రవీందర్ , లయన్స్ క్లబ్ మాజీ అధ్యక్షులు రేవూరి దేవేందర్ రెడ్డి ,కోశాధికారి బాదం వెంకటేశ్వర్లు తదితరులు పాల్గొన్నారు,

## ఘనంగా వంశపారంపర్య ధర్మకర్త జన్మదిన వేడుకలు



**యాదగిరిగుట్ట వెలుతురు సెప్టెంబర్ 19:**
యాదగిరిగుట్ట శ్రీ లక్ష్మీనరసింహస్వామి వారి దేవస్థానం వంశపారంపర్య ధర్మకర్త భాస్కరరాయణి నరసింహమూర్తి జన్మదిన వేడుకలు శుక్రవారం ఘనంగా నిర్వహించారు ఈ సందర్భంగా ఆయనను యాదగిరిగుట్ట దేవస్థానం వర్తక సంఘం ఆధ్వర్యంలో ఘనంగా పూలమాలలు శాలువాలతో సత్కరించి శుభాకాంక్షలు తెలియజేశారు యాదగిరిగుట్ట దేవస్థానం వంశపారంపర్య ధర్మకర్తగా దేవస్థానంలో ప్రతి కార్యక్రమం విజయవంతంగా కొనసాగేలా ఆయన చేసే కృషి ఎనలేనిది స్వామివారి నిత్య కైంకర్యాలు ఎప్పటికప్పుడు శాస్త్రోక్తంగా సజావుగా జరిగేలా వారు పటిష్టమైన చర్యలు తీసుకుంటారు అదేవిధంగా కొండపైన అటు భక్తులకు ఇటు ఉద్యోగులకు వ్యాపారులకు ఎప్పటికప్పుడు అందుబాటులో ఉంటూ వారి సమస్యలను పరిష్కరిస్తూ వారి సంక్షేమానికి నిరంతరం కృషి చేస్తుంటారు ఆయన అందరికీ అన్ని రకాలుగా అందుబాటులో ఉంటూ సేవలందిస్తూ ఉండడం తో అన్ని వర్గాల వారు ఆయన సేవలపట్ల ఆనందం వ్యక్తం చేస్తున్నారు దీంతో ఉద్యోగులు స్థానికులు వ్యాపారులు ఆయనను ఆయన జన్మదినోత్సవం సందర్భంగా శుభాకాంక్షలు తెలియజేస్తూ పెద్ద ఎత్తున సత్కరించారు ఈ కార్యక్రమంలో దేవస్థానం వర్తక సంఘం ప్రతినిధులు తడక వెంకటేష్ నరసింహారావు కొన్ని రమేష్ బెజగం శివకుమార్, కైరం కొండ నవీన్ కుమార్ తదితరులు పాల్గొన్నారు

# 26న అంబర్పేట బతుకమ్మ కుంట సీఎం రేవంత్ రెడ్డి ఓపెనింగ్

### బతుకమ్మ కుంటకు వి హనుమంతరావు పేరు పెట్టాలి

### ఖైరతాబాద్ జిల్లా మహిళా కాంగ్రెస్ అధ్యక్షురాలు శంభుల ఉషశ్రీ శ్రీకాంత్ గౌడ్.

**ఖైరతాబాద్ , వెలుతురు సెప్టెంబర్ 19:**
కంటెస్టెడ్ కార్పొరేటర్ శంభుల ఉషశ్రీ శ్రీకాంత్ గౌడ్ ఆధ్వర్యంలో బాగ్ అంబర్పేట్ డివిజన్లో బతుకమ్మ కుంట ప్రారంభోత్సవం సందర్భంగా, శ్రీ వి హనుమంతరావు కాంగ్రెస్ సీనియర్ నాయకులు మరియు మహిళలతో కలిసి కలిసి ఇంటింటికి వెళ్లి కరపత్రాలను ఇవ్వడం జరిగింది. ప్రజలలో మంచి స్పందన లభించిది పలు బస్తీలలో మహిళలు ప్రజలు బతుకమ్మ కుంట పునర్నిర్మించినందుకు హనుమంతరావు కు శుభాకాంక్షలు తెలియజేశారు ఈ నెల 26వ తేదీన ముఖ్యమంత్రి ఎనుముల రేవంత్ రెడ్డి చేతుల మీదుగా బతుకమ్మ కుంట ప్రారంభోత్సవం జరుగుతుందని, మాజీ రాజ్యసభ సభ్యుడు వి హనుమంతరావు తెలిపారు. శుక్రవారం బాగ్ అంబర్ పేట్ డివిజన్లో , బతుకమ్మ కుంటలో బతుకమ్మ ఆడాలని ఇంటింటికి వెళ్లి ఆడపడుచులను కలిసి కరపత్రాన్ని అందజేశారు. ఈ సందర్భంగా వి హనుమంతరావు మాట్లాడుతూ గత 35 సంవత్సరాలుగా బి ఆర్ఎస్ నాయకుల కబ్జాలో ఉన్న బతుకమ్మ కుంటను ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి , హైడ్రా కమిషనర్ రంగనాథ్ గారి సహకారంతో తిరిగి దక్కించుకున్నామని . బతుకమ్మ కుంటలో బతుకమ్మ ఆడే విధంగా ఏర్పాట్లు అన్ని చేస్తున్నామని ఈనెల 26 వ తేదీన తెలంగాణ రాష్ట్ర



ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి బతుకమ్మ కుంట ను ప్రారంభోత్సవం చేస్తారని. ఈ కార్యక్రమంలో అధిక సంఖ్యలో మహిళలు పాల్గొని బతుకమ్మలు ఆడాలని ఆయన కోరారు. ఈ సందర్భంగా ఖైరతాబాద్ జిల్లా మహిళ కాంగ్రెస్ అధ్యక్షురాలు శంభుల ఉష శ్రీ శ్రీకాంత్ గౌడ్ మాట్లాడుతూ గత 35 సంవత్సరాలుగా మాజీ రాజ్యసభ సభ్యులు వి హనుమంతరావు పోరాటం ఫలితం ఈరోజు దక్కిందని అన్నారు.రేవంత్ రెడ్డి గారు, హైడ్రా కమిషనర్ రంగనాథ్ గారు, రోహిన్ రెడ్డి గారి సహకారంతో తిరిగి బతుకమ్మ కుంటను సొంతం చేసుకున్నామని వారు సంతోషం వ్యక్తం చేశారు. మహిళలంతా 26వ తేదీన జరగబోయే బతుకమ్మ కుంట ప్రారంభోత్సవానికి , పార్టీలకతీతంగా మహిళలు అందరూ అధిక సంఖ్యలో పాల్గొని ఈ కార్యక్రమాన్ని జయప్రదం చేయవలసిందిగా ఆమె కోరారు. ఈ సందర్భంగా ముఖ్యమంత్రివర్యులు రేవంత్ రెడ్డి గారికి ,హైడ్రా కమిషనర్ రంగనాథన్ గారికి, మాజీ రాజ్యసభ సభ్యులువి హనుమంతరావు గారికి, ఖైరతాబాద్ డిసిసి మరియు అంబర్పేట్ నియోజకవర్గం ఇంచార్జ్ రోహిన్ రెడ్డి గారికి మాజీ ఫ్లోర్ లీడర్ పుల్లా నారాయణ స్వామి గారికి ప్రత్యేక ధన్యవాదాలు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో సీనియర్ నాయకులుఆర్ లక్ష్మణ్ యాదవ్ మాజీ కార్పొరేటర్ పుల్లా నారాయణస్వామి పులి జగన్ గడ్డం లక్ష్మణగౌడ్ పీసీసీ కార్యదర్శి శంభుల శ్రీకాంత్ గౌడ్ ఖైరతాబాద్ జిల్లా అధ్యక్షురాలు శంబుల ఉషశ్రీ శ్రీకాంత్ గౌడ్ రామ్మోహన్ రావు పంజాల వెంకటేష్ గౌడ్ బ్లాక్ అధ్యక్షులు కుంకుమ రాజేశ్వరరావు డివిజన్ అధ్యక్షులు గడ్డం శ్రీధర్ గౌడ్ కోటం అనిల్ రావుల సుధాకర్ ఈ ప్రభాకర్ సి సుధాకర్ మహేష్ కుమార్ గౌడ్ కృష్ణా గౌడ్ సందప్ గౌడ్ ప్రకాష్ కొట్ల కిరణ శ్రీనివాస్ రెడ్డి బాను యాదవ్ మహిళా సీనియర్ నాయకులు శ్రీమతిసునీత రెడ్డి లావణ్య పద్మ శాంతమ్మ ఫాతమ కవిత తదితరులు పాల్గొన్నారు

# విజ్ఞానమే సర్వస్వం, గురువులే దానికి సారధులు

**సూర్యాపేట వెలుతురు సెప్టెంబర్ 19:**
సూర్యాపేట జిల్లా కేంద్రం సూర్యాపేట మండలంలో 56 మందికి ఉత్తమ ఉపాధ్యాయుల సన్మాన కార్యక్రమం మహోత్సవం పద్మావతి గార్డెన్ ఫంక్షన్ హాల్ నందు ఘనంగా నిర్వహించడం జరిగింది. ఈ కార్యక్రమానికి సూర్యాపేట మండల విద్యాశాఖ అధికారి శేషగాని శ్రీనివాస గౌడ్ గారు అధ్యక్షత వహించారు విశిష్ట అతిథిగా మండల పరిషత్ అభివృద్ధి అధికారి గోషిక బాలకృష్ణ ముఖ్య అతిథులుగా మరియు సూర్యాపేట జిల్లా విద్యాశాఖ సెక్టోరియల్ సెక్టోరియల్ అధికారులు కందిబండ శ్రవణ్





టీయూటీఎఫ్ జిల్లా ప్రధాన కార్యదర్శి కస్తూరి కిషన్ ప్రసాద్ సన్మానం.

కుమార్ ,యర్రంశెట్టి రాంబాబు అనుములపురి శీనయ్య మరియు స్కూల్ కాంప్లెక్స్ ప్రధానోపాధ్యాయులు దేవరశెట్టి జనార్ధన్,జల్లా ప్రసాద్,గోలి పద్మ,దైద పాపయ్య,విష్ణుదాస్యం యతిపతి రావు,జేగటి యాకయ్య గార్లు పాల్గొన్నారు. ఉపాధ్యాయులు విద్యార్థుల భవిష్యత్తును తీర్చిదిద్దడంలో కీలక పాత్ర పోషిస్తున్నారని, వారి సేవలు అమూల్యమని అతిథులు అభిప్రాయపడ్డారు. పిల్లలకు విలువలతో కూడిన విద్యను అందించడం ద్వారా సమాజ నిర్మాణంలో ఉపాధ్యాయులు విశేష కృషి చేస్తున్నారని ప్రశంసించారు. ఉపాధ్యాయ సంఘాల నాయకులు దామెర శ్రీనివాస్, కస్తూరి కిషన్ ప్రసాద్,బాతిరెడ్డి ఆడం,కందుకూరి సోమశేఖర్,వల్లెం శంకర్ ప్రసాద్,యామా రమేశ్,రాచూరి ప్రతాప్,బాలె ఆనంద్, చిత్తలూరి యాదగిరి,పిల్లలమర్రి ఉపేందర్,కటకంనర్సింహ స్వామి తదితరులు ఈ కార్యక్రమంలో పాల్గొని, సన్మానిత ఉపాధ్యాయులను అభినందించారు.సన్మానిత ఉపాధ్యాయులు తమ అనుభవాలను పంచుకుంటూ, భవిష్యత్తులో మరింత నిబద్ధతతో పనిచేస్తామని హామీ ఇచ్చారు.ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు, కుటుంబ సభ్యులు, సంఘ ప్రతినిధులు, విద్యార్థులు పెద్ద సంఖ్యలో పాల్గొని, కార్యక్రమాన్ని విజయవంతం చేశారు.

# ఎకో టూరిజం హబ్ దిశగా తెలంగాణ

రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన లక్ష్యమని ఆమె వ్యాఖ్యానించారు. తెలంగాణ టూరిజం పాలసీలో అంశాలను మనం ఎంత వరకు ఉపయోగించి... ఎకో టూరిజాన్ని మన రాష్ట్రంలో డెవలప్ చేయొచ్చన్న విషయాలను మంత్రి ప్రత్యేకంగా అడిగి తెలుసుకున్నారు. శుక్రవారం డాక్టర్ బీఆర్ అంబేద్కర్ సచివాలయంలో ఎకోటూరిజం ప్రాజెక్టు స్క్రీనింగ్ కమిటీ సమావేశం మంత్రి అధ్యక్షతన జరిగింది. ఈ సమావేశంలో ఎఫ్డీసీ చైర్మన్ పొదెం వీరయ్య, అటవీ శాఖ ప్రిన్స్ పల్ సెక్రటరీ అహ్మద్ నదీమ్, పీసీసీఎఫ్(హెచ్ఓఎఫ్ఎఫ్) డాక్టర్ సువర్ణ, తెలంగాణ ఎఫ్డీసీ ఎండీ సునీత భగవత్, పీసీసీఎఫ్(వైల్డ్ లైఫ్), ఏలూ సింగ్ మేరు, సీసీఎఫ్ డాక్టర్ జి. రామలింగం(సోషల్ ఫారెస్టు), పలు జిల్లాల డీఎఫ్ఓలు, ఆర్థిక శాఖ సహా ఇతర శాఖల ఉన్నతాధికారులు పాల్గొన్నారు. ఈ స్క్రీనింగ్ కమిటీ భేటీలో అనంతగిరి(వికారాబాద్), కనకగిరి(ఖమ్మం), నందిపేట్(నిజామాబాద్), మన్ననూర్ జంగల్ రిసార్టు(నాగర్ కర్నూల్), ముచ్చెర్ల ఎకో పార్కు(నల్గొండ), వైజాగ్ కాలనీ(నల్గొండ), మంజీరా(సంగారెడ్డి), అమరగిరి(నాగర్ కర్నూల్) తదితర ప్రాంతాల్లో ఎకో టూరిజం ప్రాజెక్టు అమలుపై సుదర్ఘీ చర్చ జరిగింది. ఎక్కడికక్కడ ఆయా ఎకో టూరిజం సెంటర్లలో స్థానిక గిరిజనులు, ఇతర ప్రాంతాల ప్రజల ఆచార వ్యవహారాలు, సంస్కృతి, సాంప్రదాయాల ప్రకారం ఎకో టూరిజం ప్రాజెక్టులను అమలు చేయాలని సూచించారు. ఎకో టూరిజం డెవలప్ చేస్తున్న ప్రాంతాల్లో టెంపుల్స్ ఉంటే వాటిని కూడా ఆ మేరకు డెవలప్ చేయాలని సూచించారు. ఆధ్యాత్మిక పద్ధతిలో అభివృద్ధి చేయాల్సిన అవసరం ఉందన్నారు.

### నీలాద్రి అభివృద్ధి మీద ప్రత్యేక చొరవ చూపాలి


మధ్యప్రదేశ్‌లోని భీమ్‌బెక్కా కొండల తరహాలో నీలాద్రి కొండలపై ప్రాచీన కాలం నాటి గుర్తులు ఉన్నందున పర్యాటక ప్రాంతంగా ఎకో టూరిజం ప్రాంతంగా డెవలప్ చేయాలన్నారు. ఈ ప్రాంతాన్ని ఎకో టూరిజం హబ్ గా డెవలప్ చేయాల్సిన అవసరం ఉందని మంత్రి పేర్కొన్నారు. అవసరమైన నిధులు టూరిజం డిపార్టుమెంటు, ఎండోమెంటు శాఖ నుంచి తీసుకొని అయినా డెవలప్ చేయాలన్నారు. ఈ సమావేశంలో తెలంగాణలో వివిధ జిల్లాల్లో జరుగుతున్న ఎకో-టూరిజం ప్రాజెక్టుల పురోగతిని మంత్రి కొండా సురేఖ సమీక్షించారు.
వికారాబాద్ అనంతగిరి హిల్స్ మొదటి దశ పనులు పూర్తయ్యాయని, రెండో దశలో కారవాన్ క్యాంపింగ్, ఎకో కాటేజీలు ఏర్పాటు చేయాలని నిర్ణయించిన విషయాన్ని అధికారులు మంత్రి దృష్టికి తీసుకొచ్చారు. ఖమ్మంలోని కనకగిరి ప్రాజెక్టు పనులు అక్టోబర్ 2025 నుంచి ప్రారంభమవుతాయని తెలిపారు. నల్గొండ ముచ్చర్ల ఎకో పార్క్ నైట్ సఫారీ, వీఆర్ పార్క్, డైనోసార్ పార్క్ వంటివి రూపకల్పన చేసినట్టు వివరించారు. సంగారెడ్డిలోని మంజీరా వన్యప్రాణి సంరక్షణ కేంద్రంలో భూసేకరణ, భూమి కేటాయింపు సమస్యల పరిష్కారం పెండింగ్‌లో ఉందన్నారు. నిజామాబాద్ నందిపేట్ , నాగర్‌కర్నూల్ మన్ననూరు , దొమలపెంట, అమరగిరి, పాకాల సరస్సు, కిన్నెరసాని, నాగార్జునసాగర్, వనస్థలి మొదలైన ప్రాంతాల ప్రాజెక్టులపై విస్తృతమైన చర్చ జరిగింది.

### ఆలయాలున్న ప్రాంతాల్లో ఆధ్యాత్మికతతో ఎకో-టూరిజం

ఎకో-టూరిజం ప్రాజెక్టులు కేవలం ప్రకృతి వైభవం వరకే పరిమితం కాకుండా, అక్కడి ఆలయ ఆధ్యాత్మిక వాతావరణాన్ని కూడా ప్రతిబింబించేలా అభివృద్ధి చేయాలని మంత్రి కొండా సురేఖ సమావేశంలో ప్రస్తావించారు. ఎక్కడ ఆలయాలు ఉన్నాయో అక్కడి ఆధ్యాత్మికత, సంప్రదాయాలు, ధార్మిక విశ్వాసాలు ప్రతిబింబించేలా అభివృద్ధి చేయాల్సిన అవసరం ఉందన్నారు. పర్యాటకులు కేవలం స్థానిక ప్రకృతి సౌందర్యం మాత్రమే కాకుండా, ఒక విశ్వాసం, ఆధ్యాత్మిక అనుభూతితో కూడిన తృప్తితో సందర్శిస్తారని గుర్తు చేశారు.

# సమర్ధ నీటి నిర్వహణతో కరువును పారద్రోలుతాం

డయాఫ్రమ్ వాల్ పూర్తి చేస్తామని వెల్లడించారు. ఆంధ్రప్రదేశ్ అసెంబ్లీ సమావేశాలు రెండో రోజు కొనసాగుతున్నాయి. ఈ సందర్భంగా సీఎం చంద్రబాబునాయుడు ప్రాజెక్టులపై కీలక వ్యాఖ్యలు చేశారు. ఏపీ, తెలంగాణలో మెజారిటీ- ప్రాజెక్టులు తాను ప్రారంభించినవే అని వెల్లడించారు. తొలిసారి అనంతపురంలో రైతులకు పెట్టుబడి రాయితీ ఇవ్వడం ప్రారంభించామని అన్నారు. ఉపాధి లేక పాలమూరు జిల్లా నుంచి వలసలు వెళ్లేవారు అని గుర్తు చేశారు. ఫ్లోరైడ్ బాధిత నల్గొండ జిల్లాకు శ్రీశైలం జలాలు అందించామని తెలిపారు. నల్గొండకు లిఫ్ట్ ద్వారా ఎడమ కాలువ నీళ్లిచ్చామన్నారు. నదుల అనుసంధానంతో సాగుకు ఊతమని వాజ్‌పేయీకి సూచించానని తెలిపారు. అప్పుడు టాస్క్‌ఫోర్స్ వేసినా అనంతర పరిణామాలతో ముందుకు సాగలేదన్నారు. నదుల అనుసంధానం చేయాలని ప్రధాని మోదీకి సూచించానని తెలిపారు. నదుల అనుసంధానానికి కొన్ని రాష్ట్రాలు సిద్ధంగా లేవని మోదీ చెప్పారన్నారు. చొరవ చూపిన రాష్ట్రాలు ముందుకెళ్లాలని మోదీ సూచించారని తెలిపారు. సరైన సమయంలో గంగా, కావేరి అనుసంధానం చేపడతామన్నారు. నదుల అనుసంధానం బాధ్యత ఎన్డీయే ప్రభుత్వం తీసుకుంటుందన్నారు. 2020 కి పూర్తి కావాల్సిన ప్రాజెక్ట్ ను గత ప్రభుత్వం చెడ గొట్టిందన్నారు. ఇది నా పూర్వ జన్మసుకృతం.. మొత్తం 40 నదులు, 19 లక్షల వ్యవసాయ పంపుసెట్లు- ఉన్నాయి. నదులు అనుసంధానించి నీటిపారుదల ప్రాజెక్టులు పూర్తి చేయాలన్నారు. 2014-19 కాలంలో నీటిపారుదలకు రూ.68,417 కోట్లు- ఖర్చు చేశామన్నారు. వైసీపీ పాలనలో రూ.28,376 కోట్లు- మాత్రమే ఖర్చు చేశారు. ఈ ఏడాది నీటిపారుదలకు రూ.12,454 కోట్లు- ఖర్చు చేశాం. ఐదేళ్లలో నీటిపారుదలకు రూ.70 వేల కోట్లకుపైగా ఖర్చు చేస్తామన్నారు. రాష్ట్రంలో అన్ని ప్రాజెక్టుల పూర్తికి చర్యలు చేపడతామన్నారు. మేజర్, మీడియం రిజర్వాయర్లలో 94 శాతం నీళ్లు వచ్చాయన్నారు. ఏ పని చేసినా కూటమి ప్రభుత్వం ప్రాధాన్యత ఇచ్చి చేస్తుంది. మాకు నీళ్లు కావాలి అని ప్రకాశం జిల్లా వాళ్ళు చాలా సందర్భాల్లో అడిగారు. వెలిగొండ కు నీళ్లు ఇచ్చామని వైసిపి అబద్ధాలు చెప్పింది. 2059 కోట్ల ఖర్చు తో వచ్చే జులైకు ప్రకాశంలో కనిగిరి.. మార్కాపురం.. ఎర్రగొండపాలెం..కు నీళ్లు ఇచ్చే ఏర్పాటు- చేస్తామని సీఎం తెలిపారు. గత 5 సంవత్సరాల ప్రభుత్వ కాలం లో ప్రాజెక్ట్ లకు గ్రీజ్ కూడా పెట్టలేదు.. శ్రీశైలం ప్రాజెక్టు కు 204 కోట్ల తో టెండర్ల కు ఆహ్వానం.. వైసిపి పార్టీ కి సాగునీటి పై సరి అయిన విధానం లేదని సె-టైర్లు వేసిన ముఖ్యమంత్రి... అసెంబ్లీ హాలులో గత వైసీపీ ప్రభుత్వంలో సాగునీటి ప్రాజెక్టు ల పై మాజీ ముఖ్యమంత్రి తోపాటు-, మంత్రులు మాట్లాడిన వీడియోలను అసెంబ్లీలో ప్రదర్శించిన ముఖ్యమంత్రి... కష్టపడితే సాధించలేనిది ఏదీ లేదు... సంకల్పబలం గట్టిగా ఉంది కాబట్టి పులివెందులకు సైతం నీటిని ఇచ్చాం అని చెప్పారు. అధికారంలో ఉన్నప్పుడు బాధ్యతగా ప్రవర్తించడం ప్రతి ఒక్కరి బాధ్యత... రాయలసీమ లిఫ్ట్ ఇరిగేషన్ కోసం 903 కోట్ల రూపాయలు ఖర్చు చేస్తే, కప÷ు ఆ ప్రాజెక్ట్ ను నిలిపి వేసింది... ఏ పని చేసినా ఈ ప్రభుత్వం ప్రాధాన్య కార్యక్రమంగా చేస్తాము... కరువు జిల్లా గా ఉన్న ప్రకాశం జిల్లా కు వెలిగొండ ప్రాజెక్టు ద్వారా నీరు అందించేందుకు 1996 వ సంవత్సరం లో పునాది వేశాను.. 4306 కోట్ల ఖర్చు చేసాము,మరొక 2059 కోట్లు- ఖర్చు చేసి ఉంటే ప్రాజెక్ట్ పూర్తి అయ్యేది... కానీ ప్రాజెక్ట్ పూర్తి కాకుండానే గత ప్రభుత్వం హడావుడి గా ప్రారంభించింది.. ప్రకాశం పశ్చిమ ప్రాంతం సస్యశ్యామలం చేసేందుకు వచ్చే ఏడాది జులై వరకు పూర్తి చేస్తామన్నారు. కుప్పం ప్రాంతానికి నీళ్లు తరలించి జలహారతి ఇవ్వడంతో తన జన్మ సార్థకమైందన్నారు. పోలవరం నిర్మాణంలో సమస్యలు అధిగమిస్తూ వచ్చాం. గత పాలనలో ప్రాజెక్టు డయాఫ్రమ్ వాల్ కొట్టుకుపోయింది. దీనికి మళ్లీ రూ.వెయ్యి కోట్లు- ఖర్చు చేసే పరిస్థితి ఏర్పడింది. డిసెంబరు 25 నాటికి పోలవలం డయాఫ్రమ్ వాల్ పూర్తి చేస్తాం. ఉత్తరాంధ్ర సుజల స్రవంతి ద్వారా వంశధార వరకు నీళ్లు తరలించవచ్చు. రూ.960 కోట్లతో చేపట్టిన ఈ ప్రాజెక్టు పనులు 75 శాతం పూర్తయ్యాయి. అక్టోబరులోనే అనకాపల్లి వరకు ఈ జలాలు తీసుకొస్తాం. రూ.1425 కోట్లతో ఈ ప్రాజెక్టును పోలవరం కుడి కాలువతో అనుసంధానించాం. శ్రీశైలంలో నిల్వ చేసిన నీళ్లు సీమ, హంద్రీనీవా, గాలేరు-నగరికి; మల్యాల నుంచి కుప్పం ప్రాంతానికి హంద్రీనీవా జలాలు తరలించాం. పులివెందులలోని చెరువులకూ నీళ్లందించాం. హంద్రీనీవా ప్రాజెక్టుపై ఇప్పటివరకు రూ.13 వేల కోట్లు- ఖర్చు చేశాం. దీని ద్వారా 40 టీ-ఎంసీల నీళు తరలించగల్గుతున్నాం. హంద్రీనీవా మార్గంలో 6 రిజర్వాయర్లు పూర్తి చేశాం. తుంగభద్ర ప్రాజెక్టులో దెబ్బతిన్న 33 గేట్ల మరమ్మతులు చేశాం. శ్రీశైలం స్పిల్‌వే రక్షణకు రూ.204 కోట్లతో -టెండర్లు పిలిచాం. త్వరలో పూర్తిచేస్తాం. సోమశిల ప్రాజెక్టు మరమ్మతులు వచ్చే సీజన్‌కల్లా పూర్తి చేస్తాం. గత పాలనలో చిత్తూరు జిల్లాలో ప్రీ బ్యాలెన్సింగ్ రిజర్వాయర్లు చేపట్టారు. వైకాపా వర్గీయుల కోసం రూ.2,144 కోట్లతో ప్రాజెక్టు చేపట్టారు. నిబంధనలు ఉల్లంఘించడంతో ఎన్‌జీటీ-సుప్రీం కోర్టుకు వెళ్లింది. పనులు నిలిపివేయించిన కోర్టు.. రూ.100 కోట్లు- ఫైన్ వేసి, రూ.25 కోట్లు- కట్టాలని చెప్పింది. వైకాపా నేతలు చేసిన తప్పులకు ప్రభుత్వం రూ.25 కోట్లు- జరిమానా కట్టింది' అని సీఎం చంద్రబాబు పేర్కొన్నారు.




# మట్టి మనిషి.. విలక్షణ నాయకుడు..!

## టీపీసీసీ అధ్యక్షుడు

## బొమ్మ మహేష్ కుమార్ గౌడ్

### 38 ఏళ్ల ప్రజా పోరాట యాత్ర

తెలంగాణ రాజకీయాల్లో బొమ్మ మహేష్ కుమార్ గౌడ్ ఒక ప్రత్యేక నాయకుడిగా నిలిచారు. 1966లో నిజాంబాబాద్ జిల్లా, భీమ్గల్ మండలం, రహమత్‌నగర్ గ్రామంలో ఒక సాధారణ కుటుంబంలో జన్మించిన మహేష్ కుమార్ గౌడ్ బాల్యం కష్టాల మధ్య సాగినా, ప్రజల కోసం ఏదో ఒకటి చేయాలనే సంకల్పం అప్పటికే ఆయన మనసులో పుట్టింది. ఆ సంకల్పమే ఆయనను విద్యార్థి ఉద్యమాల వైపు నడిపింది. చిన్న వయసులోనే సామాజిక సమస్యలపై స్పందిస్తూ, సహచర విద్యార్థుల హక్కుల కోసం పోరాడుతూ, యూత్ కాంగ్రెస్ ద్వారా రాజకీయాల్లోకి అడుగుపెట్టారు. ఎన్ ఎస్ యు ఐ కార్యకలాపాల్లో చురుకుగా పాల్గొని, విద్యార్థుల సమస్యలను పట్టుదలగా ప్రస్తావిస్తూ ముందుకు సాగిన ఆయన, కాంగ్రెస్ పార్టీతో తన సంబంధాన్ని బలపరచుకున్నారు.

ఆ తర్వాత కాలక్రమేణా పీసీసీ స్పోక్స్‌పర్సన్‌గా, జనరల్ సెక్రటరీగా, వర్కింగ్ ప్రెసిడెంట్‌గా, ఎమ్మెల్సీగా పనిచేసి, 2021లో తెలంగాణ ప్రదేశ్ కాంగ్రెస్ కమిటీ అధ్యక్షుడిగా బాధ్యతలు స్వీకరించడం ఆయన దీర్ఘ ప్రయాణానికి ఒక మైలురాయి. సాధారణ కార్యకర్తగా మొదలై, అత్యున్నత పదవికి చేరడం ఆయన కష్టపడి పనిచేసిన ధైర్యానికి, ప్రజల నమ్మకానికి నిదర్శనం.

మహేష్ కుమార్ గౌడ్ వర్కింగ్ ప్రెసిడెంట్‌గా పనిచేసిన కాలం కాంగ్రెస్ పునరుద్ధరణకు ఒక కీలక దశగా నిలిచింది. ఆయన గ్రామీణ స్థాయిలో బూత్ కమిటీల నిర్మాణంపై ప్రత్యేక దృష్టి పెట్టారు. మహిళా కాంగ్రెస్, యువజన కాంగ్రెస్, బలహీన వర్గాల శక్తిని సమీకరించడంలో ఆయన తీసుకున్న చర్యలు పార్టీకి కొత్త ఊపు తెచ్చాయి. పాత తరపు నేతృత్వం పక్కన కొత్త తరాన్ని ప్రోత్సహించి, కేవలం నాయకత్వ స్థాయిలోనే కాకుండా కార్యకర్తల స్థాయిలోనూ పార్టీ పునర్నిర్మాణం జరగాలని ఆయన కృషి చేశారు.

ఆయన జీవితంలో మరో ప్రత్యేక ఘట్టం రాహుల్ గాంధీ చేపట్టిన భారత్ జోడో యాత్రలో ఆయన పోషించిన పాత్ర. ఆ యాత్రలో మహేష్ కుమార్ గౌడ్ అడుగడుగునా రాహుల్ గాంధీ తో కలిసి నడుస్తూ, తెలంగాణ ప్రజల వేదనను నేరుగా ఆయన దృష్టికి తీసుకెళ్లారు. రైతుల ఆత్మహత్యలు, నిరుద్యోగుల బాధలు, విద్యార్థుల సమస్యలు, మహిళల కష్టాలు అన్నీ ఆ యాత్రలో మహేష్ కుమార్ గౌడ్ ద్వారా రాహుల్ గాంధీ ముందుకు వచ్చాయి. పాదయాత్రల ద్వారా ప్రజలతో మమేకమై, వారి మధ్యే ఉండే నాయకుడిగా ఆయన రూపుదిద్దుకున్నారు.

రాజకీయ పోరాటం మాత్రమే కాకుండా ప్రజలకు నేరుగా సహాయం చేయడంలోనూ మహేష్ గారు ప్రత్యేకత చూపారు. పేదలకు రేషన్ కార్డులు, గ్యాస్ సబ్సిడీలు, మహిళలకు ఇంద్రామహాజన్ పథకం ద్వారా ఆర్థిక భద్రత కల్పించడానికి ప్రయత్నించారు. రైతుల కోసం ఎరువుల సబ్సిడీలు, రుణమాఫీ, విద్యార్థుల కోసం ఫీజు రీయింబర్స్‌మెంట్ వంటి అంశాలపై ఆయన నిరంతరం పోరాటం చేశారు. ఇవన్నీ ప్రజల మధ్య సాగడం ఆయన స్వభావం.





మహేష్ కుమార్ గౌడ్ ప్రజా అజెండా స్పష్టంగా ఉంది. రైతుల సమస్యల పరిష్కారం, విద్యార్థుల భవిష్యత్తు రక్షణ, మహిళా సాధికారత, బలహీన వర్గాల అభివృద్ధి, అవినీతి వ్యతిరేక పోరాటం ఆయన ముఖ్య లక్ష్యాలు. ఇవన్నీ ప్రజలకు మేలు చేసే అంశాలే కావడంతో, ఆయన అజెండా ప్రజల మనసుకు దగ్గరగా ఉంటుంది.

ప్రజాపాలన దినోత్సవం సందర్భంగా మహేష్ కుమార్ గౌడ్ చూపిన నాయకత్వం ఆయన ప్రజా ప్రాధాన్యాన్ని మరింత స్పష్టంగా చాటింది. కాంగ్రెస్ కార్యకర్తలు ఆయన కృషిని గుర్తించి, ఆయన నాయకత్వంలో పార్టీ బలపడుతుందనే నమ్మకాన్ని వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా తెలంగాణ ప్రదేశ్ మహిళా కాంగ్రెస్ ఉపాధ్యక్షురాలు డా. రేఖా బోయలపల్లి మాట్లాడుతూ "మహేష్ కుమార్ గౌడ్ ప్రజా సేవ పట్ల అంకితభావంతో ముందుకు సాగే నాయకుడు. ఆయన నాయకత్వంలో పనిచేయడం నాకు గర్వకారణం. టీపీసీసీ అధ్యక్షుడిగా ఒక సంవత్సరం విజయవంతంగా పూర్తి చేసుకున్న సందర్భంగా ఆయనకు హృదయపూర్వక అభినందనలు" అని పేర్కొన్నారు.

ఇలా చూస్తే బొమ్మ మహేష్ కుమార్ గౌడ్ గారి జీవన ప్రయాణం నిజంగా ఒక స్ఫూర్తిదాయక గాథ. సాధారణ కుటుంబంలో పుట్టి, విద్యార్థి ఉద్యమాల నుండి మొదలై, కాంగ్రెస్ లోకనాయకుడిగా ఎదిగి, టీపీసీసీ అధ్యక్షుడిగా మారిన ఆయన పయనం ప్రతి యువతకు ఆదర్శం. 38 ఏళ్ల ప్రజా పోరాట యాత్రలో ఆయన అనుభవం, క్రమశిక్షణ, ధైర్యం, ప్రజల పట్ల అంకితభావం ఎల్లప్పుడూ కాంగ్రెస్ బలానికి పునాది అవుతున్నాయి.

మహేష్ కుమార్ గౌడ్ నిజంగా మట్టి మనిషి. ప్రజలతో కలిసిపోయే ఆయన స్వభావం, నిబద్ధత, క్రమశిక్షణ ఆయనను విలక్షణ నాయకుడిగా నిలబెట్టాయి. ఆయన నాయకత్వంలో కాంగ్రెస్ పార్టీ మరింత బలపడుతూ, ప్రజలకు దగ్గరగానే కొనసాగుతుంది. తెలంగాణ రాజకీయాల్లో ఆయన పాత్ర మరింత విశిష్టమవుతుందని చెప్పడం అతిశయోక్తి కాదు.

ఆయనకు మరింత ఆప్యాయతను తెచ్చాయి. అందుకే ప్రజలు ఆయనను "మట్టి మనిషి మహేష్ కుమార్ గౌడ్" అని గౌరవంగా పిలుస్తారు.

మహేష్ కుమార్ గౌడ్ ఖ్యాతి తెలంగాణలో మాత్రమే పరిమితం కాలేదు. ఎన్నారై వేదికల్లోనూ ఆయన ప్రఖ్యాతి విస్తరించింది. అమెరికా, కెనడా, దుబాయ్ వంటి ఎన్నారై సంఘాలు ఆయనను ఘనంగా సన్మానించాయి. ప్రజలతో మమేకమై ఉండే ఆయన స్వభావమే ఆయనకు ఆ గౌరవాన్ని తెచ్చింది. తెలంగాణ నుండి వచ్చిన ఒక నాయకుడు అంతర్జాతీయ వేదికల్లో సత్కారాలు పొందడం ఆయనకు మాత్రమే కాదు, రాష్ట్రానికే గర్వకారణం.

ఆయన వ్యక్తిత్వంలో మరో ఆసక్తికర కోణం క్రీడల పట్ల ఉన్న ఆసక్తి. మహేష్ కుమార్ గౌడ్ కరాటేలో బ్లాక్‌బెల్ట్ ఛాంపియన్. ఈ క్రీడ ఆయనలో క్రమశిక్షణ, పట్టుదల, ధైర్యం వంటి విలువలను నింపింది. అదే క్రమశిక్షణ ఆయన రాజకీయ జీవనశైలిలోనూ ప్రతిబింబిస్తోంది. ఎప్పుడూ కష్టాలెదురైనా వెనక్కి తగ్గకుండా, ముందుకు



**డా. రేఖా బోయలపల్లి**

ఉపాధ్యక్షురాలు


తెలంగాణ ప్రదేశ్ మహిళా కాంగ్రెస్

# నియోజకవర్గ అభివృద్ధి కోసమే..

- కాంగ్రెస్‌లో చేరలేదు, కలిసి పనిచేస్తున్నా..
- రాజకీయాలను కేసీఆర్ భ్రష్టు పాటించారు
- పార్టీ ఫిరాయింపులను ప్రోత్సహించిందెవరు?
- మాజీ మంత్రి, ఎమ్మెల్యే కడియం శ్రీహరి

**హైదరాబాద్,సెప్టెంబరు19( వెలుతురు):**

తెలంగాణలో పార్టీ మారిన ఎమ్మెల్యేల్లో ఒకరైన స్టేషన్ ఘన్ పూర్ ఎమ్మెల్యే కడియం శ్రీహరి సంచలన కామెంట్స్ చేశారు. హన్మకొండలో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో కడియం మాట్లాడుతూ బీఆర్ఎస్ అధికారంలో ఉన్న సమయంలో 36 మంది శాసన సభ్యులను పార్టీలో చేర్చుకొని అందులో ఇద్దరికీ మంత్రి పదవి కూడా ఇచ్చారని కడియం శ్రీహరి గుర్తు చేశారు. రాష్ట్రంలో అధికారంలో ఉన్న పార్టీతో కలిసి పనిచేయడం ద్వారా నియోజకవర్గాన్ని అభివృద్ధి చేసుకోవచ్చని కాంగ్రెస్‌తో నడవడం జరుగుతుందని కడియం క్లారిటీ ఇచ్చారు. గత పదిహేను సంవత్సరాలుగా స్టేషన్ ఘాన్ పూర్ నియోజకవర్గానికి జరిగిన అన్యాయాన్ని కొంతైనా పూడ్చవచ్చని కాంగ్రెస్‌తో పని చేస్తున్నానని, ఉపముఖ్యమంత్రిగా ఉన్నని రోజులు నియోజకవర్గంలో అడుగుపెట్టలేదని కడియం శ్రీహరి అన్నారు. కేసీఅర్ డిల్లీలో ఉన్న తనను పిలిచి ఉపముఖ్యమంత్రి పదవి ఇచ్చారని ఆయన తెలిపారు. రాజకీయ వ్యవస్థను కేసీఆర్ భ్రష్టు పట్టించారని కడియం శ్రీహరి ఆరోపించారు. కేసీఆర్ అధికారంలో ఉన్న సమయంలో వివిధ పార్టీల నుంచి 36 మంది ఎమ్మెల్యేలను బీ అర్ఎస్‌లో చేర్చుకున్నారని అందులో శ్రీనివాస్ యాదవ్, సబితా ఇంద్రారెడ్డికి మంత్రిపదవులు ఇచ్చారని



కడియం గుర్తు చేశారు. ఆనాడు కేసీఆర్ పార్టీ ఫిరాయింపులను ప్రోత్సహించారని ఎవరితో రాజీనామా చేయించలేదని తెలిపారు. సభ్యత్వం రద్దు కాలేదని కడియం అన్నారు. అధికారం కోల్పోయిన తరువాత ఫాం హౌస్‌కు పరిమితమైన కేసీఅర్‌కు ఇప్పుడు రాజకీయాలు గుర్తుకు వచ్చాయా అని ప్రశ్నించారు. మీరు చేస్తే సంసారం.. మరొకరు చేస్తే వ్యభిచారమా అని ఘాటుగా స్పందించారు. కేసీఆర్ తెలంగాణను ఆగమం చేశారని కడియం ఆరోపించారు. నేను రాజకీయాల్లో ఎవరికీ పాదాభివందనం చేయలేదని.. నీతి.. నిజాయితీతో రాజకీయాల్లో ప్రజల కోసం పని చేస్తున్నానని అన్నారు.పార్టీ మారారని బీఆర్ఎస్ సుప్రీం కోర్టుకు వెళ్లిందని కోర్టు మూడు నెలల్లో నిర్ణయం తీసుకోవాలని చెప్పిందే తప్ప, సభ్యత్వాన్ని రద్దు చేయమని చెప్పలేదని కడియం శ్రీహరి అన్నారు. స్పీకర్ తనకు వివరణ ఇవ్వాలని నోటీస్ ఇచ్చారనీ వివరణ ఇచ్చే సమయంలో ఉందని కడియం చెప్పారు. ఏదీ ఏమైనా స్పీకర్ నిర్ణయానికి కట్టుబడి ఉంటానని కడియం శ్రీహరి స్పష్టం చేశారు పార్టీ ఫిరాయింపులకు కడియం శ్రీహరి వ్యతిరేకమని, వ్యక్తిగతంగా ఫిరాయింపులను సమర్థించబోనని కడియం అన్నారు. కానీ నియోజకవర్గ ప్రజలు, అభివృద్ధి కోసం తప్పని పరిస్థితుల్లో పార్టీ మారాల్సి వస్తుందని కడియం చెప్పారు. నేను పార్టీలో ఉన్నాననే స్పీకర్ చెబుతానని కడియం చెప్పారు.మెడిసిన్ చదువుకొని కొంతమంది సభ్యత, సంస్కారం లేకుండా మాట్లాడుతున్నారని కడియం మండిపడ్డారు. రాజకీయ విమర్శలు కాకుండా వ్యక్తిగత విమర్శలు చేస్తున్నారన్నారు. రాజకీయ విమర్శలు ఉండాలే కానీ వ్యక్తిగత విమర్శలు ఉండకూడదని పరోక్షంగా రాజయ్యకు చురకలంటించారు. నాకు బూతులు వచ్చు.. మాటలు వచ్చు, పుట్టింది అదే కాలనీలోనేనని కడియం అన్నారు. తాను మాట్లాడేందుకు సభ్యత, సంస్కారం అడ్డు వస్తుందని తెలిపారు. వాళ్ళ వ్యాఖ్యలను వారి విజ్ఞతకే వదిలేస్తున్నానని అన్నారు. 15 సంవత్సరాలు అధికారంలో ఉండి చిలిపి పనులు, దళిత బంధు, బి ఫాం అమ్ముకున్న వ్యక్తులతో విమర్శలు ఎదుర్కోవాల్సి వస్తుందని రాజయ్యపై మండిపడ్డారు.స్టేషన్ అభివృద్ధికి సీఎం చొరవ తీసుకున్నారన్నారు కడియం. 148 కోట్లు దేవాదుల ఉప కాల్వల కోసం నిధులు ఇచ్చారన్నారు. దీనివల్ల చివరి ఆయకట్టు వరకు గోదావరి నీళ్లు వెళ్తున్నాయని వివరించారు. తొలిసారి అనేక చెరువులు నింపుకున్నామని సవరించిన 1015 కోట్లతో ప్యాకేజీ 6తో రిజర్వాయర్లు, చెరువులు నింపనున్నామన్నారు. గోదావరి జలాలతో నియోజకవర్గంలోని అన్ని గ్రామాలకు నీళ్లు ఇస్తామన్నారు. ఇదంతా కాంగ్రెస్ వల్ల సాధ్యమైందని తెలిపారు. స్టేషన్ ను ఎడ్యుకేషన్ హబ్ చేయాలనే లక్ష్యంతో యంగ్ ఇండియా ఇంటిగ్రేటెడ్ రెసిడెన్షియల్ స్కూల్ మంజూరైందని కడియం తెలిపారు.

# ప్రాజెక్టులపై కాంగ్రెస్‌కు కనీస జ్ఞానం లేదు

- పండుగలకు వస్తే ప్రజలకు పాపమైంది: హరీశ్‌రావు



**హైదరాబాద్,ఆగస్టు19( వెలుతురు):**

కాళేశ్వరంపై కాంగ్రెస్, బీఆర్ఎస్ పార్టీలు ఒకరిమీద ఒకరు తూటాలు పేల్చుతూనే ఉన్నారు. ఈ నేపథ్యంలో మాజీ మంత్రి, ఎమ్మెల్యే హరీష్ రావు మరోసారి కాళేశ్వరం ప్రాజెక్ట్‌కు సంబంధించి ఎక్స్ వేదికగా స్పందిస్తూ కాంగ్రెస్ ప్రభుత్వంపై సెటైరికల్ కామెంట్స్ చేశారు. కాంగ్రెస్ పార్టీకి ప్రాజెక్టులపై కనీస జ్ఞానం లేదని విమర్శించారు. మేడిగడ్డ టు మల్లన్న సాగర్ – మొత్తం ప్రాజెక్ట్ ఖర్చు రూ. 84,000 కోట్లు అయితే.. జస్ట్ తమ్మిడి హెట్టి టు ఎల్లంపల్లి కి రూ. 35,000 వేల కోట్లట! కాళేశ్వరం పథకంతో 37 లక్షల ఎకరాల ఆయకట్టుకు నీళ్ళు ఇవ్వాలనేది లక్ష్యం అయితే, ప్రాణహిత– చేవెళ్ల ప్రాజెక్టుతో కేవలం 4.47 లక్షల ఎకరాలకే సాగు నీరట! కాళేశ్వరంలో నీటి వినియోగం 240 అయితే, ప్రాణహిత చేవెళ్లలో 80 మాత్రమేనట కాళేశ్వరం ప్రాజెక్టుతో పోల్చితే మూడో వంతు ఖర్చు చేస్తూ, పదోవంతు ఎకరాకు కూడా నీళ్లు ఇవ్వరట! 35 వేల కోట్లు ఖర్చు చేసి, కేవలం 4.47 లక్షల ఎకరాలకు సాగు నీరు ఇవ్వాలనే ఆలోచన అద్భుతం. అమోఘం. కాంగ్రెస్ ప్రభుత్వ ఇంజనీరింగ్ నైపుణ్యానికి ఇది మరో నిదర్శనం. ఇది కదా అసలైన మార్పంటే?' అంటూ మాజీ హరీష్‌రావు ట్వీట్ చేశారు.  పండుగలు వస్తే ప్రజలకు పాపమైంది అన్నట్టుగా ప్రజల నుంచి భారీగా దండుకునేందుకు ప్రజలు ప్రభుత్వం చర్యలు చేపడుతుందని హరీశ్‌రావు మండిపడ్డారు. దీనిలోభాగంగా దసరాకు ప్రత్యేక బస్సుల పేరుతో అదనంగా 50 శాతం అధికంగా ఛార్జీలు వసూలు చేస్తామని టీజీఎస్ ఆర్టీసీ ప్రకటించడంపై మాజీ మంత్రి హరీశ్‌రావు తీవ్రస్థాయిలో ధ్వజమెత్తారు. పండుగలు వస్తే చాలు ఆర్టీసీ బస్సు ఛార్జీలు అడ్డగోలుగా పెంచి ప్రజల నడ్డి విరిచేందుకు కాంగ్రెస్ ప్రభుత్వం సిద్ధమవుతుండటం సిగ్గుచేటు అని హరీశ్‌రావు మండిపడ్డారు. పల్లె వెలుగు సహా అన్ని రకాల ఆర్టీసీ బస్సుల్లో టికెట్ ధరలు విపరీతంగా పెంచి బతుకమ్మ, దసరా పండుగ సమయంలో సొంతూళ్లకు వెళ్లే ప్రయాణికుల నుంచి ముక్కు పిండి ఛార్జీలు వసూలు చేయడం దుర్మార్గం అని నిప్పులు చెరిగారు. అదనపు సర్వీసుల పేరిట 50శాతం అదనపు ఛార్జీల దోపిడీ.. ప్రయాణికులకు పెను భారంగా మారుతున్నది. పండుగ సంబురం లేకుండా చేస్తున్నది అని ఆయన పేర్కొన్నారు. ఆర్టీసీ బస్సుల సంఖ్య పెంచకుండా, రెగ్యులర్‌గా నడిచే బస్సులకే పండుగ స్పెషల్ బోర్డులు తగిలించి చేస్తున్న ఈ దోపిడీ ముమ్మాటికీ ప్రజాపీడనే అవుతుంది. తెలంగాణ ప్రజలకు బతుకమ్మ, దసరా పండుగ సంతోషాన్ని లేకుండా చేయడమేనా ప్రజా పాలన, ఇదేనా కాంగ్రెస్ ప్రభుత్వ వైఖరి? అని హరీశ్‌రావు నిలదీశారు.

# జూబ్లీహిల్స్ ఎన్నికల్లో కాంగ్రెస్‌కు గుణపాఠం తప్పదు

- 420 హామీలతో గద్దెనెక్కిన కాంగ్రెస్‌ను ప్రజలు తరుముతారు :కేటీఆర్

**హైదరాబాద్,ఆగస్టు19( వెలుతురు):**



వచ్చే జూబ్లీహిల్స్ ఎన్నికల్లో కాంగ్రెస్‌కు ప్రజలు తగిన గుణపాఠం చెప్తారని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ అన్నారు. 420 హామీలతో ప్రజలను మోసం చేసిన కాంగ్రెస్ పార్టీకి జూబ్లీహిల్స్ జైత్రయాత్రతో ప్రజలు సురుకు పెట్టాలని బీఆర్ఎస్ పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ సూచించారు. పొరపాటున మళ్లీ కాంగ్రెస్ పార్టీకి ఓటేసి గెలిపిస్తే సంక్షేమ పథకాలు అమలు కావని కేటీఆర్ హెచ్చరించారు. తెలంగాణ భవన్‌లో జరిగిన జూబ్లీహిల్స్ ఎర్రగడ్డ డివిజన్ సమావేశంలో కేటీఆర్ పాల్గొని ప్రసంగించారు. రేపటి తెలంగాణ భవిష్యత్తును జూబ్లీహిల్స్ ఉప ఎన్నిక డిసైడ్ చేస్తుందన్నారు కేటీఆర్. అరచేతిలో వైకుంఠం చూపించి మోసం చేసిన కాంగ్రెస్ ప్రభుత్వానికి జూబ్లీహిల్స్‌లో గులాబీ జైత్రయాత్రతోనే సురుకుపెట్టాలన్నారు. పొరపాటున కాంగ్రెస్‌ను గెలిపిస్తే సంక్షేమ పథకాలను అమలు చేయాల్సిన అవసరం తమకు లేదని ఆ పార్టీ నాయకులు భావిస్తారని చెప్పారు. కారు కావాలో కాంగ్రెస్, బీజేపీ బేకార్ గాల్లు కావాలో ప్రజలే తేల్చుకోవాలన్నారు. తెలంగాణ రక్షగా, గొంతుగా ఉన్న కేసీఆర్‌ను లేకుండా చేయాలన్నదే బిజెపి, కాంగ్రెస్ ఉమ్మడి లక్ష్యం అన్నారు. బీఆర్ఎస్ పార్టీని ఖతం చేస్తే కాంగ్రెస్‌ను ఈజీగా ఫుట్ బాల్ ఆడుకోవచ్చని బీజేపీ భావిస్తుందన్నారు. రేవంత్ ప్రభుత్వం చేసిన మోసంతో రాష్ట్రంలో ఏ ఒక్క ఆడబిడ్డ సంతోషంగా లేదన్న కేటీఆర్, గీతక్క ,సీతక్క ,సురేఖ అక్క లు మాత్రమే సంతోషంగా ఉన్నారని ఎద్దేవా చేశారు. కాంగ్రెస్ బిజెపిల జాయింట్ వెంచర్ రేవంత్ ప్రభుత్వం అని కేటీఆర్ విమర్శించారు. రాహుల్ గాంధీ ఓట్ చోర్ అంటున్న మోడీని, మోసగాడనే అదానీని రేవంత్ వెనుకేసుకొస్తున్నాడని చెప్పారు. రాహుల్ బేకార్ అన్న గుజరాత్ మోడల్ ను ప్రశంసించిన రేవంత్, వేటకుక్క అన్న సిబిఐని కేసీఆర్ మీదకే ప్రయోగించాడని తెలిపారు. దేశంలోని ముస్లింల మనోభావాలకు వ్యతిరేకంగా మోడీ ప్రభుత్వం చేసిన వక్ఫ్ సవరణలకు వ్యతిరేకంగా రాజ్యసభలో బీఆర్ఎస్ ఓటు వేసిందన్నారు. మోడీ ప్రభుత్వం తీసుకొచ్చిన వక్ఫ్ సవరణలను దేశంలో అందరి కంటే ముందు రేవంత్ ప్రభుత్వమే అమలు చేసిందని గుర్తుచేశారు. ఇలా ఎందుకు చేశారో చెప్పాలని ఓట్ల కోసం వచ్చే కాంగ్రెస్ మంత్రులు, నేతలను ముస్లింలు నిలదీయాలని కేటీఆర్ పిలుపునిచ్చారు. చరిత్రలో తొలిసారి ముస్లిం మంత్రి లేకుండా కాంగ్రెస్ ప్రభుత్వాన్ని ఏర్పాటు చేసిందని కేటీఆర్ పేర్కొన్నారు.

# శ్రీకాకుళంలో స్కూల్ దత్తత

- మంత్రి రామ్మోహన్ నాయుడుకు లోకేశ్ అభినందనలు

**అమరావతి,సెప్టెంబరు19 ( వెలుతురు):**

శ్రీకాకుళం ఏడు రోడ్ల కూడలిలో దశాబ్దాల చరిత్ర ఉన్న ఎన్టీఆర్ మున్సిపల్ హైస్కూల్‌ను కేంద్రమంత్రి రామ్మోహన్ నాయుడు దత్తత తీసుకోవడంపై మంత్రి నారా లోకేశ్ హర్షం వ్యక్తం చేశారు. ఆయనకు 'ఎక్స్' వేదికగా అభినందనలు తెలిపారు. రామ్మోహన్ నాయుడు మాదిరిగానే ప్రజాప్రతినిధులు, పారిశ్రామికవేత్తలు, దాతలు, పూర్వ విద్యార్థులు, ఎన్ఆర్ఐలు ముందుకు రావాలని పిలుపునిచ్చారు. తమ పరిధిలోని పాఠశాలల అభివృద్ధికి చేయూతనందించాలని కోరారు. అందరం కలిసి ఏపీ మోడల్ ఆఫ్ ఎడ్యుకేషన్‌ను తీసుకొచ్చి రాష్ట్ర విద్యా వ్యవస్థను దేశానికే ఆదర్శంగా నిలుపుదామన్నారు. కేంద్ర మంత్రి రామ్మోహన్ నాయుడు శుక్రవారం ఎన్టీఆర్ మున్సిపల్ హైస్కూల్‌ను సందర్శించారు. క్షేత్రస్థాయి పరిస్థితులను పరిశీలించి.. అక్కడ ఉన్న సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా విద్యార్థులు, ఉపాధ్యాయులు, పూర్వ విద్యార్థులతో భేటీ– అయ్యారు. దశాబ్దాల చరిత్ర కలిగిన ఈ పాఠశాలను దత్తత తీసుకుంటు–న్నట్లు– ప్రకటించారు. దీనిని అన్ని విధాలుగా అభివృద్ధి చేస్తానని హామీ ఇచ్చారు. విషయం తెలుసుకున్న మంత్రి లోకేశ్.. ఈ క్రమంలోనే కేంద్ర మంత్రికి అభినందనలు తెలిపారు. ఇలాంటి కార్యక్రమాలకు ప్రభుత్వం కూడా పూర్తి తోడ్పాటు– అందిస్తుందని చెప్పారు.

https://epaper.velthuru.com

# ప్రజా “సేవకుడు”





**నిఖార్సయిన నాయకులే చరిత్ర పుటల్లో నిలిచిపోతారు. అది కేవలం వారు అధిష్ఠించిన సింహాసనం వల్ల, వారికున్న హెూదా వల్ల రాదు. ప్రజల ప్రేమాభిమానాలను గెలుచుకోవడం వల్లనే అది సాధ్యం. నిత్యం ప్రజలతో మమేకమవుతున్న ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఆయన పనితీరుతో నిఖార్సయిన నేతకు ప్రతిబింబంగా నిలుస్తున్నారు. అధికారం అనుభవిస్తూ కుర్చీకే పరిమితమవకుండా ఎలాంటి హంగు ఆర్భాటాలు లేకుండా ప్రజల సమస్యలు తెలుసుకుంటూ వాటిని తక్షణమే పరిష్కరిస్తూ రేవంత్ రెడ్డి ప్రజా పాలన అందిస్తున్నారు.**

గత పదేళ్ల కేసీఆర్ ఫాం హౌస్ పాలన ప్రజలకు విసుగు తెప్పించాయి. ముఖ్యమంత్రి అంటే మన కోసం, మన మధ్యలో ఉండాలని ఆకాంక్షతో తెలంగాణ ప్రజలు ‘ప్రజా ప్రభుత్వాన్ని’ ఏరికోరి తెచ్చుకున్నారు. గత ఇరవై నెలలుగా సీఎం రేవంత్ రెడ్డి వేస్తున్న అడుగులను గమనిస్తే ఆయన ప్రజల మనోభావాలకు అనుగుణంగా, కేసీఆర్ పాలనకు భిన్నంగా పని చేస్తున్నారని పాలన చూస్తుంటే అర్థమైపోతుంది. నిత్యం ప్రజలతో మమేకమవడం సంక్షోభ సమయాలలో వేగంగా స్పందించడం, సాధారణ మనిషిలా నడుచుకోవడం ఇవన్నీ ఆయన ప్రత్యేకతలను తెలుపుతున్నాయి. ప్రజలతో మమేకమయ్యే ధోరణి, నిత్యం వారికి అందుబాటులో ఉండడం సీఎం రేవంత్ రెడ్డికి మంచి గుర్తింపు తెచ్చాయి.

హైదరాబాద్‌లో ప్రతిష్టాత్మంగా నిర్వహించే గణేశ్ నిమజ్జన వేడుకలకు ఆయన ఎలాంటి ఆర్భాటం లేకుండా ఒక సాధారణ భక్తుడిలా ట్యాంక్ బండ్ పరిసరాలకు వచ్చి ప్రజలతో కలిసిపోయి సంబురాలు చేసుకున్నారు. వారితో కలిసి “గణపతి బప్పా మోరియా” అంటూ నినాదాలు చేశారు. ఒక ముఖ్యమంత్రి తన హెూదాను పక్కన పెట్టి సాధారణ ప్రజలతో కలిసిపోవడం బహుశా ఇదే తొలిసారి కావొచ్చు. ఆయన వ్యవహార శైలీపై గణేశ్ ఉత్సవ సమితి హర్షం వ్యక్తం చేసింది. సీఎం మన మధ్యలోనే ఉన్నారా అంటూ ఆశ్చర్యపోయిన సాధారణ భక్తులు ఆయనను ఆత్మీయంగా పలకరిస్తూ సెల్ఫీలు తీసుకోవడానికి పోటీ పడ్డారు. ఈ దృశ్యాలు సోషల్ మీడియాలో వైరల్ కాగా “ఆయన ముఖ్యమంత్రి అయినా మనలాంటి మనిషే” అంటూ ప్రజలు మెచ్చుకుం టున్నారు. ఇది కేవలం పబ్లిసిటీ స్టంట్ కాదని, నిజంగానే రేవంత్ వైఖరిని ప్రతిబింబించే సంఘటన అని రాజకీయ విశ్లేషకులు అభిప్రాయ పడుతున్నారు. దీనికి ఉదాహరణగా ఆయన అధికారంలోకి వచ్చినప్పటి నుంచి కనబరుస్తున్న పరిణితిని వారు గుర్తు చేస్తున్నారు. ప్రతిపక్షనేత కేసీఆర్ అనారోగ్యంతో ఆస్పత్రిలో ఉన్నప్పుడు మానవతా దృక్పథంతో రేవంత్ రెడ్డి వెళ్లి పలకరించడాన్ని ఎవ్వరూ మర్చేపోలేరు.

నాయకుడి గుణ గణాలు సంక్షోభ సమయాల్లోనే పరీక్షించబడుతాయి. రాష్ట్రంలో ఇటీవల కురిసిన భారీ వర్షాల సమయంలో హైదరాబాద్ సహా ఇతర ప్రాంతాల్లో వరదల్లో చిక్కుకున్న బాధితులను కలవడానికి సీఎం రేవంత్ రేవంత్ రెడ్డి ఒక మామూలు మనిషిలా వెళ్లారు. వరదల ప్రభావిత కాలనీలలోని ప్రజలతో నేరుగా మాట్లాడి వారి గోడును విన్నారు. అధికారులు సంవత్సరాలుగా వాయిదా వేస్తున్న మౌలిక సదుపాయాల కల్పన, ఇతర సమస్యలపై అక్కడికక్కడే చర్చించి, తక్షణ చర్యలు తీసుకోవాలని సీఎం ఆదేశించారు. ఇలాంటి పర్యటనలు ప్రజల్లో భరోసా కల్పించడమే కాదు, పాలనలో మార్పును సూచించే సంకేతాలుగా నిలబడిపోతాయి.

కనివినీ ఎరుగని వరదలతో తీవ్రంగా నష్టపోయిన కామారెడ్డితో సహా ఇతర ప్రాంతాల్లో పరిస్థితులను సమీక్షించేందుకు సీఎం రెవంత్ రెడ్డి స్వయంగా క్షేత్రస్థాయిలో పర్యటించి నష్టాలను అధ్యయనం చేసి అధికారులకు సలహాలు, సూచనలతో పాటు తీసుకోవాల్సిన తక్షణ సహాయంపై ఆదేశాలు జారీ చేశారు. అత్యవసర సహాయం కోసం తక్షణమే 200 కోట్ల రూపాయలు నిధులు విడుదల చేయడం ఆయన వేగంగా తీసుకునే నిర్ణయ సామర్థ్యానికి నిదర్శనం. ముఖ్యమంత్రి వెంట టీపీసీసీ అధ్యక్షుడు మహేశ్ కుమార్ గౌడ్, మంత్రులు కూడా కలసి ఏరియల్ సర్వేలో పాల్గొన్నారు. ఆయన రాజకీయాలకు అతీతంగా స్థానిక బీజేపీ ఎమ్మెల్యేని కూడా కలుపుకొని పోయి బాధితుల ఇబ్బందులను సమీక్షించి వారిలో భరోసా కలిగించారు. ఇది ముఖ్యమంత్రి మంచితనం వ్యక్తిత్వానికి నిదర్శనం. ఆయన పనితీరును చూసినవారు “పదవి కోసం కాకుండా, ప్రజల కష్టం తెలుసుకునే నాయకుడిగా పనిచేస్తున్నారు” అని సకలజనులు ఆనందంగా చెప్పుకుంటున్నారు.

గత పదేళ్ల బీఆర్ఎస్ పాలనలో తెలంగాణలో ప్రతిష్టాత్మకమైన ఉస్మానియా యూనివర్సిటీలో కేసీఆర్ ఒక్కసారి కూడా అడుగుపెట్టలేదు. ఆ పార్టీలో అగ్రనాయకులమని చెప్పుకునే వారు కూడా ఉస్మానియా యూనివర్సిటీని పట్టించుకోలేదు. అయితే వారికి భిన్నంగా రేవంత్ రెడ్డి తెలంగాణ ఉద్యమానికి ఊపిరిగా నిలిచిన ఉస్మానియా యూనివర్సిటీలో అడుగుపెట్టి, ఉద్యమకారులకు తెలంగాణపై తనకున్న ప్రేమను చేతల్లో చూపించారు. ఉస్మానియా విశ్వవిద్యాలయాన్ని పదేళ్ల తరువాత సందర్శించిన ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డే కావడం విశేషం. తెలంగాణ అస్తిత్వాన్ని కాపాడుతూనే, భవిష్యత్‌లో వర్సిటీ అభివృద్ధికి కీలక ప్రకటన చేశారు. అమెరికాలోని స్టాన్‌ఫోర్డ్ విశ్వవిద్యాలయ తరహాలో ఉస్మానియాను అభివృద్ధి చేయాలని సీఎం ప్రతిపాదించారు. ఒక నాయకుడి దూరదృష్టిని ప్రతిబింబించే స్వభావం ఇందులో స్పష్టంగా కనిపిస్తుంది.

ప్రతిపక్షాలు ఎన్ని విమర్శలు చేసినా, సీఎం రేవంత్ రెడ్డిని ప్రజలు ఒక విభిన్నమైన నాయకుడిగా గుర్తిస్తున్నారు. రాబోయే ఎన్నికల్లో ఈ విశ్వాసం ఆయనకు ఆస్తిగా మారి కాంగ్రెస్‌కు లబ్ది చేకూర్చడం ఖాయం. తెలంగాణ ప్రజలు నిత్యం అందుబాటులో ఉండే ముఖ్యమంత్రిని కోరుకున్నారు. సోదరుడిలా, స్నేహితుడిలా తమ బాధలను విని స్పందించే నాయకత్వాన్ని కోరుకుంటున్నారు. ప్రజల ఆకాంక్షలకు ప్రతిబింబంగా సీఎం రేవంత్ రెడ్డి, ఆయన మంత్రివర్గం, టీపీసీసీ అదే బాటలో నడుస్తున్నారు. ‘తెలంగాణ రైజింగ్ 2047’ లక్ష్యంగా పాలిస్తూ ప్రజా పాలన అందిస్తున్న రేవంత్ రెడ్డి తెలంగాణ రాజకీయాల్లో ప్రజానాయకుడిగా నిలబడి, కొత్త తరహా నాయకత్వానికి ఆదర్శంగా మారడం ఖాయం.



**అమరవాజీ నాగరాజు**
పీఆర్వో, టీపీసీసీ అధ్యక్షులు

## ఒక్కరోజులో 404 కేసులను ఎలా విచారిస్తారు?

**- కేసులను త్వరగా పరిష్కరించాలన్న ఉద్దేశం మంచిదే**

**- సమాచార కమిషన్‌ను నిలదీసిన తెలంగాణ హైకోర్టు**




**హైదరాబాద్, సెప్టెంబరు19 ( వెలుతురు):**
కేసులను త్వరగా పరిష్కరించాలన్న ఉద్దేశం మంచిదే అయినా ఒకరోజు 404 కేసులను ఎలా విచారిస్తారని సమాచార కమిషన్?ను హైకోర్టు నిలదీసింది. 404 అప్పీళ్లకు సంబంధించిన ఫైళ్లతో పిటిషనర్? ఎలా రాగలరని ప్రశ్నించింది. కేసుల నంబర్లు లేకుండా విచారణకు హాజరు కావాలంటూ ఇచ్చిన నోటీసు చెల్లదని పేర్కొంది. సమాచారం హక్కు చట్టం కింద కోరిన సమాచారానికి సంబంధించి స.హ. కార్యకర్త వి.శ్యామ్ కమిషన్ ముందు 404 అప్పీళ్లు దాఖలు చేశారు. వీటన్నింటిపై విచారణకు వివరాలతో ఈ నెల 18న హాజరు కావాలని కమిషన్ నోటీసులిచ్చింది. దీన్ని సవాల్ చేస్తూ శ్యామ్ గురువారం లంచ్ మోషన్ పిటిషన్ దాఖలు చేయగా, జస్టిస్ టి.మాధవీ దేవి విచారించారు. ప్రభుత్వ న్యాయవాది వాదనలు వినిపిస్తూ సమాచార కమిషన్ చీఫ్ కమిషనర్ పోస్టు ఏడాదిన్నర పాటు ఖాళీ ఉండటంతో 17 వేలకు పైగా కేసులు పెండింగ్‌లో ఉన్నాయన్నారు. పిటిషనర్ 404 అప్పీళ్లు దాఖలు చేయగా, మరో ఇద్దరు 980, 832 చొప్పున దాఖలు చేశారన్నారు. వీటిలో కొన్నింటిని గడువులోగా పరిష్కరించాలని హైకోర్టు ఆదేశాలు జారీ చేసిందని, అందులో భాగంగానే పిటిషనర్‌కు నోటీసు జారీ చేశారని తెలిపారు. వాదనలు విన్న న్యాయమూర్తి ఒకేరోజు 404 కేసులపై విచారణ ఎలా సాధ్యమని ప్రశ్నించారు. ఈ నెల 11న ఇచ్చిన నోటీసును రద్దు చేస్తున్నామని, కేసుల వివరాలతో తాజాగా ఇవ్వాలని కమిషన్‌కు ఆదేశిస్తూ పిటిషన్‌పై విచారణను మూసివేసింది.స.హ.చట్టం కింద సమాచారం కోసం ముగ్గురు అర్జీదారులు అప్పిలేట్ అథారిటీకి వందల కొద్దీ దరఖాస్తులు సమర్పించారు. పురపాలక, ఆర్థిక, రెవెన్యూ శాఖల్లో వేసినట్లు రాష్ట్ర సమాచార కమిషన్ గుర్తించింది. స.హ.చట్టం కింద సరైన సమాచారం రాకుంటే అప్పిలేట్ అథారిటీకి దరఖాస్తు చేయొచ్చు. ఈ మేరకు ముగ్గురు వ్యక్తులు వేర్వేరు జిల్లాల్లోని పలు విభాగాల పరిధిలో దాదాపు 2,500 దరఖాస్తులు చేశారు. గురువారం ఇక్కడ ఆర్టీఐ కార్యాలయంలో ప్రధాన సమాచార కమిషన్ నేతృత్వంలోని ఐదుగురు కమిషనర్ల ఆధ్వర్యంలోని పూర్తిస్థాయి బెంచ్ వీటిపై విచారించింది. 2023 చివరి వరకు శ్రీనివాస్ రెడ్డి ఆర్థికశాఖ బడ్జెట్, ఖర్చుల వివరాలపై సమాచారం తీసుకున్నట్లు ఒక ప్రకటనలో తెలిపింది. మరో దరఖాస్తుదారుడు వడ్డే శ్యామ్ పురపాలక శాఖ చార్మినార్ జోన్ పరిధిలో ఎన్ని భవనాలకు నిర్మాణ అనుమతులిచ్చారు? ఎందరికి నివాస యోగ్యతపత్రాలు మంజూరు చేశారన్న విషయాలపై సమాచారం కోరినట్లు వివరించింది. మహ్మద్ అష్రఫ్ పాఠశాల విద్య, హెూం, రెవెన్యూ శాఖలకు సంబంధించిన సమాచారం అడిగారని పేర్కొంది.

## త్వరలో టూరిజం కాన్‌క్లేవ్

**- పెట్టుబడుల ఆకర్షణ లక్ష్యం**

**- మంత్రి జూపల్లి వెల్లడి**

**హైదరాబాద్,సెప్టెంబరు19 ( వెలుతురు):**
తెలంగాణలో త్వరలోనే అత్యున్నత స్థాయి టూరిజం కాన్‌క్లేవ్ నిర్వహిస్తున్నట్లు– మంత్రి జూపల్లి కృష్ణారావు తెలిపారు. పెట్టుబడులే లక్ష్యంగా ఈ టూరిజం కాన్‌క్లేవ్ ఏర్పాటు–చేస్తున్నామని వివరించారు. సీఎం రేవంత్‌రెడ్డి ఆదేశాల మేరకు టూరిజం శాఖ ప్రత్యేక కార్యాచరణ సిద్ధం చేసిందని చెప్పుకొచ్చారు. శుక్రవారం ట్రావెల్, టూరిజం ఫెయిర్ 2025 ప్రారంభోత్సవ కార్యక్రమంలో పాల్గొన్నారు మంత్రి. ఈ సందర్భంగా మీడియాతో మాట్లాడారు మంత్రి జూపల్లి కృష్ణారావు. కొత్త పర్యాటక విధానం ఉపాధి, పెట్టుబడులు, మౌలిక సదుపాయాలకు కాంక్లేవ్ దోహదం చేయనుందని తెలిపారు. టూరిజం రంగంలో పెట్టు–బడులు పెట్టాలని సూచించారు. పెట్టుబడులు పెట్టేవారికి ప్రభుత్వం పూర్తి మద్దతు ఇస్తోందని వెల్లడించారు. ప్రపంచ స్థాయి పర్యాటకానికి కావాల్సిన వనరులన్నీ తెలంగాణలోనే ఉన్నాయని వివరించారు. తెలంగాణ పర్యాటకానికి తగిన స్థాయిలో ప్రచారం లభించలేదని పేర్కొన్నారు మంత్రి జూపల్లి కృష్ణారావు. ఎగ్జిబిటర్లు, ట్రావెల్ , హాస్పిటాలిటీ– రంగంలో తెలంగాణకు బ్రాండ్ అంబాసిడర్లుగా నిలవాలని పిలుపునిచ్చారు. రాష్ట్రవ్యాప్తంగా సెప్టెంబర్ 21వ తేదీ నుంచి 30వ తేదీ వరకూ బతుకమ్మ పండుగ వేడుకలను ప్రభుత్వం ఘనంగా నిర్వహిస్తోందని తెలిపారు. చారిత్రక వెయ్యి స్తంభాల గుడి వద్ద బతుకమ్మ వేడుకలు ప్రారంభం అవుతాయని జూపల్లి తెలిపారు.

# ఇందిరా మహిళా శక్తి ద్వారా పేదరికను నిర్మూలిస్తాం

**మహిళలు ఆర్థికంగా ఎదిగినప్పుడే పేదరికం అంతం అవుతుంది**

**హైటెక్ సిటీలో ఇందిరా మహిళా శక్తి బజార్ సలహాలోనే హైదరాబాదులో మరిన్ని స్థలాలను మహిళా సంఘాలకు కేటాయిస్తాం**

**సారస్ మేళా ప్రారంభోత్సవంలో మంత్రి సీతక్క**










**హైదరాబాద్ వెలుతురు సెప్టెంబర్ 19:**
ఇందిరా మహిళా శక్తి ద్వారా పేదరికాన్ని నిర్మూలిస్తాం, మహిళలు ఆర్థికంగా ఎదిగినప్పుడే పేదరికం అంతం అవుతుంది అని మంత్రి సీతక్క స్పష్టం చేశారు. హైటెక్ సిటీలోని ఇందిరా మహిళా శక్తి బజార్‌లో సరస్ మేళాను పంచాయతీ రాజ్, గ్రామీణ అభివృద్ధి, మహిళా శిశు సంక్షేమ శాఖ మంత్రి డా. దనసరి అనసూయ సీతక్క ప్రారంభించారు. రిబ్బన్ కట్ చేసి ప్రాంగణాన్ని ఆరంభించిన మంత్రి సీతక్క వెంట స్థానిక ఎమ్మెల్యే అరికెపూడి గాంధీ, బాలల పరిరక్షణ కమిషన్ చైర్‌పర్సన్ సీతా దయాకర్ రెడ్డి, మహిళా అభివృద్ధి కార్పొరేషన్ చైర్‌పర్సన్ బండ్రు శోభ, వ్యవసాయ కమిషన్ సభ్యురాలు భవాని రెడ్డి, సెర్ప్ సీఈవో దివ్య దేవరాజన్, అదనపు సీఈవో కాత్యాయిని, స్త్రీనిధి ఎండి విద్యాసాగర్ రెడ్డి, WE-Hub సీఈవో సీతా పల్లచోళ తదితరులు పాల్గొన్నారు. సాంప్రదాయ కళాకారులు ఘన స్వాగతం పలకగా, డప్పుల చప్పుళ్లతో మారుమోగిన ఇందిరా మహిళా శక్తి ప్రాంగణంలో తెలంగాణ చరిత్ర, పోరాటాలకు చెందిన కళారూపాలు, నృత్య ప్రదర్శనలు ఆకట్టుకున్నాయి. మహిళా సంఘాలు ఏర్పాటు చేసిన స్టాల్స్ ను మంత్రి సీతక్క స్వయంగా స్టాల్స్‌ను సందర్శించి మహిళలతో మాట్లాడి ఉత్పత్తులను కొనుగోలు చేశారు. సరస్ మేళా ప్రారంభోత్సవంలో మాట్లాడుతూ మంత్రి సీతక్క హైటెక్ సిటీ వంటి విలువైన ప్రదేశాన్ని గ్రామీణ మహిళల చేతివృత్తులు, ఉత్పత్తుల ప్రదర్శన కోసం కేటాయించిన ముఖ్యమంత్రికి కృతజ్ఞతలు తెలిపారు. రాష్ట్ర అభివృద్ధిలో మహిళలకు భాగస్వామ్యం కల్పించడం తమ సంకల్పమని చెప్పారు. ఇందిరా మహిళా శక్తి పథకం ద్వారా మహిళల్లో ఆత్మవిశ్వాసాన్ని పెంపొందించి, ఆర్థికంగా నిలదొక్కుకునేలా ప్రభుత్వం చేస్తున్న కృషిని వివరించారు. ప్రతి మహిళను కోటీశ్వరురాలిని చేయాలనే లక్ష్యంతో ముందుకు సాగుతున్నామని, ఇప్పటివరకు బ్యాంకుల ద్వారా మహిళా సంఘాలకు రూ. 27 వేల కోట్ల రుణాలను సమకూర్చినట్లు వెల్లడించారు. మహిళలు బ్యాంకుల నుంచి తాము తీసుకున్న రుణాలను 98 శాతం రీపేమెంట్ చేస్తున్నారని, అందువల్ల బ్యాంకులు మరింత ఉత్సాహంగా సహకరిస్తున్నాయని మంత్రి తెలిపారు. చిరు వ్యాపారాలతో ప్రారంభమైన మహిళా శక్తి ఇప్పుడు పెద్ద వ్యాపారాల్లో అడుగుపెడుతోందని, నారాయణపేటలో మహిళా సమాఖ్య విజయవంతంగా పెట్రోల్ బంకును నడుపుతోందని, ఆరు నెలల్లో రూ. 13.7 లక్షల ఆదాయం సంపాదించిందని పేర్కొన్నారు. సోలార్ పవర్ ప్రాజెక్టులు, పలు వ్యాపారాలను మహిళా సంఘాలకు అప్పగిస్తున్నామని, మహిళలు సంతోషంగా ఉంటే కుటుంబం, సమాజం సంతోషంగా ఉంటుందని అన్నారు. మహిళలకు అవకాశాలు కల్పిస్తే వారు ఆకాశాన్ని చీల్చి అంతరిక్షంలోకి వెళ్ళగలరని నిరూపించారని గుర్తుచేసిన మంత్రి, మహిళలు ఆర్థికంగా బలపడేలా ప్రభుత్వం అన్ని విధాల సహకరిస్తుందని హామీ ఇచ్చారు. బ్యాంక్స్ రుణాల ద్వారా వడ్డీ వ్యాపారుల దోపిడీని అడ్డుకున్నామని, మహిళా సంఘాలు క్రమశిక్షణ, నమ్మకానికి ప్రతీకలుగా నిలుస్తున్నాయని చెప్పారు. ఇందిరమ్మ మహిళా శక్తి పథకం ద్వారా గ్రామీణ ప్రాంతాల్లో పేదరిక నిర్మూలన లక్ష్యమని, హైటెక్ సిటీ ప్రాంగణంలో విజయవంతమైన ఈ ప్రయత్నం తరహాలోనే హైదరాబాద్‌లో మరికొన్ని ప్రదేశాలను కూడా మహిళా సంఘాల ఉత్పత్తుల ప్రదర్శనకు కేటాయిస్తామని తెలిపారు. ప్రభుత్వం అందిస్తున్న సహాయాన్ని సద్వినియోగం చేసుకొని మహిళలు కోటీశ్వరులుగా ఎదగాలని పిలుపునిచ్చిన మంత్రి సీతక్క, ఈ సందర్భంగా మహిళా సంఘాలకు లోన్లు సులభంగా అందజేస్తున్న పలువురు బ్యాంకర్లను సన్మానించారు. ఈనెల 29 వరకు సరస్ మేళా కొనసాగనుంది. ఈ మేళాలో తెలంగాణతో పాటు ఇతర రాష్ట్రాలకు చెందిన గ్రామీణ మహిళ స్వయం సహాయక సంఘాల చేతి వృత్తులు, వంటకాలు, సహజ సిద్ధమైన వస్తువులు లభించనున్నాయి.









# మహిళ సాధికారతకు పెద్దపీఠ

## మహిళలకు ఉచిత నైపుణ్య శిక్షణతోపాటు వారి వ్యాపారాలకు వడ్డీ లేని రుణాలు

## కూకట్పల్లి మహిళా ప్రాంగణంలో ట్రైనింగ్ సెంటర్ ను ప్రారంభించిన మంత్రి సీతక్క



**హైదరాబాద్ వెలుతురు సెప్టెంబర్ 19 :**

కూకట్పల్లి దుర్గాబాయి మహిళా శిశువికాస మహిళా ప్రాంగణంలో మహిళా ట్రైనింగ్ సెంటర్‌ను రాష్ట్ర పంచాయతీరాజ్ గ్రామీణ అభివృద్ధి, మహిళా శిశు సంక్షేమ శాఖ మంత్రి డా. దానసరి అనసూయ సీతక్క ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో స్థానిక ఎమ్మెల్యే అరికెపూడి గాంధీ, ఉమెన్ కార్పొరేషన్ చైర్‌పర్సన్ బండ్రు శోభారాణి, మహిళా సంక్షేమ శాఖ సెక్రటరీ సీతారామ చంద్రన్, ఉమెన్ కార్పొరేషన్ ఎండి చంద్రకాంత్ రెడ్డి, అల్విన్ కార్పొరేటర్ వెంకటేష్ గౌడ్ తదితరులు పాల్గొన్నారు. లైట్ హౌస్ సంస్థ ఆధ్వర్యంలో ప్రారంభమైన ఈ ట్రైనింగ్ సెంటర్‌లో గృహిణుల కోసం కంప్యూటర్ కోర్సులు, బ్యూటీషియన్, ఫ్యాషన్ డిజైనింగ్, స్పోకెన్ ఇంగ్లీష్, కుట్టుమిషన్, ఉపాధి కల్పన తరగతులు వంటి పలు నైపుణ్య శిక్షణ కార్యక్రమాలు నిర్వహిస్తున్నారు. MOWO సంస్థ ఆధ్వర్యంలో టు వీలర్, త్రీ వీలర్ డ్రైవింగ్ శిక్షణ పూర్తి చేసుకున్న మహిళలకి సర్టిఫికెట్లు అందజేశారు. ఈ సందర్భంగా మంత్రి సీతక్క మాట్లాడుతూ, "ప్రతి మహిళ మహారాణి కావాలంటే ఆర్థిక స్వావలంబన అవసరం. చేతిలో డబ్బు ఉన్నప్పుడే మహిళలకు స్వేచ్ఛ, గౌరవం లభిస్తుంది. కుటుంబాభివృద్ధి, పిల్లలకు మంచి విద్య అందించాలంటే మహిళలు ఆర్థికంగా బలపడాలి" అన్నారు. కూకట్పల్లి మహిళా ప్రాంగణంలో ఉచిత శిక్షణతో పాటు రవాణా సౌకర్యం కల్పిస్తున్నామని, మహిళలు దీన్ని సద్వినియోగం చేసుకోవాలని పిలుపునిచ్చారు. డ్రైవింగ్ శిక్షణ పూర్తి చేసుకున్న మహిళల గ్రీన్ ఆటోలను జెండా ఊపి ప్రారంభించిన ఆమె, టు వీలర్, త్రీ వీలర్ ట్రైనింగ్ పూర్తి చేసిన మహిళలకు సర్టిఫికెట్లు అందజేశారు. శిక్షణ పూర్తయ్యాక వడ్డీ లేని రుణాలు అందిరేందుకు ప్రభుత్వం కృషి చేస్తోందని మంత్రి తెలిపారు. మహిళా సంఘాల ద్వారా సోలార్ విద్యుత్ ఉత్పత్తి కేంద్రాలు, మహిళా శక్తి క్యాంటీన్లు, ఆర్టీసీ సేవల నిర్వహణ వంటి అవకాశాలను కల్పిస్తున్నామని, కోటి మంది మహిళలను కోటీశ్వరులుగా తీర్చిదిద్దడమే సీఎం రేవంత్ రెడ్డి లక్ష్యమని మంత్రి సీతక్క అన్నారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే అరికెపూడి గాంధీ మాట్లాడుతూ, "మహిళా సాధికారతకు తెలంగాణ ప్రభుత్వం పెద్దపీట వేస్తోంది. శేర్లింగంపల్లి నియోజకవర్గంలో ఉన్న ఐటి కంపెనీల సిఎస్ఆర్ నిధులను మహిళా శిక్షణ కార్యక్రమాలకు వినియోగించేలా చర్యలు తీసుకుంటాం. అలాగే, ప్రభుత్వ పాఠశాలల విద్యార్థుల యూనిఫాంలు కుట్టే అవకాశాన్ని కూకట్పల్లి మహిళా ప్రాంగణానికి అప్పగిస్తాం" అని తెలిపారు. ఈ కార్యక్రమంలో పాల్గొన్న మహిళలు ఉచిత శిక్షణ సౌకర్యాలు అందిస్తున్నందుకు ప్రభుత్వం పట్ల కృతజ్ఞతలు తెలిపారు.











# మిల్లెట్లలోనే ఆరోగ్యం, భవిష్యత్తు

## సహజ సిద్ధమైన ఆహారంతో అనారోగ్యం దరిచేరదు

## లయోలా అకాడమీ మిల్లెట్ ఫెస్టివల్ ప్రారంభ కార్యక్రమంలో మంత్రి సీతక్క







**హైదరాబాద్, అల్వాల్ వెలుతురు సెప్టెంబర్ 19:**
అల్వాల్‌లోని లయోలా అకాడమీలో నిర్వహించిన మిల్లెట్ ఫెస్టివల్‌కు పంచాయతీరాజ్ గ్రామీణ అభివృద్ధి మహిళా శిశు సంక్షేమ శాఖ మంత్రి డా. దనసరి అనసూయ సీతక్క ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ కార్యక్రమంలో మల్కాజిగిరి ఎమ్మెల్యే మర్రి రాజశేఖర్ రెడ్డి, ఇండియన్ ఇన్స్టిట్యూట్ ఆఫ్ మిల్లెట్ రీసెర్చ్‌కు చెందిన సైంటిస్ట్‌లు, పెద్ద ఎత్తున విద్యార్థులు పాల్గొన్నారు. మంత్రి సీతక్క శుక్రవారం నాడు మిల్లెట్ ఫెస్టివల్‌ను ప్రారంభించి, ఏర్పాటు చేసిన స్టాళ్లను సందర్శించారు. విద్యార్థులు తయారు చేసిన మిల్లెట్ వంటకాలను రుచి చూశారు. ఈ సందర్భంగా మంత్రి సీతక్క మాట్లాడుతూ మిల్లెట్లు అధిక పోషక విలువలతో ఆకలి తీర్చడమే కాకుండా ఆరోగ్యాన్ని కాపాడుతాయని చెప్పారు. ఒకప్పుడు అనాగరిక, ఆటవిక ఆహారంగా పరిగణించిన మిల్లెట్లు నేడు స్టార్ హెూటల్స్‌లో లభించడం గర్వకారణమని తెలిపారు. ఈ తరం మిల్లెట్ ఆహారాన్ని తప్పనిసరిగా ప్రోత్సహించాలని పిలుపునిచ్చారు. తాను మిల్లెట్ ఆహారం తీసుకోవడం వల్ల ఎలాంటి వ్యాధులు రాలేదని, రాజకీయ ఒత్తిడుల వల్లే బీపీ, షుగర్ సమస్యలు వచ్చాయని, వాటి కోసం తప్ప దేనికి మందులు మాత్రలు తీసుకొనని వ్యాఖ్యానించారు. ఆదివాసి సమాజం సహజ సిద్ధమైన ఆహారం, స్వంత జ్ఞానంతోనే బతుకుతుందని, తాను ఎప్పుడూ శారీరక శ్రమకు వెనకాడనందువల్లే కరోనా సమయంలో వందరోజులు సేవలు చేసినా తనకు ఏ సమస్య రాలేదని ఆమె గుర్తు చేశారు. అమ్మాయిలు ఆరోగ్యంపై శ్రద్ధ వహించి, కష్టపడి చదువుకొని తల్లిదండ్రులు గర్వించేలా ఎదగాలని సూచించారు. విద్య ద్వారానే గౌరవం లభిస్తుందని, వివక్ష లేకుండా అన్ని రంగాల్లో అమ్మాయిలను ప్రోత్సహించాల్సిన అవసరం ఉందని మంత్రి సీతక్క పేర్కొన్నారు. కష్టపడి ప్రయత్నిస్తే విజయాలు సాధ్యమవుతాయని, తానే దానికి ప్రత్యక్ష ఉదాహరణనని ఆమె విద్యార్థులకు ప్రేరణ కలిగించారు. ములుగులో ఓటమిని ఎదుర్కొన్నా తరువాతి ఎన్నికల్లో విజయం సాధించి నేడు మంత్రిగా సేవలందిస్తున్నానని ఆమె గుర్తు చేశారు. "మనుషులు శాశ్వతం కాదు, కానీ మనం చేసే మంచి పనులే శాశ్వతం. కాబట్టి శ్రమను, ఎదుటివారిని గౌరవించాలి" అని విద్యార్థులను ఉత్సాహపరిచారు. విద్యాసంస్థలు, విద్యార్థులు ఆదివాసి గ్రామాలను సందర్శించి ప్రజలతో మమేకమై సమాజాన్ని అధ్యయనం చేయాలని మంత్రి సీతక్క సూచించారు.







వెలుతురు

cinema

## కాంతార చాప్టర్-1 ముహూర్తం ఫిక్స్

కన్నడ నుంచి రాబోతున్న ప్రెస్టీజియస్ ప్రాజెక్ట్‌లలో 'కాంతార: చాప్టర్ 1' ఒకటి. కన్నడ నటుడు, దర్శకుడు రిషబ్ శెట్టి స్వీయ దర్శకత్వంలో రాబోతున్న ఈ చిత్రం కాంతార సినిమాకు ప్రీక్వెల్‌గా వస్తుంది. ఈ సినిమాని హెూంబలే ఫిల్మ్స్ నిర్మిస్తుండగా.. రుక్మిణి వసంత్ కథానాయికగా నటిస్తుంది. వరల్డ్‌వైడ్‌గా అక్టోబర్ 02 ఈ చిత్రం ప్రేక్షకుల ముందుకు రాబోతున్న విషయం తెలిసిందే. ఈ సందర్భంగా ప్రమోషన్స్ మొదలుపెట్టారు మేకర్స్. ఇందులో భాగంగానే తాజాగా ట్రైలర్ అప్‌డేట్‌ను పంచుకుంది చిత్రయూనిట్. ఈ సినిమా ట్రైలర్‌ను సెప్టెంబర్ 22న మధ్యాహ్నం 12.45 గంటలకు విడుదల చేయనున్నట్లు తెలిపింది. దాదాపు రూ. 400 కోట్ల బడ్జెట్‌తో తెరకెక్కిన ఈ చిత్రం తెలుగుతో పాటు తమిళం, మలయాళం, కన్నడ భాషల్లో విడుదల కాబోతుంది.






## కుర్రకారులకు హీటెక్కిస్తున్న అనుపమ పరమేశ్వరన్

అందాల ముద్దుగుమ్మ అనుపమ పరమేశ్వరన్ గురించి ప్రత్యేకంగా చెప్పాల్సిన పని లేదు. సింపుల్‌గా కనిపిస్తూనే కుర్రకారు మనసుదోచేస్తుంది ఈ బ్యూటీ. తాజాగా ఈ అమ్మడు చుడీదార్‌లో తన అంద చందాలతో మతి పోగొడుతుంది. మరి మీరు కూడా ఆఫొటోస్ పై ఓ లుక్ వేయండి. బ్యూటీ అనుపమ పరమేశ్వరన్ గురించి ఎంత చెప్పినా తక్కువే. ఈ అమ్మడు తన నటనతో మంచి గుర్తింపు తెచ్చుకుంది. రీసెంట్‌గా రెండు సినిమాలతో ఆడియన్స్ ముందుకు వచ్చింది. అందులో ఒకటి డిజాస్టర్ అయినా మరో మూవీ బ్లాక్ బస్టర్ హిట్ అందుకుంది. దీంతో ఈ బ్యూటీ కెరీర్ మరింత ఫామ్‌లోకి వచ్చిందనే చెప్పాలి. ప్రేమమ్ మూవీతో తెలుగు వెండితెరకు పరిచయమైన చిన్నది అనుపమ పరమేశ్వరన్, ఈ అమ్మడు మొదటి సినిమాతో మంచి ఫేమ్ తెచ్చుకుంది. దీంతో వరసగా ఆఫర్స్ అందుకుంటూ, టాలీవుడ్ క్రేజీ హీరోయిన్‌గా తన సత్తా చాటుతుంది. రీసెంట్‌గా పరదా మూవీతో తెలుగు అభిమానులను పలకరించింది ఈ బ్యూటీ కానీ ఈ మూవీ బాక్సాఫీస్ వద్ద డిజాస్టర్‌గా నిలిచింది. కానీ కిష్కింధపురి సినిమాతో బ్లాక్ బస్టర్ ఖాతాలో వేసుకొంది. ఈ అమ్మడు డీజే టిల్లు స్క్వేర్ మూవీతో మంచి ఫాన్ ఫాలోయింగ్ సంపాదించుకుంది. ఈ మూవీలో ఈ అమ్మడు గ్లామర్‌కు ప్రతి ఒక్కరూ ఫిదా అయ్యారు.దీంతో ఈ మూవీ తర్వాత వరసగా ఆఫర్స్ అందుకుంటూ బ్లాక్ బస్టర్స్ హిట్స్ తన ఖాతాలో వేసుకుంటుంది. సక్సెస్ జోష్‌లో ఉన్న ఈ చిన్నది తాజాగా చుడీదార్‌లో తన అంద చందాలతో అందరి మనసు దోచేస్తూ నెట్టింట హల్ చల్ చేస్తుంది.

## దమ్మురేపుతున్న శాన్వీ శ్రీవాస్తవ



ఈ బ్యూటీ చేసింది తెలుగులో నాలుగు సినిమాలే.. తొలి సినిమాతోనే మంచి విజయాన్ని అందుకుంది. ఆతర్వాత వరుసగా సినిమాలు చేసింది. కొన్ని సినిమాల్లో తన అందంతో ప్రేక్షకులను కవ్వించింది. కానీ చేసిన సినిమాల్లో మొదటి సినిమా తప్ప మిగిలినవి అన్ని ఫ్లాప్ అయ్యాయి. దాంతో ఆమె తెలుగు సినిమాలకు పూర్తిగా దూరం అయ్యింది. ఇంతరభాషల్లో సినిమాలు చేస్తుంది. కానీ అక్కడ కూడా స్టార్ గా ఎదగలేకపోయింది. లవ్లీ సినిమా గుర్తుందా.? ఆది సాయి కుమార్ హీరోగా నటించిన ఈ సినిమాకు బీఏ జయ దర్శకత్వం వహించారు. ఈ సినిమా మంచి విజయాన్ని అందుకుంది. ఈ సినిమాలో హీరోయిన్ గా నటించింది శాన్వీ శ్రీవాస్తవ. తొలి సినిమాతోనే తన క్యూట్ పర్ఫామెన్స్ తో కవ్వించింది. ఆతర్వాత ఈ బ్యూటీకి వరుస ఆఫర్స్ వచ్చాయి. సుశాంత్ అడ్డా, మంచు విష్ణు రౌడీ, మరోసారి ఆదితో ప్యార్ మే పడిపోయానే సినిమాల్లో నటించింది. కానీ అవేమి వర్కౌట్ కాలేదు. దాంతో కన్నడ ఇండస్ట్రీకి వెళ్ళింది. అక్కడ కాస్త పర్లేదు అనిపించుకుంది. ఆ మధ్య అతడే శ్రీమన్నారాయణ డబ్బింగ్ మూవీతో మరోసారి తెలుగు ప్రేక్షకులను పలకరించింది. ఆ సమయంలో శాన్వీ మాట్లాడుతూ తెలుగులో అవకాశాలు రావడం లేదు అని కన్నీళ్లు పెట్టుకుంది. తనకు ఎందుకు ఛాన్స్ లు రాలేదో అర్ధం కావడం లేదు అని స్టేజ్ పైనే కన్నీళు పెట్టుకుంది ఈ ముద్దుగుమ్మ. ఇక ఇప్పుడు కన్నడలోనే సినిమాలు చేస్తుంది. అక్కడ కూడా ప్రస్తుతం శాన్వీ శ్రీవాస్తవకు చెప్పుకోదగ్గ సినిమాలు రావడం లేదు. సోషల్ మీడియాతోనే ఈ చిన్నది కాలం గడిపేస్తుంది. ఓ రేంజ్ లో అందాలు ఆరబోస్తూ అభిమానులను ఆకట్టుకుంటుంది.

## ఎన్ని ఏమైనా క్రెడిట్ మాత్రం అరవింద్‌కే : బండ్ల గణేశ్

చిన్న సినిమాగా వచ్చి టాలీవుడ్‌లో సూపర్ హిట్ అందుకున్న చిత్రం 'లిటిల్ హార్ట్స్' ఈ చిత్రంపై టాలీవుడ్ ప్రముఖులు ప్రశంసలు కురిపిస్తున్న విషయం తెలిసిందే. యూట్యూబర్ మౌళి తనుజ్, శివానీ నాగారం ప్రధాన పాత్రల్లో నటించిన ఈ సినిమాకు సాయి మార్తండ్ దర్శకత్వం వహించగా.. ఆదిత్య హాసన్ నిర్మించారు. రాజీవ్ కనకాల, అనితా చౌదరి, సత్య కృష్ణన్ వంటి నటులు కూడా ఇందులో ముఖ్య పాత్రలు పోషించారు. ఇటీవలే ప్రేక్షకుల ముందుకు వచ్చిన ఈ చిత్రం యూత్ ఎంటర్‌టైనర్‌గా వచ్చి సూపర్‌హిట్‌ను అందుకుంది. దీంతో ఈ సినిమా సక్సెస్ మీట్‌ను గురువారం ఏర్పాటు చేశారు మేకర్స్. ఈ వేడుకకు ముఖ్య అతిథిగా విజయ్ దేవరకొండ రాగా.. బండ్ల గణేష్, అల్లు అరవింద్ ప్రత్యేక అతిథులుగా విచ్చేశారు. అయితే ఈ వేడుకలో బండ్ల గణేష్ మాట్లాడుతూ.. అల్లు అరవింద్‌పై ఆసక్తికర వ్యాఖ్యలు చేశాడు. లిటిల్ హార్ట్స్ సినిమాను ప్రమోట్ చేసి ఇంత పెద్ద హిట్ చేసింది బన్నీ వాసు, వంశీ నందిపాటి అయిన క్రెడిట్ మొత్తం అరవింద్‌కే పోతుంది. వాళ్లు ఎంత కష్టపడిని చివరికి ఇది అరవింద్ సినిమా అంటున్నారు. దాంతో క్రెడిట్ అల్లు అరవింద్‌కే వస్తుంది అంటూ ఆటపట్టించాడు బండ్ల గణేష్. ప్రస్తుతం ఇందుకు సంబంధించిన వీడియో వైరల్‌గా మారింది.



## రోబో శంకర్ మృతిపై కమల్ సంతాపం

కోలీవుడ్ చిత్ర పరిశ్రమలో విషాదం నెలకొంది. ప్రముఖ హాస్యనటుడు రోబో శంకర్ (46) కన్నుమూసిన విషయం తెలిసిందే. గత కొంతకాలంగా అనారోగ్యంతో బాధపడుతున్న ఆయన చెన్నైలోని ఒక ప్రైవేట్ ఆసుపత్రిలో చికిత్స పొందుతూ గురువారం తుదిశ్వాస విడిచారు. ఆయన మరణంతో తమిళ సినీ పరిశ్రమలో విషాదఛాయలు అలుముకున్నాయి. రోబో శంకర్ కమల్ హాసన్‌కి వీరాభిమాని. అయితే తన అభిమాని చనిపోయాడన్న వార్త తెలుసుకున్న నటుడు కమల్ హాసన్ సోషల్ మీడియా వేదికగా అతడికి నివాళులు అర్పించాడు. రోబో శంకర్.. నీ పేరులో ఉన్న రోబో ఒక ముద్దుపేరు మాత్రమే. నువ్వు నా తమ్ముడివి. నువ్వు లేని లోటు మమ్మల్ని బాధపెడుతున్నా నువ్వు మా నుంచి దూరంగా వెళ్ళిపోయావు. నీ పని పూర్తి చేసుకుని వెళ్ళిపోయావు, కానీ నా పని ఇంకా మిగిలి ఉంది. రేపటిని మాకోసం వదిలి వెళ్ళిపోయావు. కాబట్టి రేపు మనదే అంటూ కమల్ రాసుకోచ్చాడు. ఇక రోబో శంకర్ అంత్యక్రియలు శుక్రవారం చెన్నైలో జరగనున్నట్లు కుటుంబ సభ్యులు తెలిపారు. ఆయనకు భార్య ప్రియాంక, కుమార్తె ఇంద్రజ ఉన్నారు.





## రికార్డులు సృష్టిస్తున్న మిరాయ్

యంగ్ హీరో తేజ సజ్జా నటించిన మిరాయ్ బాక్సాఫీస్ వద్ద దూసుకుపోతోంది. కార్తీక్ ఘట్టమనేని దర్శకత్వంలో తెరకెక్కిన ఈ చిత్రంలో రితికా నాయక్ హీరోయిన్‌గా, మంచు మనోజ్ శక్తివంతమైన విలన్‌గా నటించారు. సెప్టెంబర్ 12న ప్రపంచవ్యాప్తంగా విడుదలైన ఈ సినిమా కేవలం ఐదు రోజుల్లోనే 100 కోట్ల మార్క్ దాటగా, 7 రోజుల్లో రూ.112.10 కోట్ల గ్రాస్ వసూళ్లు సాధించినట్లు పీపుల్స్ మీడియా ఫ్యాక్టరీ అధికారికంగా ప్రకటించింది. ఈ విషయాన్ని సోషల్ మీడియాలో స్పెషల్ పోస్టర్ ద్వారా షేర్ చేశారు. తెలుగు సినీ రంగంలో కొత్త ప్రయోగాలకు ఎప్పుడూ ఆదరణ లభిస్తూనే ఉంటుంది. మంచి కంటెంట్‌తో వస్తే హీరో ఎవరన్నది పట్టించుకోకుండా హిట్ చేస్తామని ప్రేక్షకులు మరోసారి నిరూపించారు. అందుకు ప్రత్యక్ష ఉదాహరణే 'మిరాయ్'. తేజ సజ్జా హీరోగా, మంచు మనోజ్ శక్తివంతమైన విలన్ పాత్రలో నటించిన ఈ చిత్రం వసూళ్ల పరంగా మాత్రమే కాకుండా, కంటెంట్ పరంగా కూడా ప్రశంసలు అందుకుంది. సైన్స్ ఫిక్షన్, యాక్షన్, భావోద్వేగాల మేళవింపుగా సాగే ఈ కథలో 'మహాబీర్ లామా' పాత్రలో మంచు మనోజ్ కొత్తగా కనిపించగా తేజ సజ్జా మరోసారి తన నటనతో యూత్ ప్రేక్షకులను ఆకట్టుకున్నాడు. దర్శకుడు కార్తీక్ ఘట్టమనేని విజువల్స్, కథనం, టెక్నికల్ ప్రెజెంటేషన్‌తో కొత్త రేంజ్‌లో సినిమాను తీర్చిదిద్దాడు. వీఎఫ్ఎక్స్ వర్క్, యాక్షన్ సీక్వెన్సులు హాలీవుడ్ స్థాయిలో ఉండటంతో ప్రేక్షకులు వెండితెరపై మళ్లీ మళ్లీ చూసేందుకు ఆసక్తి చూపిస్తున్నారు. నిర్మాత టీజీ విశ్వప్రసాద్ భారీ బడ్జెట్‌తో రాజీ లేకుండా ఈ చిత్రాన్ని నిర్మించారు. ఇందులో రితికా నాయక్ , శ్రియా చరణ్, జగపతిబాబు తదితరులు కీలక పాత్రల్లో నటించారు.



# ఫ్రీ మార్కెట్ అభూత కల్పన

**- ఇబ్బడిముబ్బడి దిగుబడులతో నష్టాలు**

**- ఆంక్షలు విధించుకుంటేనే పురోగతి**



**న్యూఢిల్లీ,సెప్టెంబర్19( వెలుతురు):**
ఈ ఆధునిక ఆర్థిక వ్యవస్థలో రైతుల సమస్యలు మరింత జఠిలం అవుతున్నాయే తప్ప పరిష్కారం కావడం లేదు. కేంద్ర,రాష్ట్ర ప్రభుత్వాలకు స్పష్టమైన వ్యవసాయిక విధానం లేకపోవడం రైతుల పాలిట శాపంగా మారిపోయింది. యూరియా కొరతతో రైతులు ఎంతగా ఇబ్బందులు పడుతున్నారో చూస్తున్నాం. ఇదంతాదూరదృష్టి లోపంగానే చూడాలి. ఫ్రీ మార్కెట్ అనేది ఒక అభూత కల్పన మాత్రమే అయ్యింది. దేశ ఆర్థిక వ్యవస్థ 8నుంచి 9శాతం వరకూ వృద్ధి జరుగుతున్న ప్పటికీ, వ్యవసాయ ఉత్పత్తులు పెరుగుతన్నా రైతుల ఆర్థిక వ్యవస్థ మాత్రం బాగుపడడం లేదు. అవసరం లేకున్నా ఇబ్బడి ముబ్బడిగా ఆహారధాన్యాలను దిగుమతి చేసుకోవడం కూడా రైతులకు శాపంగా మారింది. కల్తీలు కూడా రైతును కాటేస్తున్నాయి. సస్యవిప్లవానికి నాంది పలికేలా కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు చర్యలకు పూనుకోవాల్సిన తరుణమిదేనని వ్యవసాయరంగ నిపుణులు అభిప్రాయ పడుతున్నారు. ప్రజలంతా మళ్లీ ఉపాధి వదులకుని గ్రామాలకు తరలారని, వారిని ఆదరించి వ్యవసాయం వైపు మళ్లించాలని అన్నారు. అలా చేయడం వల్ల వ్యవసాయంరంగం అతిపెద్ద ఉత్పాదక రంగంగా మారగలదని అన్నారు. ఫుడ్ ప్రాసెసింగ్ యూనిట్లు పెంచితే మంచిదని అంటున్నారు. తెలంగాణలో ఇలాంటి యూనిట్లు పెట్టేవారిని ప్రోత్సహిం చాలని ప్రభుత్వం నిర్ణయించింది. బహుళజాతి కంపెనీలకూ ఎర్ర తివాచీలు పరుస్తున్న ప్రభుత్వాలు రైతులను అనుత్పాదక రంగాలుగా చూస్తున్న తీరు దారుణం కాక మరోటి కాదు. రైతులను ఓటు బ్యాంకుగా చూడకుండా మనకు పట్టెడు అన్నం పెట్టే తల్లిగా చూసుకోవాలి. ఇకపోతే విదేశాల నుంచి నూనెల దిగుమతి వేరుశనగ రైతులకు శరాఘాతంగా మారింది. పంటల విధానంలో శాస్త్రీయ దృక్పథం లోపించడం, సేంద్రియ ఎరువుల బదులు రసాయన ఎరువులు వాడడం వల్ల భూమీ సారం తగ్గుతోంది. ఏ పంట పండించినా గిట్టుబాటు ధరలు లభించడం లేదు. దీనికి తాజా ఉదాహరణ కంది, మిర్చి పంటలే. రైతులని కాపాడుకుని, వ్యవసాయాన్ని పండగ చేస్తామంటున్న ప్రభుత్వాలు ఆ దిశగా అడుగులు వేయాలి. చిత్తశుద్ధితో పనిచేసే వ్యవస్థను రూపొందించాలి. మన అసవరాలకు సరిపడా కందులు, మిరప, ఇతర పంటలను రైతులు చెమటోడ్చి పండించినా వాటిని కొనుగోలు చేయడం లేదు. ఇతర దేశాల నుంచి ఆహార ధాన్యాల దిగుబడి తక్షణం ఆగిపోవాలని అన్నారు. అప్పుడు మన అసవరాలకు అనగుణంగా పంటల విధానం వస్తుందని అన్నారు.

## కావాలనే నా దుష్ప్రచారం

- రాజగోపాల్‌రెడ్డి



**హైదరాబాద్,ఆగస్టు19( వెలుతురు):**
కొందరు కావాలనే పని కట్టుకుని నాపై దుష్ప్రచారం చేస్తున్నారని మునుగోడు ఎమ్మెల్యే కోమటిరెడ్డి రాజగోపాల్‌రెడ్డి పేర్కొన్నారు. ఇలాంటి ప్రచారాలను ఎవరూ నమ్మొద్దని, ఒకవేళ ఏ నిర్ణయమైనా తీసుకుంటే వెంటనే చెప్పే ధైర్యం తనకు ఉందని చెప్పారు. తాను ఎలాంటి రాజకీయ నిర్ణయం తీసుకోవడం లేదని, కొందరు కావాలనే తన ప్రతిష్టను దెబ్బతీయడానికి దుష్ప్రచారం చేస్తున్నారని చెప్పారు. ఒక సామాజిక కార్యక్రమంలో పాల్గొనడానికి ఏపీలోని గుంటూరు వెళ్లిన ఆయన, శుక్రవారం ఉదయం విజయవాడ కనకదుర్గ అమ్మవారిని దర్శనం చేసుకున్నారు. అనంతరం మీడియాతో మాట్లాడుతూ.. తాను ఇక్కడికి బయలుదేరినప్పటి నుంచి రాజకీయంగా తనపై దుష్ప్రచారం చేస్తున్నారని మండిపడ్డారు. నేను నిన్ననే మీడియా ముందు క్లారిటీ ఇచ్చాను. కొంతమంది కావాలని నా ప్రతిష్టను దెబ్బతీయడానికి దుష్ప్రచారం చేస్తున్నారు. వాటిని ఎవరూ నమ్మొద్దు. తాను ఎలాంటి రాజకీయ నిర్ణయం తీసుకోవడం లేదు. కాంగ్రెస్ పార్టీ ప్రభుత్వం పేదలకు అండగా ఉండే కార్యక్రమాలు చేపడుతుంది. రెండు తెలుగు రాష్ట్రాల ప్రజలు అన్నదమ్ముల్లా కలిసి ఉండాలని, ఇరు రాష్ట్రాలు సుభిక్షంగా ఉండి అభివృద్ధి పథంలో దూసుకుపోవాలని అమ్మవారిని ప్రార్థించానని చెప్పారు.

## వేధింపులు తట్టుకోలేక భర్తపై భార్య దాడి

- చికిత్స పొందుతూ మృతి

**హైదరాబాద్,ఆగస్టు19( వెలుతురు):**
క్షణికావేశంతో భార్యభర్తల మధ్య జరిగిన గొడవలతో దాడులు చేసుకోవడంతో ప్రాణాలు వదులుతున్నారు. ఈనేపథ్యంలో నగరంలోని కోకాపేట్‌లో దారుణ ఘటన చోటుచేసుకుంది. భర్తపై భార్య కూరగాయల కత్తితో దాడి చేసి చంపేసింది. బతకుతెరువు కోసం కోసం దంపతులు కృష్ణ జ్యోతి బోరా, భరత్ బోరా అస్సాం నుంచి హైదరాబాద్‌కు వచ్చారు. కొకాపేట్‌లో కార్మికులుగా పని చేస్తూ జీవనం సాగిస్తున్నారు. అయితే కొంతకాలంగా భార్య కృష్ణ జ్యోతిని భర్త వేధింపులకు గురిచేస్తూ ఉన్నాడు. ఇదే క్రమంలో గత అర్ధరాత్రి కూడా చిన్న విషయానికి భార్యాభర్తలు వాగ్వాదానికి దిగారు. చివరకు భర్త వేధింపులు తాళలేక విచక్షణ కోల్పోయిన భార్య.. అతడిపై కత్తితో దాడి చేసింది. దీంతో అతడు అపస్మారకస్థితిలోకి వెళ్లిపోయాడు. భరత్ కేకలు విన్న స్థానికులు లోపలికి వచ్చి చూడగా భర్త రక్తపుమడుగులో పడి ఉన్నాడు. వెంటనే భరత్‌ను హుటాహుటిన ఆస్పత్రికి తరలించగా... చికిత్స పొందుతూ మృతిచెందాడు. విషయం తెలిసిన వెంటనే నార్సింగ్ పోలీసులు అక్కడకు చేరుకుని నిందితురాలిని అరెస్ట్ చేశారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు.

## ఔట్‌సోర్సింగ్ ఉద్యోగి ఆత్మహత్యాయత్నం

**సూర్యాపేట, ఆగస్టు19( వెలుతురు):**
ఓ ఔట్ సోర్సింగ్ ఉద్యోగి ఆత్మహత్యాయత్యానికి పాల్పడిన సంఘటన సూర్యాపేట జిల్లా కేంద్రంలో చోటు చేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. మధుసూదన్ అనే వ్యక్తి సూర్యాపేట జిల్లా జనరల్ ఆస్పత్రిలో ఔట్ సోర్సింగ్ ఉద్యోగిగా గత కొన్నేండ్ల పని చేస్తున్నాడు. అయితే వీరికి రేవంత్ సర్కార్ గత ఐదు నెలల నుంచి జీతాలు చెల్లించడం లేదు. కుటుంబాన్ని పోషించడం భారంగా మారింది. ఈ క్రమంలో ఆర్థిక ఇబ్బందులు తాళలేక మధుసూదన్ పురుగుల మందు సేవించి ఆత్మహత్యాయత్నం చేశాడు. పరిస్థితి విషమించడంతో సూర్యాపేట జిల్లా కేంద్రంలోని జనరల్ ఆసుపత్రికి తరలించారు. ప్రస్తుతం బాధితుడి ఆరోగ్య పరిస్థితి నిలకడగా ఉన్నట్లు సమాచారం. సూర్యాపేట జిల్లా కేంద్రంలోని ప్రభుత్వ ఆసుపత్రిలో పనిచేస్తూ, గత 5 నెలలుగా జీతాలు లేవని భిక్షాటన చేస్తూ రోడ్డుపై నిరసన తెలిపారు ఔట్ సోర్సింగ్ ఉద్యోగులు. ఎన్నిసార్లు కలిసి సమస్యలు చెప్పినా తమ ఇబ్బందులు పట్టించుకోవడంలేదని ఉద్యోగులు ఆగ్రహం వ్యక్తం చేశారు.

# మంటకలిసిన మానవత్వం

## వృద్ధురాలి మృతదేహాన్ని అడవిలో వదిలేసిన 108 సిబ్బంది



**నాగర్‌కర్నూల్, ఆగస్టు19 ( వెలుతురు):**
సమాజంలో రోజురోజుకూ మానవత్వం మంటకలిసిపోతుంది. ఈ కోవలోనే ఓ వృద్ధురాలి మృతదేహాన్ని నట్టఅడవిలో 108 సిబ్బంది వదిలేసిన సంఘటన నాగర్‌కర్నూల్ జిల్లాలో చోటుచేసుకుంది. నాగర్ కర్నూల్ జిల్లా లింగాల మండలం ఈర్లపెంటకు చెందిన మండ్లి గురువమ్మ(29) అనే మహిళ గత పది రోజుల క్రితం అచ్చంపేట ప్రభుత్వ ఆసుపత్రికి వైద్యం కోసం వెళ్లింది. పరిస్థితి విషమించడంతో అక్కడి నుండి మహబూబ్ నగర్ ఆసుపత్రికి రెఫర్ చేశారు. అక్కడ కూడా పరిస్థితి చేయి దాటిపోవడంతో తీవ్ర అనారోగ్యంతో గురువమ్మ గురువారం సాయంత్రం మరణించింది. కాగా మృతదేహాన్ని 108 అంబులెన్స్ లో తీసుకువచ్చిన సిబ్బంది ఫరహాబాద్ చౌరస్తా వద్ద అడవిలో సాయంత్రం 6 గంటలకు వదిలి వెళ్లారు. అక్కడి నుంచి తమ స్వగ్రామమైన ఈర్లపెంటకు మృతదేహాన్ని ఎలా తీసుకువెళ్లాలి అన్నది అర్థం కాక రాత్రి అంతా మృతదేహం వద్ద రోదిస్తూ ఉండిపోయారు. ప్రభుత్వ వాహనమే కదా మా పెంటలో వదిలి పెట్టాలని వైద్య సిబ్బందిని వేడుకున్న పట్టించుకోకుండా అడవిలో వదిలిపెట్టి వెళ్ళిపోయారని చెంచులు ఆవేదన వ్యక్తం చేశారు. రాత్రి సమయంలో మేము నిద్రలో ఉండగా మృతదేహాన్ని ఇలా అడవిలో వదిలి వెళ్ళడం ఏంటని చెంచులు కుటుంబ సభ్యులు ఆరోపిస్తున్నారు. ఐటీడీఏ అధికారులకు శుక్రవారం ఉదయం నుంచి ఎన్నిసార్లు ఫోన్ చేసినా సమాధానం లేకపోవడంతో ఆటోలో మృతదేహాన్ని ఈర్లపెంటకు తీసుకెళ్లామని చెంచులు పేర్కొన్నారు.

# సీఐడీ అదుపులో ఆర్డీవో మురళి

**అమరావతి, ఆగస్టు19( వెలుతురు):**
మదనపల్లె పూర్వ ఆర్డీవో మురళిని తిరుపతి సీఐడీ అధికారులు అరెస్ట్ చేశారు. అన్నమయ్య జిల్లా మదనపల్లి సబ్ కలెక్టరేట్లో ఫైల్స్ దహనం కేసులో మురళికి సుప్రీం కోర్టు నిన్న (గురువారం) బెయిల్ రద్దు చేసిన విషయం తెలిసిందే. ఈ క్రమంలో శుక్రవారం మురళిని సీఐడీ పోలీసులు అదుపులోకి తీసుకుని తిరుపతి పద్మావతిపురంలోని సీఐడీ కార్యాలయానికి తరలించారు. రెవెన్యూ ఫైళ్ల దహనంపై దాదాపు ఆరు గంటల పాటు మురళిని సీఐడీ అధికారులు విచారించారు. అనంతరం అతడిని చిత్తూరు కోర్టుకు తరలించారు. ఈకేసులో ఏ2గా ఉన్న మురళి.. మదనపల్లె ఆర్డీవోగా ఉన్న సమయంలో ప్రభుత్వ భూముల ఫ్రీహోల్డ్‌లో అనేక అక్రమాలు చేసినట్లు సీఐడీ తేల్చింది. మొత్తం 48,360 ఎకరాల్లో, సుమారు 22,523 ఎకరాలు విధి విధానాలకు విరుద్ధంగా అక్రమంగా ఫ్రీహోల్డ్ చేసినట్లు గుర్తించింది. ప్రభుత్వ మార్పు తరువాత, ఈ అక్రమాలకు సంబంధించిన ఆధారాలను నాశనం చేయాలనే ఉద్దేశంతో ఏ1 గౌతమ్ తేజ్, ఏ3 వి. మాధవరెడ్డి, ఏ4 తుకారాంలతో కలిసి కార్యాలయానికి నిప్పు పెట్టించినట్లు విచారణలో సీఐడీ అధికారులు తేల్చారు. కాగా.. గతేడాది ఫైళ్ళ దహనం కేసులో ఏ2 నిందితుడుగా మురళిపై కేసు నమోదు అయ్యింది. ముందస్తు బెయిల్ కోసం మురళి హైకోర్టును ఆశ్రయించగా.. కోర్టు తిరస్కరించింది. దీంతో సుప్రీం కోర్టు వెళ్లి మధ్యంతర బెయిల్ పొందారు మురళి. అయితే గత జులై 8న తిరుపతిలో మురళిని సీఐడీ పోలీసులు



అరెస్ట్ చేశారు. కానీ.. సుప్రీంకోర్టు ముందస్తు బెయిల్ ఉందని వెంటనే విడుదల చేశారు. ఈ క్రమంలో తాజాగా మురళి ముందస్తు బెయిల్‌ను సుప్రీం కోర్టు రద్దు చేయడంతో.. వెంటనే అతడిని సీఐడీ పోలీసులు అరెస్ట్ చేశారు.

# టీడీపీలోకి వైసీపీ ఎమ్మెల్యే

**- సీఎం చంద్రబాబు సమక్షంలో చేరే అవకాశం**



**అమరావతి, ఆగస్టు19( వెలుతురు):**
వైసీపీ ఎమ్మెల్యే ఒక్కొక్కరూ టీడీపీ గూటికి చేరుతున్నారు. ఈనేపథ్యంలోనే ఏపీ ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు సమక్షంలో ముగ్గురు వైసీపీ ఎమ్మెల్సీలు తెలుగుదేశం పార్టీలో చేరేందుకు ముహూర్తం ఖరారైంది. శుక్రవారం ఈ ముగ్గురు ఎమ్మెల్సీలు బల్లి కళ్యాణ్ చక్రవర్తి, కర్రి పద్మశ్రీ, మర్రి రాజశేఖర్.. శుక్రవారం అమరావతిలో సీఎం చంద్రబాబు సమక్షంలో ఆ పార్టీలో చేరనున్నారు. ఈ సందర్భంగా ఈ ముగ్గురికి సీఎం చంద్రబాబు నాయుడు కండువా కప్పి.. పార్టీలోకి ఆహ్వానించనున్నారు. అయితే ఈ ముగ్గురు ఎమ్మెల్సీలు ఇప్పటికే వైసీపీతోపాటు అనుభవిస్తున్న పదవులకు సైతం రాజీనామా చేశారు. కానీ వీరి ఎమ్మెల్సీ రాజీనామాలపై శాసనమండలి చైర్మన్ ఇంకా ఎటువంటి నిర్ణయం తీసుకోలేదు. అసెంబ్లీ ఎన్నికల ఫలితాల అనంతరం వైసీపీని ఒకొక్కరుగా వీడుతున్నారు. ఆ జాబితాలో పార్టీ ప్రధాన కార్యదర్శిగా పని చేసిన విజయసాయిరెడ్డి సైతం ఉన్నారు. ఆయన ఆ పదవికే కాదు.. రాజ్యసభ సభ్యత్వానికి సైతం రాజీనామా చేశారు. అలాగే వైసీపీ నుంచి రాజ్యసభకు వెళ్లిన పలువురు ఎంపీలు సైతం పార్టీతోపాటు ఆ పదవికి సైతం గుడ్ బై చెప్పేశారు. ఆ జాబితాలో తాజాగా ఈ ముగ్గురు ఎమ్మెల్సీలు చేరారు.

# అక్రమ మైనింగ్‌పై సుప్రీం కీలకతీర్పు

**- మూడు నెలల్లో నివేదిక ఇవ్వాలని ఆదేశం**

**అమరావతి, ఆగస్టు19( వెలుతురు):**
ఓబుళాపురంలో గాలి బ్రదర్స్ అక్రమమైనింగ్‌పై సుప్రీం కోర్టు కీలక ఆదేశాలు జారీ చేసింది. మైనింగ్ సరిహద్దుల ఖరారుపై జస్టిస్ సుధాంశు ధులియా నేతృత్వంలో ప్రత్యేక కమిటీని ధర్మాసనం ఏర్పాటు చేసింది. అక్రమైనింగ్‌పై మూడు నెలల్లో నివేదిక ఇవ్వాలని ప్రత్యేక కమిటీకి సుప్రీం ధర్మాసనం ఆదేశించింది. అనంతరం తదుపరి విచారణను జనవరికి వాయిదా వేసింది సుప్రీం. గాలి బ్రదర్స్‌కు అనుకూలంగా జగన్ హయాంలో ఇచ్చిన అఫిడవిట్‌ను ఏపీ ప్రభుత్వం ఉపసంహరించుకుంది. గాలి బ్రదర్స్ మైనింగ్ చేసుకోవడానికి అనుమతించవచ్చంటూ 2022లో జగన్ ప్రభుత్వం అఫిడవిట్ దాఖలు చేసిన విషయం తెలిసిందే. సరిహద్దు వివాదం ముగిసిందని, మైనింగ్ కొనసాగించడానికి గాలి బ్రదర్స్‌కు అనుమతి ఇవ్వాలని జగన్ సర్కార్ అఫిడవిట్‌లో పేర్కొంది. దాన్ని వ్యతిరేకిస్తూ సుప్రీంకోర్టులో అమెకస్ క్యూరీ అఫిడవిట్ దాఖలు చేశారు. ఈ నేపథ్యంలో అమెకస్ క్యూరీ నివేదికను పరిగణలోకి తీసుకొని జగన్ ప్రభుత్వం దాఖలు చేసిన అఫిడవిట్‌ను ఉపసంహరించుకుంటున్నట్లు కోర్టుకు సీనియర్ కౌన్సిల్ సిద్ధార్థ లూత్రా, గుంటూరు ప్రమోద్ కుమార్ తెలిపారు. ఏపీ, కర్నాటక సరిహద్దుల మధ్య వివాదాన్ని తనకు అనుకూలంగా మలుచుకొని అక్రమంగా వేలాది టన్నులు ఇనుప ఖనిజాన్ని తవ్వి ఎగుమతి చేశారు గాలి బ్రదర్స్. ఈ క్రమంలో గాలి బ్రదర్స్‌కు వ్యతిరేకంగా గతంలో ఏపీ ప్రభుత్వం పిటీషన్ దాఖలు చేసింది. ఈ పిటీషన్‌పై గత 15 ఏళ్లుగా సుప్రీంలో విచారణ కొనసాగుతోంది.

# ప్రభుత్వరంగ సంస్థల అమ్మకంతో దెబ్బ

**- ఉపాధిరంగాలపై తీవ్ర ప్రభావం**




**ముంబై,సెప్టెంబర్19( వెలుతురు):**
ఇప్పట్లో మన ఆర్థిక వ్యవస్థ పుంజుకునేలా కానరావడం లేదు. ప్రధానంగా నిరుద్యోగ సమస్య తీవ్రం అవుతున్నా... అందుకు తగగిన చర్యలు తీసుకోవడం లేదు. దీనికితోడు ప్రభుత్వం రంగ సంస్థలను అప్పనంగా అమ్మేయడంతో ఈ సమసయమరితం తీవ్రం కాబోతున్నదన్న భయాలు వస్తున్నాయి. అయినా మోడీ ప్రభుత్వం ఎక్కడా తగ్గడం లేదు. దీంతో కార్పోరేట్లు మరింత బలపడుతున్నారు. దేశీయంగా ఉపాధి అవకాశాలు పెంచుకుంటూ..ఉత్పత్తి రంగాలకు ఊతమిచ్చేలా సాగాల్సిన ఆలోచన చేయడం లేదు. ఇప్పటికే రెండుకోట్ల మందికి ఉపాధి గల్లంతయ్యిందన్న వార్తలు వస్తున్నా అది అంతకుమించి ఉంటుందని అంటున్నారు. కరోనాకు ముందే మన ఆర్థిక వ్యవస్థ అంతంత మాత్రంగా ఉంది. వస్తూత్పత్తి పెరిగినా.. ధరల పోటు తప్పలేదు. నిత్యావసర ధరలు విపరీతంగా పెరగడంతో జీవన శైలిపై తీవ్ర ప్రభావం చూపు తోంది. దేశంలో ఆటోమొబైల్ రంగ క్షీణత అన్నది నిరుద్యోగాన్ని పెంచే చర్యగా చూడాల్సి ఉంది. కంపెనీలు అమ్మకాలు లేకుండా మూతపడితే నష్టమని గుర్తుంచుకోవాలన్నారు. ఆర్థిక పునరుత్తేజానికి, వృద్ధిరేటును పెంచడానికి నవతరం సంస్కరణలు అవసరమని తెలిపారు. విద్యుత్తు, బ్యాంకింగేతర ఆర్థిక సంస్థ (ఎన్‌బీఎఫ్‌సీ)ల రంగాల సమస్యలు సత్వరం పరిష్కరించాల్సి ఉందని, ప్రైవేటు పెట్టుబడులు పెరిగేందుకు సరికొత్త సంస్కరణలు అవసరమని తెలిపారు. ప్రైవేటురంగ విశ్లేషకుల నుంచి వృద్ధిరేటు అంచనాలు వేర్వేరుగా ఉంటున్నాయని, వీటిల్లో చాలావరకు ప్రభుత్వ అంచనాల కంటే తక్కువగా ఉంటున్నాయని అప్పట్లో పదేపదే ఆర్‌బిఐ మాజీ గవర్నర్ రఘురామరాజన్ గుర్తు చేశారు. ఆర్థిక వ్యవస్థ మందగమనం తీవ్ర ఆందోళనకరమని, పరిష్కారానికి నూతన సంస్కరణలు అవసరమని రిజర్వ్ బ్యాంక్ ఆఫ్ ఇండియా పూర్వ గవర్నర్ రఘురామ్ రాజన్ అప్పట్లో చేసిన హెచ్చరికలు పట్టించుకోలేదు. మొత్తం మీద ఆర్థిక వ్యవస్థ మందగమనం తీవ్ర ఆందోళనకరమని అన్నారు. వివిధ రంగాలు ఇబ్బంది పడుతున్నా, వాహన రంగం మాత్రం రెండు దశాబ్దాల్లోనే ఎన్నడూ లేనంత సంక్షోభాన్ని ఎదుర్కొంటున్న సంగతి విదితమే. వాహన, అనుబంధ రంగాల్లో వేలసంఖ్యలో ఉద్యోగాలు తొలగిస్తున్నారని, స్థిరాస్తి రంగంలో అమ్ముడుకాకుండా నిర్మాణాలు భారీగా మిగిలిపోతున్నాయని, ఎఫ్‌ఎంసీజీ రంగంలో విక్రయాలు తగ్గుతున్నాయనే ఆందోళనలు పెరుగుతున్నాయి. ఆయా రంగాల నుంచి ఉద్దీపనల కోసం విజ్ఞప్తులు అధికమవుతు న్నాయని రాజన్ గుర్తు చేశారు. ప్రస్తుతం కంటే వృద్ధిరేటును మరో 2-3 శాతం పెంచాలంటే, ఏ విధంగా దేశాన్ని ముందుకు నడిపించాలనే విషయంపై అవగాహన ఉండాలి. విద్యుత్తు, ఎన్‌బీఎఫ్‌సీ రంగాల్లో సత్వరం సమస్యలు పరిష్కరించాలి. ప్రైవేటు రంగం నుంచి పెట్టుబడులు వచ్చేలా దీర్ఘకాలిక దృక్పథం కలిగిన సంస్కరణలూ కావాలి. ప్రోత్సాహకాలు, ఉద్దీపనలు తాత్కాలికంగా మాత్రమే ఉపకరిస్తాయి. జీడీపీని మనం ఎలా గణిస్తున్నామో, స్వతంత్ర నిపుణుల పర్యవేక్షణ ఉండాలని విశదీకరిం చారు. గత ఆర్థిక సంక్షోభంతో పోలిస్తే, ప్రస్తుతం అంతర్జాతీయంగా బ్యాంకుల స్థితి బాగానే ఉందని రాజన్ తెలిపారు. 2008లో పరపతి విధానం కీలకమైంది. ఇప్పుడు మెరుగైన విధానం కాదు, ప్రత్యేక విధానం కావాలి. మరో భారీ ఆర్థిక సంక్షోభం వస్తుందని భావించడం లేదని అయితే మన జాగ్రత్తలో మనం ఉండాల్సి ఉంది. వాటిని గమనంలోకి తీసుకుని ముందుకు సాగాల్సిన సమయమిదని ఆర్థిక వేత్తలు సూచిస్తున్నారు. ఇప్పటికే బ్యాంకుల తీరుపై ప్రజల్లో తీవ్ర అసంతృప్తి ఉంది.

## ప్రజాస్వామ్యంలో ట్రంప్ లాంటి పాలన పనికిరాదు

**- ప్రజలకు సేవ చేయడంలో విల్ పవర్ అవసరం : సీఎం రేవంత్**

**హైదరాబాద్,ఆగస్టు19( వెలుతురు):**
ప్రజాస్వామ్యంలో ఇష్టంవచ్చినట్టు పరిపాలన చేస్తానంటే ఎక్కువరోజులు మనుగడ సాగించలేరని సీఎం రేవంత్‌రెడ్డి అన్నారు. ప్రస్తుతం అమెరికా అధ్యక్షుడు ట్రంప్ ఇదే రీతిలో పాలన సాగిస్తున్నారని పేర్కొన్నారు.

ఆయనలాగే గత సీఎం పరిపాలన సాగింపు ఇప్పుడు.. అధికారం కోల్పోయారని ఎద్దేవా చేశారు. పరిపాలన చేయాలంటే పొలిటికల్ విల్ చాలా అవసరమన్నారు. తెలంగాణలో సైతం ఒక ట్రంప్ ఉండే వారని ఆయన వ్యంగ్యంగా అన్నారు. ఆ తెలంగాణ ట్రంప్‌ను ప్రజలు పక్కన పడేశారంటూ ఎద్దేవా చేశారు. ఢిల్లీ పర్యటనలో భాగంగా శుక్రవారం పబ్లిక్ అఫైర్స్ ఫోరం ఆఫ్ ఇండియా సదస్సులో సీఎం రేవంత్ రెడ్డి పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ట్రంప్ లాంటి వ్యక్తుల ఆటలు చాలా రోజులు కొనసాగవని జోస్యం చెప్పారు. రాత్రి కలలో అనుకున్నది ట్రంప్ పగలు అమలు చేస్తున్నారంటూ సీఎం రేవంత్ రెడ్డి వ్యాఖ్యానించారు. డొనాల్డ్ ట్రంప్ ఒక రోజు ప్రధాని మోదీని.. తన మిత్రుడని పేర్కొంటారన్నారు. ఆ వెంటనే భారత్‌పై 50 శాతం టారిఫ్‌లు విధిస్తారంటూ ట్రంప్ వ్యవహార శైలిని ఈ సందర్భంగా సీఎం రేవంత్ ఎండగట్టారు. భారతీయులకు వీసాలు ఇవ్వకపోతే అమెరికాకే నష్టమని పేర్కొన్నారు.

Edited, Printed, Published and Owner by BAKKA YADAIAH, Published & Printed at SRI SHANTHI PUBLICATIONS H.No. 7-2-31/221/2, S.V. Colony, Bairamalaguda, Saroornagar, Mdl.R.R. DIST, Telangana-79. EDITORG BAKKA YADAIAH, R.N.I. TEL TEL /2019 / 78609. Cell:91773 87328, Email: velthurunewspaper@gmail.com